
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 131

మంగళవారం 1-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పీచే కదా అని పారేయకండి

మొక్కజొన్న కంకుల పీచు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం -11లో



విజయమా... ప్రయోగమా!


నేడు వెస్టిండీస్‌తో భారత్ మూడో వన్డే. గెలిచిన జట్టుకు సిరీస్. -12లో



డీకే శివకుమార్‌కు ఊరట

అవినీతి కేసులో దర్యాప్తుకు సంబంధించి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది.

- వివరాలు 6లో



ఆ మైనర్ గర్భవిచ్ఛిత్తి పిటిషన్‌కి నో

పరస్పర అంగీకారంతో శృంగారంలో పాల్గొన్న ఓ బాలిక గర్భవిచ్ఛిత్తి పిటిషన్‌ను బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ తిరస్కరించింది.

- వివరాలు 6లో



వారిపై ప్రధాని ప్రశంసలు

భోజపత్ర కాలిగ్రఫీని జీవనోపాధిగా మార్చుకున్న ఉత్తరాఖండ్‌లోని నీతి-మనా లోయ మహిళలపై మోదీ ప్రశంసలు కురిపించారు.

- వివరాలు 6లో



పార్లమెంట్‌లో రచ్చరచ్చ


మణిపూర్ హింసాకాండపై తక్షణమే చర్చించాలని, ప్రధాని బదులివ్వాలని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పట్టుబట్టాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు, సత్యనారాయణ


దాసోజు శ్రవణ్


సత్యనారాయణ

ఎస్టీల్లోని ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ, బలహీనవర్గాల నుంచి దాసోజు శ్రవణ్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని కేటీఆర్ తెలిపారు. ఒకసారి కేబినెట్ నిర్ణయం తీసుకున్నాక గవర్నర్‌కు మరో మార్గం ఉండదని, ఈ విషయంలో ఆమె సహకరిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. గవర్నర్ కోటాలోని ఫారూఖ్ హుస్సేన్, రాజేశ్వర్‌రావుల పదవీకాలం మే27నే ముగిసింది. ఆ స్థానాల్లో ఇప్పుడు శ్రవణ్, సత్యనారాయణలను భర్తీ చేయనున్నారు.

ప్రొఫైల్స్.. -3లో

పాలనను గాలికి వదిలేశారు



రాష్ట్రంలో పాలనను సీఎం కేసీఆర్ పూర్తిగా గాలికి వదిలేశారని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులకు గులాబీ కండువాలు కప్పడంపై ఉన్న శ్రద్ధ తెలంగాణ వరద బాధితులను ఆదుకోవడంపై సీఎం కేసీఆర్ పెట్టి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. భారీ వర్షాలు వస్తాయని తెలిసినప్పటికీ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయని కారణంగానే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగిందని ఆరోపించారు.

- వివరాలు 2లో ▶

మృతదేహాన్ని కొరికేసిన ఎలుకలు!

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో ఉన్న ఓ మృతదేహాన్ని ఎలుకలు కొరుక్కుతిన్నాయి. ఈ ఉదంతంపై మృతుని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. అయితే ఈ ప్రచారం అవాస్తవమని ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నా నాయక్ తెలిపారు.

- వివరాలు 5లో ▶

డిజిటల్ లైఫ్‌లో యాంటీ వైరస్! 14లో

ముప్పేట పెరుగుతున్న వైరస్ ఎటాక్‌లు

ఆర్టీసీ ఉద్యోగులకు సర్కారీ కొలువు

43,373 మంది ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు

విధివిధానాల రూపకల్పనకు అధికారులతో కమిటీ ఏర్పాటు

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు పెడతాం

కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి కేటీఆర్




కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికుల సంబరాలు

- వరద బాధితుల కోసం తక్షణ సాయంగా రూ.500 కోట్లు విడుదల.. మరణించిన 40మందికిపైగా కుటుంబాలకు పరిహారం
- గవర్నర్ తిప్పిపంపిన బిల్లులను మళ్లీ అసెంబ్లీలో ఆమోదించి పంపుతాం
- రాష్ట్రంలో మరో 8 వైద్య కళాశాలల ఏర్పాటు

హైదరాబాద్ నగరంలో అన్ని మూలలకూ మెట్రో రైల్ 2లో

టిమ్స్‌లలో 'పెయిడ్' సేవలు ▶ గడ్డి అన్నారం, అల్వాల్, సనత్‌నగర్, గచ్చిబౌలిలలో నిర్మించనున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో హైబ్రిడ్ పద్ధతిలో సేవలు అందించాలని కేబినెట్ నిర్ణయించింది. అంటే.. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల తరహాలో 50% జనరల్ కన్సల్టేషన్ పడకలు.. నిమ్స్ తరహాలో ఫీజు చెల్లింపు విధానంలో మిగతా 50% పడకలు ఉంటాయి. నిమ్స్‌లో మరో 2 వేల పడకల ఏర్పాటు పనుల వ్యయ అంచనాను రూ.1,800 కోట్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

గవర్నర్‌కు గత్యంతరం లేదు!

రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ తిప్పిపంపిన మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖలకు సంబంధించిన మూడు బిల్లులను మళ్లీ రాష్ట్ర శాసనసభలో ఆమోదించి.. రాజ్‌భవన్‌కు పంపాలని కేబినెట్ నిర్ణయించిందని కేటీఆర్ తెలిపారు. శాసనసభ రెండోసారి పాస్ చేసిన బిల్లుల విషయంలో గవర్నర్‌కు మరో గత్యంతరం ఉండదని.. రాజకీయంగా ఎలాంటి అభిప్రాయాలు కలిగి ఉన్నా రాజ్యాంగం ప్రకారం ఆమోదించక తప్పదని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిదే ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. గవర్నర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.


సోమవారం తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అలిశెట్టి లక్ష్మీనారాయణ, కళాసికం సుజన, జూకంటి అనిల్ కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే 10లో

భారీ వర్షాలు, వరదల్లో 41 మంది మృతి


హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

240 ఇళ్లు ధ్వంసం | **5,900** ఎకరాల్లో పంట నష్టం

సాక్షి, హైదరాబాద్: కొద్ది రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో 240 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, 41 మంది మృతి చెందారని హైకోర్టుకు ప్రభుత్వం సోమవారం నివేదిక సమర్పించింది. మరో 5 వేల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, దాదాపు 5,900 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పింది. హెలికాప్టర్ ద్వారా ఐదుగురిని రక్షించామని పేర్కొంది. వర్షాలు, వరదలు ఇంకా కొనసాగనున్న నేపథ్యంలో పూర్తి రక్షణ చర్యలు తీసుకున్నామని పేర్కొంది. జాతీయ విపత్తుల నిర్వహణ కమిటీ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ మేరకు హైకోర్టుకు నివేదిక సమర్పించారు. వరద నష్టాలపై ఇంకా సర్వే నడుస్తోందని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. వరదలు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. గత వారం ఇచ్చిన ఆదేశాల మేరకు నివేదిక సమర్పించామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్ తెలిపారు. అయితే, ఈ నివేదికపై పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించాక తగిన ఆదేశాలు జారీ చేస్తామంటూ ధర్మాసనం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

వచ్చే రెండు నెలలు దేశంలో సాధారణ వర్షాలే 6లో

ఆత్మరక్షణ కాదు.. ఎదురుదాడే!



అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ వ్యూహం

- వివిధ అంశాలపై విపక్షాలను దీటుగా ఎదుర్కోవడంపై దృష్టి
- ప్రభుత్వ విజయాలను చాటి చెప్పేలా మంత్రులు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం
- ఉచిత విద్యుత్ అంశంపై స్వల్పకాలిక చర్చ జరపాలనే యోచన

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో ఆత్మరక్షణ ధోరణి కాకుండా ఎదురుదాడి వ్యూహాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా, ఈ సమావేశాలే తెలంగాణ రెండో శాసనసభ (2018–23) చివరి భేటీ కానుంది. ఏడాది చివరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయాలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ వేదికగా విపక్షాల నుంచి ఎదురయ్యే విమర్శలు తిప్పి కొట్టడంతో పాటు తెలంగాణ రాష్ట్ర అవతరణ నాటి నుంచి తమ ప్రభుత్వ విజయాలను గట్టిగా చాటి చెప్పాలని అధికార బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో లోపాలు, తాజాగా రాష్ట్రవ్యాప్తంగా సంభవించిన భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టం తదితర అంశాలను విపక్ష పార్టీలు ఎత్తి చూపే అవకాశముందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. విపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఇటీవలి కాలంలో ధరణి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి అంశాలను ఎక్కువగా ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నాయి. అసెంబ్లీలోనూ ఇవే అంశాలు వివిధ రూపాల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉండటంతో విపక్షాలను దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన

మిగతా 2వ పేజీలో ▶

నవంబర్ 19 అఫిడవిట్ ఆధారంగా విచారణ

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై పిటిషన్‌లో హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా గెలుపొందిన శ్రీనివాస్‌గౌడ్‌పై దాఖలైన ఎన్నికల పిటిషన్‌పై 2018, నవంబర్ 19న సమర్పించిన అఫిడవిట్ ఆధారంగా విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు అఫిడవిట్, సాక్ష్యాలను సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది. 2018 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా శ్రీనివాస్ గౌడ్ గెలిచారు. అయితే ఆ సమయంలో నవంబర్ 14న, నవంబర్ 19న రెండుసార్లు శ్రీనివాస్ గౌడ్ అఫిడవిట్లు దాఖలు చేశారని.. ఆస్తులు, ఆదాయం, రుణాల వివరాలను తప్పుగా చూపించారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు

మిగతా 2వ పేజీలో ▶

బండి సంజయ్ విచారణకు కోర్టు కమిషనర్

గంగులపై దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో బండి సంజయ్ విచారణకు హైకోర్టు రిటైర్డ్ జిల్లా జడ్జి శైలజను కోర్టు కమిషనర్‌గా నియమించింది. ఈనెల 12 నుంచి 17 వరకు క్రాస్ ఎగ్జామినేషన్ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. గత ఎన్నికల్లో కరీంనగర్ నుంచి గంగుల బీఆర్ఎస్ తరఫున గెలిచారు. అయితే అఫిడవిట్‌లో గంగుల తప్పుడు వివరాలు ఇచ్చారని, అందువల్ల ఆయన ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వాలంటూ సమీప ప్రత్యర్థి బండి సంజయ్ 2019 జనవరిలో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత సోమవారం మళ్లీ విచారణ చేపట్టారు. వాదనల అనంతరం కోర్టు కమిషనర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్‌కు నియమిస్తూ తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేశారు.



మణిపూర్ దురాగతం.. భయానకం

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- మహిళలపై జరిగిన హింసను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడలేం
- ఇతర రాష్ట్రాలను ప్రస్తావించి మణిపూర్ దారుణాలను సమర్థించుకోలేరు 6లో
- బాన్సురీ స్వరాజ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 6 ప్రశ్నలు
- 24 గంటల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశం



ఆ మంత్రులను తొలగించండి

కోర్టు ఇచ్చిన తీర్పులను సీఎం కేసీఆర్ అమలు చేయాలి

- అసెంబ్లీని నెల రోజులు నిర్వహించాలి..
- అందరికీ మాట్లాడే అవకాశమివ్వాలి
- ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్

వివరాలు 2లో



గుదిబండ.. 'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి ఆంధ్రప్రదేశ్‌పై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మళ్లీ వెలుగులోకి.. 10లో

- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- ఈ ఏడాది మార్చి చివరకు మొత్తం అప్పులు రూ.4,42,442 కోట్లు
- లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఇవాంటుఆర్ట్



రైల్లో కానిస్టేబుల్ కాల్పులు



సీనియర్, ముగ్గురు ప్రయాణికులపై ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ దురాగతం

- ఆటోమెటిక్ రైఫిల్‌తో పన్నెండు రౌండ్ల కాల్పులు 6లో
- తూటా గాయాలతో నలుగురూ అక్కడికక్కడే దుర్మరణం
- జైపూర్ – ముంబై ఎక్స్‌ప్రెస్‌లో ఘటన
- కానిస్టేబుల్ పారిపోతుండగా పట్టుకున్న రైల్వే పోలీసులు



ఆ మూడు పార్టీలూ ఒక్కటే

మహబూబ్‌నగర్ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు ఒక్కటే.. అందుకే ఉమ్మడి పౌర స్మృతిని వ్యతిరేకిస్తున్నాయి
- వచ్చే ఎన్నికల్లో మా విజయం ఖాయం
- ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో మహార్యాలీ

10లో


సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన మహార్యాలీలో పార్టీ శ్రేణులతో కిషన్‌రెడ్డి

నేడు మహారాష్ట్రకు సీఎం కేసీఆర్

అంబాబాయి మందిరంలో పూజలు.. అన్నాభావు సాఠే వర్ధంతికి హాజరు



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేడు (మంగళవారం) మహారాష్ట్రలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.15 గంటలకు కొల్హాపూర్ విమానాశ్రయానికి చేరుకుంటారు. కొల్హాపూర్‌లోని అంబాబాయి(మహాలక్ష్మి) దేవాలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.45 గంటలకు సాంగ్లి జిల్లాలోని వటేగావ్ చేరుకుని మహారాష్ట్రలో పేరొందిన సామాజిక కార్యకర్త, రచయిత అన్నాభావు సాఠే వర్ధంతి

మిగతా 2వ పేజీలో ▶

బీఎస్పీ ఎన్నికల ప్రచార లోగో విడుదల

‘ఓటు మాకు– అధికారం మీకు’ పేరుతో లోగోను ఆవిష్కరించిన ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: రాబోయే శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి బహుజన సమాజ్ పార్టీ ప్రచార లోగోను ఆపార్టీ ముఖ్య మంత్రి అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు ‘ఓటు మాకు – అధికారం మీకు’అనే ప్రచార లోగో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికీ ‘ఓటు వేయండి– అధికారం ఇవ్వండి’అంటున్నాయని, బీఎస్పీ పార్టీ మాత్రం మాయావతి నాయకత్వంలో ప్రజలకు సరైన అధికారం ఇవ్వాలని నిర్ణయించిందని అన్నారు. అందుకే ‘ఓటు మాకు అధికారం మీకు’అనే నినాదంతో బీఎస్పీ లోగోను ఆవిష్కరించినట్లు తెలిపారు.

అసైన్డ్ భూముల్లో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది

రాష్ట్రవ్యాప్తంగా పేదలకు చెందిన 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వమే లాక్కుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పేదల అసైన్డ్ భూముల్లో స్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు కడుతున్న ప్రభుత్వం..వాటిని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ఫామ్‌హౌస్‌లలో కడితే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం వాటిని క్రమబద్ధీకరించి, పట్టాలు ఇస్తున్నా తెలంగాణలో మాత్రం అలా చేయడంలేదన్నారు. ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు అప్పనంగా ఇస్తున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూముల అక్రమణలపై త్వరలోనే హైకోర్టులో పిల్ వేయనున్నట్లు చెప్పారు.

థాక్రేతో పొంగులేటి భేటీ

జానా నివాసంలో మంతనాలు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ థాక్రేతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని సీనియర్ నేత జానారెడ్డి నివాసంలో జానాతో కలిసి ఆయన థాక్రేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై చేయాల్సిన పోరాట కార్యాచరణ గురించి చర్చించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ...సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నేడు మహారాష్ట్రకు సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సాఠే నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులతో భేటీ అవుతారు. ఈ సందర్భంగా సాఠే కోడలు, మనవడితోపాటు వివిధ పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతారని పార్టీ నేతలు వెల్లడించారు. మధ్యాహ్నం 1.30కు ఇస్లాంపూర్‌లోని షేత్కారి సంఘటన్ నేత రఘునాథ్ దాదాపాటిల్ నివాసంలో కేసీఆర్ భోజనం చేస్తారు. సాయంత్రం ఐదు గంటలకు కొల్హాపూర్ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అన్నాభావు సాఠే మహారాష్ట్రలో పలు సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సాఠే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటున్న తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు సర్కారీ కొలువు

- 43,373 మంది ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనం చేయాలని.. 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన ఆర్అండ్‌బీ, రవాణా, కార్మిక, సాధారణ పరిపాలన శాఖల కార్యదర్శులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆగస్టు 3 నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో.. వివిధ పనులు, కార్యక్రమాల కోసం తక్షణ సాయంగా రూ.500 కోట్లు విడుదల చేసింది. వరద మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. సుమారు 50కిపైగా అంశాలపై సుదీర్ఘంగా 6 గంటల పాటు చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు సహచర మంత్రులతో కలసి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రవాణా, ఆర్థిక శాఖల మంత్రులు, ఆర్టీసీ చైర్మన్‌తోపాటు కార్మికుల నుంచి వచ్చిన డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిర్ణయించామని తెలిపారు. ఆర్టీసీని కాపాడేందుకు, ప్రజారవాణాను విస్తృతం చేయడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని చెప్పారు.

వరద తక్షణ సాయంగా రూ.500 కోట్లు

రాష్ట్రంలో పది రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు, వరదలతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టంపై మంత్రివర్గం విస్తృతంగా చర్చించిందని.. తక్షణ సాయంగా రూ.500 కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు. ముఖ్యంగా భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, నిర్మల్, ఆదిలాబాద్, ఖమ్మం, కొత్తగూడెం తదితర 10 జిల్లాల్లో ఆర్అండ్‌బీ/ పంచాయతీరాజ్ రోడ్లు, చెరువులు, కాల్వలు, పంట పొలాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని.. యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులకు ఈ నిధులను వినియోగించాలని ఆదేశించినట్టు వివరించారు. ఇక వివిధ జిల్లాల్లో పునరావాస కేంద్రాలకు తరలించిన 27వేల మంది ముంపు బాధితులకు సురక్షితమైన పునరావాసం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. వరదల్లో మృతి చెందిన 40 మందికిపైగా వివరాలను సేకరించి, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆదేశించినట్టు చెప్పారు. వరదలతో పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలు, ఇతర సమస్యలపై సమగ్రమైన నివేదిక అందించాలని కలెక్టర్లను కేబినెట్ ఆదేశించిందని.. రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖకు సూచించిందని వివరించారు. ఖమ్మం పొడవునా ప్రవహిస్తున్న మున్నేరువాగు వరద నుంచి పట్టణానికి రక్షణకోసం వరద గోడలు నిర్మించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

వారి సేవలు భేష్..

వరద ముప్పును సైతం లెక్కచేయకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ధైర్య సాహసాలతో విధులు నిర్వహించిన విద్యుత్ శాఖ లైన్‌మన్, హెల్పర్‌తోపాటు ముందుచూపుతో 40మంది విద్యార్థులను కాపాడిన ఉపాధ్యాయుడు మీనయ్యను ఈ పంద్రాగస్టు సందర్భంగా సన్మానించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వారి సేవలను సీఎం కేసీఆర్ స్వయంగా ప్రస్తావించి కొనియాడారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

అనాథల కోసం ప్రత్యేక పాలసీ

రాష్ట్రంలోని అనాథ పిల్లలను ‘చిల్డ్రన్ ఆఫ్ ది స్టేట్’గా గుర్తిస్తూ.. వారి సంరక్షణ, ఆలనా పాలన చూసుకోవడానికి పకడ్బందీగా ‘అనాథ బాలల పాలసీ’ని రూపొందించాలని శిశుసంక్షేమ శాఖను కేబినెట్ ఆదేశించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అనాథ పిల్లలకు తల్లిదండ్రులుగా నిలుస్తుందని.. ఆశ్రయం కల్పించి, ప్రయోజకులుగా మార్చి, వారికంటూ ఓ కుటుంబం ఉన్నట్టుగా సంరక్షిస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

కేబినెట్ తీసుకున్న మరిన్ని కీలక నిర్ణయాలివీ..

- రాష్ట్రవ్యాప్తంగా 6 వేల మంది బీడీ టేకేదారులకు ఆసరా పెన్షన్ ఇవ్వాలని కార్మిక శాఖను కేబినెట్ ఆదేశించింది.
- వరంగల్‌లోని మామునూరులో విమానాశ్రయం నిర్మాణానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కోరిన మేరకు 253 ఎకరాల భూమిని సేకరించాలని కేబినెట్ నిర్ణయించింది. బీదర్ తరహాలో ఇక్కడ విమానాశ్రయం నిర్వహించాలని, ఇకపై కుంటిసాకులు చెప్పవద్దని అథారిటీకి మంత్రి కేటీఆర్ సూచించారు.
- శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణీకుల రద్దీ పెరిగిన నేపథ్యంలో.. ఇతర నగరాల తరహాలో హైదరాబాద్‌లోనూ రెండో ఎయిర్‌పోర్టు అవసరమని మంత్రివర్గం అభిప్రాయపడింది. పుణె, గోవాలలో రక్షణ రంగ విమానాశ్రయాలను పౌర విమానాశ్రయాలుగా వినియోగిస్తున్న తరహాలోనే హకీంపేట ఎయిర్‌పోర్టును పౌర విమానయాన సేవలకు వినియోగించాలని రక్షణ శాఖకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రక్షణ, పౌరవిమానయాన శాఖలకు ప్రతిపాదనలు పంపిస్తామని కేటీఆర్ తెలిపారు.
- దేశవ్యాప్తంగా ఉన్న కాపు, బలిజ వంటి కాపు అనుబంధ కులాల కోసం ‘సౌత్ ఇండియా సెంటర్ ఫర్ కాపు కమ్యూనిటీ’ నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.
- రాష్ట్రంలో మరో ఎనిమిది వైద్య కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనితో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ ఆశయం సాకారమైందని కేటీఆర్ చెప్పారు.
- మహబూబాద్ జిల్లా కేంద్రంలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుకు మంత్రివర్గం ఓకే చెప్పింది.
- వరదల్లో చనిపోయినవారిలో రైతు బీమా ఉన్న వారికి రూ.5 లక్షల సొమ్ము ఆటోమెటిగ్గా వస్తుందని, మరో రూ.4లక్షలు ఎక్స్‌గ్రేషియాగా చెల్లిస్తామని కేటీఆర్ తెలిపారు.

సంస్థకు భరోసా.. ఉద్యోగ భద్రత

- నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ప్రభుత్వంలో విలీనంతో ఊపిరి
- ఏపీలో 2020లోనే ఆర్టీసీ విలీనం

సాక్షి, హైదరాబాద్: తీవ్ర ఆర్థిక కష్టనష్టాలతో దివాలా దిశలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు.. ప్రభుత్వంలో విలీనం ద్వారా ఊపిరిలూదినట్టయింది. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న తాజా నిర్ణయంతో సంస్థ మనుగడకు భరోసా, అందులోని 43,373 సిబ్బందికి ఉద్యోగ భద్రత లభించనుంది. పింఛన్ సదుపాయం సైతం లభించనుంది. ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్న సిబ్బంది మొత్తం రాష్ట్ర ప్రజా రవాణా శాఖ ఉద్యోగులుగా మారనున్నారు. అయితే ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైనప్పటికీ, తెలంగాణ ఆర్టీసీ మాత్రం మనుగడలోనే ఉండనుంది. అందులో కేంద్ర ప్రభుత్వ ఈక్విటీ ఉన్నందున, కార్పొరేషన్‌ను రద్దు చేయటం అంత సులభమైన ప్రక్రియ కాదు. అందువల్ల ప్రస్తుతానికి కార్పొరేషన్‌గా కొనసాగుతూనే.. ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ సిబ్బందిగా చెలామణి కానున్నారు. విలీన ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి అధికారుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా విధివిధానాలు ఖరారు కానున్నాయి. 2020లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఫలితంగా అక్కడి ప్రజా రవాణా సంస్థ బలపడింది. ఉద్యోగుల ఆర్థిక స్థితిగతుల్లో మెరుగుదలతో వారిలో సంతృప్తి వ్యక్తమవుతోంది.

తీరనున్న అప్పులు!

ఈ విలీన ప్రక్రియతో ఆర్టీసీపై జీతాల భారం పూర్తిగా తొలగనుంది. ప్రస్తుతం సంస్థ ప్రతి నెలా రూ.200 కోట్ల మేర జీతాల రూపంలో భరిస్తోంది. విలీనం తర్వాత జీతాలను ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించనున్నందున, తద్వారా మిగిలే రూ.200 కోట్లను సంస్థ అప్పులు, బకాయిలు తీర్చేందుకు వినియోగించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీకి రూ.2,400 కోట్ల బ్యాంకు అప్పులున్నాయి. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, భవిష్యనిధి, ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్) బకాయిలు మరో రూ.3,600 కోట్లు ఉన్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పే స్కేల్

ప్రభుత్వంలో విలీనం నేపథ్యంలో ఆర్టీసీలోని శ్రామిక్, అటెండర్, డ్రైవర్, కండక్టర్ మొదలుకుని రీజినల్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.. ఇలా సంస్థలోని అన్ని పోస్టులను ప్రభుత్వంలోని తత్సమాన పోస్టుల్లోకి మారుస్తారు. ఆయా పోస్టులకు వచ్చే వేతన స్కేల్‌ను వర్తింపజేస్తారు. ఇక విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ సదుపాయం లభించనుంది. సిబ్బంది ఆర్టీసీలో చేరిన సంవత్సరం ఆధారంగా పింఛన్ విధానాన్ని ఖరారు చేస్తారు.

ఐదేళ్లకోసారి పీఆర్సీ: ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులకు 2017, 2021 పే స్కేల్ పెండింగులో ఉంది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. విలీనంతో ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ ప్రకారం స్కేల్‌ను వర్తింపజేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్టీసీలో ప్రతి నాలుగేళ్లకు పే రివిజన్ జరుగుతుండగా, విలీనం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా ప్రతి ఐదేళ్లకోసారి పీఆర్సీ ద్వారా జీతాల పెంపు ఉంటుంది. ఆర్టీసీకి 1,500 ఎకరాల సొంత భూములు న్నాయి. ఇప్పుడు ప్రభుత్వంలో విలీనం నేపథ్యంలో, ఈ భూములను ప్రభుత్వం తన పరిధిలోకి తీసుకుంటుందా? కార్పొరేషన్ అధీనంలోనే ఉంచుతుందా? అన్నది చూడాల్సి ఉంది.

కార్మిక సంఘాల హర్షం

‘తెలంగాణ వచ్చినప్పటి నుంచి చేస్తున్న డిమాండ్ ఇప్పుడు నెరవేరినందుకు సంతోషంగా ఉంది. అయితే విలీన విధివిధానాలు ఖరారు చేసే కమిటీలో ఆర్టీసీ కార్మిక సంఘాలకు కూడా చోటు కల్పించాలి..’అని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ‘ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటంలో ఎన్ఎంయూ పాత్ర ఉంది. తెలంగాణలోనూ చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికి అది నెరవేరింది. కార్మికులకు అధిక లబ్ధి కలిగేలా విలీన విధివిధానాలు రూపొందించాలి..’అని ఎన్ఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ అన్నారు.

ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగు నింపారు: బాజిరెడ్డి గోవర్ధన్



సీఎం కేసీఆర్‌ది ఎంతో గొప్ప మనసని, ఎప్పట్నుంచో కష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు గొప్ప వరం అందించి, వారి కష్టాలన్నీ ఏకకాలంలో పోగొట్టారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా సంస్థ విలీనంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పాలనను గాలికి వదిలేశారు

- సీఎం కేసీఆర్ ప్రజలనే కాదు రాముడినీ మోసం చేశారు
- వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ నేడు గవర్నర్‌ను కలుస్తాం: సీఎల్పీ నేత భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలనను సీఎం కేసీఆర్ పూర్తిగా గాలికి వదిలేశారని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ‘బీఆర్ఎస్ రాజకీయ అవసరాల కోసం ప్రత్యేక విమానాల్లో పొరుగు రాష్ట్రాల నేతలను ప్రగతిభవన్‌కు పిలిపించుకుని గులాబీ కండువాలు కప్పారు. కానీ వరదలతో ముప్పు ఉందని, తమకు హెలికాప్టర్లు, రెస్క్యూటీంలను తమ ప్రాంతాలకు పంపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీతక్క, పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావులు కోరినా పెడచెవిన పెట్టారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులకు గులాబీ కండువాలు కప్పడంపై ఉన్న శ్రద్ధ తెలంగాణ వరద బాధితులను ఆదుకోవడంపై సీఎం కేసీఆర్ పెట్టి ఉంటే బాగుండేది.’అని ఆయన వ్యాఖ్యానించారు. భారీ వర్షాలు వస్తాయని తెలిసినప్పటికీ అధికార యంత్రాంగాన్ని అప్ర మత్తం చేయని కారణంగానే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగిందని ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో భట్టి మాట్లాడుతూ ప్రభుత్వ అశ్రద్ధ, మానవ తప్పిదాల వల్లనే గతంలో ఎన్నడూ లేని విధంగా 60 మంది చనిపోయారని, ఈ విషాదానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీ పక్షాన వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

ఇష్టారాజ్యంగా చెక్‌డ్యాంలు నిర్మించిన కారణంగానే

చెరువుల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోని కారణంగా 69 చెరువులు తెగిపోయి ఒక్కసారిగా వాగులు పొంగి మోరంచపల్లి అనే గ్రామం మునిగిపోయిందని భట్టి నిందించారు. సాంకేతిక ప్రమాణాలతో కాకుండా రాజకీయ అవసరాల కోసం ఇష్టారాజ్యంగా చెక్‌డ్యాంలు నిర్మించారని, శాస్త్రీయత లేకుండా సీఎం కేసీఆర్ సొంత ఆలోచనలతో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులను నిర్మించిన కారణంగానే మంథని, చెన్నూరు, మంచిర్యాలలో పెద్ద ఎత్తున పంటలు మునిగిపోయాయని అన్నారు. వరదలపై సమీక్షలు మేనెలలోనే నిర్వహించాల్సి ఉన్నా ఎందుకు చేయడలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన అధికారులను వరద ముంపు గ్రామాలకు పంపి అక్కడ నష్టాలను అంచనా వేయించి వెంటనే పరిహారం అందించేలా సీఎస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.1000 కోట్లు ఎక్కడ?

ప్రజలను మోసం చేయడం అలవాటుగా చేసుకున్న సీఎం కేసీఆర్ భద్రాచలం రాముడిని కూడా మోసం చేశారని భట్టి వ్యాఖ్యానించారు. ‘వరదలు వచ్చినప్పుడు భద్రాచలం పట్టణం ముంపునకు గురికాకుండా ఉండేందుకు కర కట్టలు, కాలనీల నిర్మాణం కోసం రూ.1000 కోట్లు ఇస్తామని గతంలో చెప్పారు. మళ్లీ వరదలు వచ్చి భద్రాచలం ముంపునకు గురైనప్పటికీ రూపాయి ఇవ్వలేదు. దేవుడినే మోసం చేసిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని భద్రాచలం రాముడిని మొక్కి వచ్చాను’’అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వరద బాధితులకు అండగా నిలవాల్సిన సామాజిక బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని, వరద సహాయక చర్యల్లో కాంగ్రెస్ శ్రేణులు ముమ్మరంగా పాలుపంచుకోవాలని, వరద బాధితులకు ధైర్యం ఇచ్చి అండగా నిలవాలని భట్టి పిలుపునిచ్చారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యం

- జేపీ నడ్డాతో భేటీలో బండి సంజయ్
- అధిష్టానం ఏ బాధ్యతలు ఇచ్చినా సిద్ధమేనని వెల్లడి
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని నడ్డా సూచన



జేపీ నడ్డాను సత్కరిస్తున్న బండి సంజయ్. చిత్రంలో రాధామోహన్‌దాస్

సాక్షి, న్యూఢిల్లీ: నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం అయిన తర్వాత బండి సంజయ్ ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తొలిసారిగా సోమవారం జేపీ నడ్డాతో 15 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా త్వరలో తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలు, సంస్థాగత వ్యవహారాలపై జేపీ నడ్డా ఆరా తీశారు. తెలంగాణ సహా పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించే రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో తెలంగాణ తరహాలో కృషి చేయాలని నడ్డా బండి సంజయ్‌కు సూచించారు. అనంతరం బండి మాట్లాడుతూ...పార్టీ అధిష్టానం ఏ బాధ్యతలు అప్పగించినా పని చేస్తానని...కేంద్రంలో బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అవకాశమిచ్చినందుకు జేపీ నడ్డాకు శాలువా కప్పి బండి సంజయ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కాదు.. ఎదురుదాడే!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యూహంపై అధికార పక్షం కసరత్తు చేస్తోంది.

విమర్శలు తిప్పికొట్టేలా..

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అంశంపై ఇటీవల కాంగ్రెస్ పార్టీ చేసిన విమర్శలపై బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్ర స్థాయిలో ఆందోళనకు దిగి పెద్దయెత్తున ఎదురుదాడి చేశాయి. దీంతో పాటు అసెంబ్లీ వేదికగా కూడా కాంగ్రెస్ ఆరోపణలను ఎండగట్టాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఈ అంశంపై స్వల్పకాలిక చర్చకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ధరణి పోర్టల్ అంశంపైనా విపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా ప్రశ్నోత్తరాలు లేదా ఇతర అంశాల రూపంలో అధికార పార్టీ చర్చకు పెట్టే అవకాశముంది. ఎన్నికల ఏడాది కావడంతో రాష్ట్ర అవతరణ మొదలుకుని తొమ్మిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల విజయాలను చాటి చెప్పేలా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు ఇప్పటికే అంశాల వారీగా బాధ్యతలు అప్పగించడంతో పాటు చర్చలు, ప్రసంగాలు సన్నద్ధం కావాల్సిందిగా కోరుతూ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయం సమాచారం ఇచ్చింది. దీంతో తొమ్మిదేళ్లలో శాఖల వారీగా వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించేందుకు అవసరమైన సమాచార సేకరణపై ఇప్పటికే మంత్రులు దృష్టి సారించారు. రాష్ట్రంలో వరద నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి సహాయం అందకపోవడాన్ని ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీలో ఖరారు చేసే ఎజెండాకు అనుగుణంగా వ్యూహాలకు పదును పెట్టాలని అధికార పార్టీ శిబిరం భావిస్తోంది.

నవంబర్ 19 అఫిడవిట్ ఆధారంగా విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని, ఆయన ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇవ్వాలని కోరారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. అఫిడవిట్ మార్చి ఇవ్వడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే ఏ అఫిడవిట్ తీసుకున్నా అభ్యంతరం లేదని చెప్పారు. దీంతో న్యాయమూర్తి నవంబర్ 19న శ్రీనివాస్‌గౌడ్ దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా విచారణ చేపడతామని చెప్పారు.

మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయండి!

ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్‌పై దాఖలైన కేసులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు రాష్ట్ర, కేంద్ర రిటర్నింగ్ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. 2018, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపరింగ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదంటూ రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న జడ్జి.. మంత్రి సహా సదరు ఐఏఎస్ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తీర్పు ఇచ్చినట్లు తెలిసింది.

ఆ ముగ్గురు మంత్రులను తొలగించండి



సాక్షి, హైదరాబాద్: వివిధ అంశాలపై కోర్టుల ఆదేశాల నేపథ్యంలో ముగ్గురు మంత్రులను కేబినెట్ నుంచి తొలగించాలని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. పలువురు అధికార పార్టీ నేతలపై కోర్టు ఇచ్చిన తీర్పులను సీఎం కేసీఆర్ అమలు చేయాలన్నారు. ఎన్నికల అఫిడవిట్ ట్యాంపరింగ్ వివాదంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తోపాటు 11 మందిపై కేసులు నమోదు చేయాలని కోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మంత్రి గంగుల కమలాకర్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో సాక్ష్యాలను రికార్డ్ చేయాలని కోర్టు ఆదేశించిందని, మరో మంత్రిపై కూడా కోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. రఘునందన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ముగ్గురిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు జరగనున్న చివరి అసెంబ్లీ సమావేశాలను నెల రోజులు నిర్వహించాలన్నారు. ఈ చివరి సభలో అయినా అందరూ మాట్లాడే అవకాశం ఇచ్చేందుకు వీలుగా నడపాలని సీఎం కేసీఆర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. ‘తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆంధ్ర సీఎంల పేరు వాడుకుంటున్నారు. కిషన్‌రెడ్డి మాజీ కిరణ్‌కుమార్ రెడ్డి శిష్యుడు అంటూ వార్తలు ప్రచారం చేస్తున్నారు. సంజయ్ గాంధీ, చంద్రబాబుల శిష్యుడు కేసీఆర్, రాజశేఖర్ రెడ్డి శిష్యుడు హరీశ్ రావు’ అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ‘కాంగ్రెస్ పార్టీ బ్యాంక్‌ల ముందు ధర్నా చేస్తుందంట. రైతు రుణమాఫీ కోసం సెక్రటేరియట్ ముందుగానీ లేదా మంత్రి ఇంటి ముందుగానీ చేయాలి. ఇది కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ఆడుతున్న డ్రామా’ అని వ్యాఖ్యానించారు.

అన్ని మూలలకూ మెట్రో రైల్!

సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరాల్లో అగ్రస్థానంలో ఉన్న హైదరాబాద్‌లో ప్రజారవాణాను మెరుగుపర్చేందుకు మెట్రో రైల్‌ను భారీగా విస్తరించాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. రూ.60 వేల కోట్ల ప్రాథమిక అంచనాతో మూడో విడత మెట్రో రైల్ విస్తరణ చేపట్టనున్నామని.. మూడు నాలుగేళ్లలో పూర్తి చేసేలా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, పురపాలక శాఖలను ఆదేశించామని తెలిపారు. హైదరాబాద్‌లో తొలి విడత కింద 70 కిలోమీటర్ల పొడవున మెట్రో రైలు మార్గాన్ని నిర్మించారు. రెండో విడతలో రాయదుర్గం- ఎయిర్‌పోర్టు మధ్య 31 కిలోమీటర్ల మార్గానికి ఇటీవలే సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. తాజాగా కేటీఆర్ మూడో విడత వివరాలను వెల్లడించారు. మెట్రో రైల్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని, ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్టు మనకు కూడా ఇస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. కేంద్రం ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్మించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. 2024 తర్వాత ఎలాగూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని, అందులో బీఆర్ఎస్ పాత్ర కీలకంగా ఉంటుందని.. అందువల్ల తప్పకుండా మెట్రోకు నిధులు సాధించుకుంటామనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

మెట్రో రైల్ మార్గాలకు సంబంధించి కేటీఆర్ తెలిపిన వివరాలివీ..

- జూబ్లీ బస్టాండ్ నుంచి తూంకుంట వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ తరహాలో మెట్రో రైల్ మార్గం. ఒక లెవల్‌లో వాహనాలు, మరో లెవల్‌లో మెట్రో మార్గం.
- ఆదిలాబాద్-నాగ్‌పూర్ రూట్‌లో ప్యాట్నీ నుంచి కండ్లకోయ ఓఆర్ఆర్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ మెట్రో రైల్ మార్గం. ఇందుకోసం రక్షణ శాఖ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతంగా చేయాలని ఆదేశం.
- హైదరాబాద్ ఈస్ట్ వెస్ట్‌లో ఇస్నాపూర్- మియాపూర్ వరకు మెట్రో విస్తరణ
- మియాపూర్- లక్డీకాపూల్ మధ్య మరో మార్గం నిర్మాణం
- విజయవాడ రూట్‌లో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ వరకు మెట్రో విస్తరణ
- వరంగల్ రూట్‌లో ఉప్పల్ నుంచి బీబీ నగర్ వరకు విస్తరణ
- భవిష్యత్తులో కొత్తూరు మీదుగా షాద్‌నగర్ వరకు మెట్రో విస్తరణకు నిర్ణయం
- ఉప్పల్ నుంచి ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ దాకా విస్తరణ..

మెట్రో పార్ట్–ఏ విస్తరణ కారిడార్ల ప్రతిపాదనలివీ..

కారిడార్	ఏ తరహా నిర్మాణం?	నిడివి (కి.మీలో)	స్టేషన్లు	వ్యయం (రూ.కోట్లలో)
1.బీహెచ్ఈఎల్ -పటాన్‌చెరు -ఓఆర్ఆర్ -ఇస్నాపూర్	ఎలివేటెడ్	13	8	3,250
2.ఎల్బీనగర్-హయత్‌నగర్-పెద్ద అంబర్‌పేట్	ఎలివేటెడ్	13	8	3,250
3.శంషాబాద్ జంక్షన్ -కొత్తూరు-షాద్‌నగర్	ఎలివేటెడ్	28	6	6,800
4.ఉప్పల్-ఓఆర్ఆర్-ఘట్కేసర్-బీబీనగర్	ఎలివేటెడ్	25	10	6,900
5.శంషాబాద్-తుక్కుగూడ ఓఆర్ఆర్ -మహేశ్వరం ఎక్స్‌రోడ్-కందుకూరు	ఎలివేటెడ్	26	8	6,600
6.తార్నాక-ఈసీఐఎల్	ఎలివేటెడ్	8	5	2,300
7.జేబీఎస్- తూంకుంట ఫ్లైఓవర్/మెట్రో	డబుల్ ఎలివేటెడ్	17	13	5,690
8.పారడైజ్-కండ్లకోయ ఫ్లైఓవర్/మెట్రో	డబుల్ ఎలివేటెడ్	12	10	4,400
మొత్తం		142	-	39,190

హైదరాబాద్‌లో భారీగా మెట్రో విస్తరణకు కేబినెట్ నిర్ణయం

ఓల్డ్ సిటీ మెట్రో పూర్తికి హామీ

- 159 కిలోమీటర్ల పొడవునా ఓఆర్ఆర్ పక్కన మెట్రో నిర్మాణం. ఇక్కడ భూసేకరణ అవసరం లేదని వెల్లడి.
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి జల్‌పల్లి, తుక్కుగూడ మీదుగా కందుకూరు దాకా విస్తరణ (అక్కడ ఫార్మాసిటీ రాబోతోంది)
- ఇంకా ఏవైనా రూట్‌లు కలపాల్సి ఉంటే తర్వాత చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.

ఇక మెట్రో పార్ట్–బీ విస్తరణ కింద.. ఔటర్ రింగ్‌రోడ్డు వెంట నాలుగు కారిడార్లుగా మెట్రోరైల్‌ను విస్తరించనున్నారు. ఇందులో శంషాబాద్–పెద్దఅంబర్‌పేట్ (40కి.మీ), పెద్ద అంబర్‌పేట్–మేడ్చల్ (45కి.మీ), మేడ్చల్–పటాన్‌చెరు (29కి.మీ), పటాన్‌చెరు–నార్సింగి (22కి.మీ) కలిపి మొత్తంగా రూ. 20,810కోట్లతో 136 కిలోమీటర్ల పొడవున మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక బీహెచ్ఈఎల్–మియాపూర్–లక్డీకాపూల్ మధ్య 26 కిలోమీటర్లు, నాగోల్–ఎల్బీనగర్ మధ్య 5 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ల కోసం రూ.9,100 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నాయని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. దీనితో కలిపి మొత్తం వ్యయ అంచనా రూ.69,100 కోట్లు అవుతోందని తెలిపారు.

ప్రాణాలకు తెగించి.. జీవితాన్నిచ్చి..

హెల్పింగ్ హ్యాండ్స్

భారీ వర్షాలు, వరదల బాధితులను రక్షించిన ధైర్యశాలులు

విధి నిర్వహణలో అంకితభావం చూపిన పోలీసులు, ప్రభుత్వ సిబ్బంది

ఆదుకునేందుకు తామున్నామంటూ ముందుకొచ్చిన యువకులు

వరుసగా భారీ వర్షాలు.. ఆ వెంటే ముంచుకొచ్చిన వరదలు.. ఇళ్లు, రోడ్లు, పొలాలు, వాగులు.. అనే తేడా లేదు.. ఎక్కడున్నవారు అక్కడే చిక్కుకుపోయారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. అలాంటి సమయంలో పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక యువకులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి మరీ సహాయక చర్యలు చేపట్టారు. ఎందరో బాధితులను సురక్షితంగా ముంపు నుంచి బయటికి తీసుకువచ్చారు. ఇలా 'హెల్పింగ్ హ్యాండ్స్' అందించినవారు ఎందరో.. అందులో కొన్ని ఘటనలివి..

తల్లీబిడ్డలను కాపాడిన ఎస్సై జీవన్

జ్యోతినగర్: ఇటీవలి భారీ వర్షాలకు ఎన్టీపీసీ రామగుండం మోమిన్‌నగర్‌లో జపెన్‌కో చెరువు కట్ట తెగి.. దిగువ ప్రాంతాలు వరదలో మునిగాయి. అదీ రాత్రి సమయంలో జరగడంతో పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను బయటికి తీసుకువచ్చేందుకు తాళ్లు కట్టారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ ధైర్యంగా వరదలోకి వెళ్లి.. ఒక బాలింతను, ఆమె 20 రోజుల పసికందును కాపాడారు. గత ఏడాది గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా ఐదో డివిజన్ మల్కాపూర్ నీట మునిగినప్పుడూ జీవన్ ప్రజలను రక్షించి ప్రశంసలు అందుకున్నారు.



280 మందిని ఒడ్డుకు చేర్చి..



కాజీపేట: గత గురువారం భారీ వర్షంతో హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఇందిరానగర్ పూర్తిగా మునిగిపోయింది. ఆందోళనకు గురైన కాలనీవాసులు కాజీపేట సీఐ సార్ల రాజుకు ఫోన్ చేసి చెప్పారు. పోలీసులు వెంటనే కాజీపేట పట్టణంలోని మత్స్యకారుల సాయంతో తెప్పలు, బోట్లపై ఇందిరానగర్ కాలనీకి చేరుకున్నారు. దాదాపు 10 గంటల పాటు కష్టపడి.. భవనాలపై తలదాచుకున్న 280 మందిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

మున్నేరు ముంపు నుంచి కాపాడి..



ఖమ్మం మయూరిసెంటర్: గత గురువారం ఖమ్మం జిల్లాలో మున్నేరుకు ఒక్కసారిగా వరద పెరిగింది. దీనితో కొందరు ఖమ్మం నగరంలోని లోతట్టు కాలనీల్లో చిక్కుకుపోయారు. ఇళ్లు, డాబాలపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూశారు. ఆ ప్రాంతాల్లో వరద లోతు ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బంది ఎదురైంది. మంత్రి పువ్వాడ అజయ్ చొరవ తీసుకోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం వైజాగ్ నుండి కొత్తగూడెం వెళ్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఖమ్మం పంపింది. వారు ప్రత్యేక రెస్క్యూ చేసి బాధితులను వరద నుంచి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.

ముందుచూపుతో 40 మంది పిల్లలను కాపాడిన మీనయ్య



ఏటూరునాగారం: గత గురువారం రోజున జంపన్న వాగు పోటెత్తడంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం పూర్తిగా వరదలో మునిగింది. అయితే సమయస్ఫూర్తితో వ్యవహరించిన కొండాయి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాయం మీనయ్య 40 మంది పిల్లలను కాపాడారు. నాటి ఘటన గురించి ఆయన 'సాక్షి'కి వివరించారు. ''గురువారం ఉదయం పాఠశాలలో టిఫిన్ చేశాం. నేను, 40 మంది పిల్లలు, వర్కర్లు స్కూల్‌లోనే ఉన్నాం. జోరువాన పడుతోంది. బడి వెనకవైపు వెళ్లి చూస్తే.. వరద చుట్టుముడుతోంది. పరిస్థితి బాగోలేదని అనిపించింది. బట్టలు, పుస్తకాలు అన్నీ వదిలేసి వెంటనే నా వెంట రావాలంటూ పిల్లలను తీసుకుని బయలుదేరా. కల్వర్టు దాటివెళ్లి మల్యాలలోని మా ఇంట్లో వదిలిపెట్టా. తిరిగి పాఠశాలకు వచ్చి వర్కర్లను తీసుకొని కల్వర్టు దాటేసే సరికి వరద పోటెత్తింది. కాసేపట్లోనే బడిలో ఒక అంతస్తు నీట మునిగింది..''అని వివరించారు. దీనిపై మీనయ్యను మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్ ప్రశంసించారు.

ప్రాణాలకు తెగించి కాపాడిన విజయ్



హన్మకొండ చౌరస్తా: గత బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి హనుమకొండలోని 4వ డివిజన్ లోటస్ కాలనీ నీట మునిగింది. హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కరుణాసాగర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సమీపంలోని పెద్దమ్మగడ్డకు చెందిన యువకుడు రాపాక విజయ్ ధైర్యంగా సహాయక చర్యల్లో పాల్గొన్నాడు. నీట మునిగిన ఓ ఇంట్లోంచి ఓ మహిళ, ఆమె ఆరు నెలల చిన్నారిని, ఒక వృద్ధుడిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చాడు. ఈ విషయం తెలిసిన ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తదితరులు విజయ్‌ను అభినందించారు.



ధైర్యం చెప్తూ.. ఏడు గంటలు శ్రమపడి..

మంథని: ఒక్కసారిగా వచ్చిన వరదతో పెద్దపల్లి జిల్లా మంథని మండలం గోపాల్‌పూర్ వద్ద మానేరు వాగులో 19 మందిని చిక్కుకుపోయారు. అందరిలోనూ ఆందోళన. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది, మత్స్యకారుల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. వరదలో చిక్కుకున్న వారికి ఫోన్ ద్వారా ధైర్యం చెప్తూ.. మరోవైపు వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను, స్పీడ్ బోట్లను తెప్పించి.. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది కలసి వరదలోకి వెళ్లి బాధితులను కాపాడారు. దీనిపై పోలీసులను డీజీపీ స్వయంగా అభినందించారు.

మునిగిన ఇళ్ల నుంచి మహిళలను కాపాడి..



సిరిసిల్ల క్రైం: ఎడతెరిపిలేని వానతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై, చాలా మంది వరదలో చిక్కుకున్నారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు ముందుండి సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ఇళ్ల నుంచి ఇద్దరు మహిళలు సహా చాలా మందిని రక్షించారు. డీఎస్పీ, ఆర్ఐలను డీజీపీ ట్విట్టర్‌లో ప్రశంసించారు.

'వరద' విషాదం

భారీ వర్షాలు తెరిపినిచ్చినా.. వరదలు ఉపశమించినా.. ముంపు ప్రాంతాల్లో విషాద ఘంటికలు మాత్రం ఆగడం లేదు. వరదల వల్ల తలెత్తిన పరిస్థితులు ఆందోళన రేపుతూనే ఉన్నాయి.. వరుసగా ప్రాణాలను బలిగొంటూనే ఉన్నాయి. పంట నష్టాన్ని తట్టుకోలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకుంటే.. కూలిన ఇల్లును చూసి ఆవేదనతో ఓ వ్యక్తి గుండె ఆగిపోయింది. వరదలతో ఇళ్లలోకి చేరిన పాము కాటేసి ఓ బాలుడి ప్రాణం పోయింది.





ఇల్లు కూలి.. గుండె ఆగి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయికి చెందిన కోగిల బాబు (45) గత గురువారం భారీగా వరద ముంచెత్తడంతో ఏటూరునాగారంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం తిరిగి కొండాయి గ్రామానికి వచ్చాడు. కానీ వరద ధాటికి ఇల్లు కూలిపోయి ఉండటాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు వెంటనే ఆర్ఎంపీని పిలిపించగా.. బాబుకు గుండెపోటు వచ్చిందని, వెంటనే ఏటూరునాగారం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో బాబును పడవలో జంపన్నవాగు దాటించి ఏటూరునాగారం తీసుకెళ్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. ఇల్లు కూలిపోయిన ఆవేదనతో తన తండ్రి ప్రాణాలు పోయాయని, తమను ఆదుకోవాలని బాబు కుమార్తె సరస్వతి పేర్కొన్నారు.

పంట మునిగిందని.. ప్రాణం తీసుకున్నాడు



ఉట్నూర్ రూరల్: సీజన్ మొదట్లో వానలు పడటంతో పంటల సాగు మొదలుపెట్టాడు. మధ్యలో వానలు ముఖం చాటేయడంతో కష్టపడి కాపాడుకున్నాడు. కానీ భారీ వర్షాలతో పొలం నీట మునిగి పంటంతా దెబ్బతిన్నది. అప్పటికే ఉన్న బ్యాంకు రుణానికి సాగు కోసం చేసిన అప్పు తోడైందన్న ఆవేదనతో.. పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలానికి చెందిన పుర్ప వార్ విఠల్ (24) విషాద గాథ ఇది. పంట దెబ్బతిన్నదన్న బాధతో తమ కుమారుడు పురుగుల మందు తాగాడని, తమను ఆదుకోవాలని ఆయన తల్లిదండ్రులు గంగారాం–తులసీబాయి కన్నీటి పర్యంతమయ్యారు.

బురదను శుభ్రం చేస్తుంటే.. పాము కాటేసి..



ఖమ్మంరూరల్: భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాను ముంచెత్తిన మున్నేటి వరద మరో విషాదానికి దారితీసింది. మూడు రోజుల కింద ఖమ్మం రూరల్ మండలం పెద తండా ఆర్టీసీ కాలనీ సమీపంలోని కేబీఆర్ నగర్‌ను మున్నేటి వరద ముంచెత్తింది. దీనితో జమ్రుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో చెత్తాచెదారం, బురద పేరుకుపోయాయి. అందులో పాములు వచ్చి చేరాయి. జమ్రుద్దీన్, కుటుంబ సభ్యులు సోమవారం తమ ఇంటిని శుభ్రం చేస్తుండగా.. ఓ మూలన దాగిన పాము ఆయన కుమారుడు జహీర్ (8)ను కాటేసింది. వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ జహీర్ మృతి చెందాడు

వరదతో చేరిన బురదలో జారిపడి..

భూపాలపల్లి అర్బన్: వరద ముంపుతో సర్వం కోల్పోయిన ఆవేదన ఓ వైపు, వరద వల్ల చేరిన బురదలో జారిపడి తలకు గాయమైన అనారోగ్యం మరోవైపు.. ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నాయి. వరదతో నిండా మునిగిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలో ఈ ఘటన జరిగింది. గత గురువారం భారీ వరద పోటెత్తడంతో గ్రామానికి చెందిన మోకిడి లక్ష్మి (42) సమీపంలోని ఓ భవనంపైకి ఎక్కి తలదాచుకుంది. వరద తగ్గడంతో కిందికి దిగివచ్చిన ఆమె.. బురదలో జారిపడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. తలకు బలంగా దెబ్బతగిలి, రక్తం గడ్డకట్టినట్టుగా వైద్యులు గుర్తించారు. వరదతో ఇల్లు మునిగిన బాధలో ఉన్న ఆమె.. దెబ్బతగిలి ఆస్పత్రి పాలవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది.

వరదబాధితులకు విరాళంగా ట్రెసా ఒక రోజు వేతనం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) నిర్ణయించింది. ఈ మేరకు విరాళాన్ని సీఎంఆర్ఎఫ్‌కు అందజేసింది. ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు అంగీకారపత్రాన్ని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్‌కు సోమవారం అందజేసింది. ఈ సందర్భంగా ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్‌లు మాట్లాడుతూ..ఓవైపు వరదబాధితుల సహాయక చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నామని, మరోవైపు నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు మానవతాదృక్పథంతో ట్రెసా ఈ విరాళాన్ని ప్రకటించిందని చెప్పారు.

మా ఏరియాకు రండి సర్

తమ బాధలు చూడాలంటూ కలెక్టర్ వాహనానికి అడ్డుపడిన మహిళలు



బాధిత మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో నష్టం అంచనా, జ్వర సర్వేను పరిశీలించేందుకు మోతీనగర్‌కు వచ్చిన కలెక్టర్ వీపీ గౌతమ్ వాహనాన్ని ముంపు బాధిత మహిళలు అడ్డుకున్నారు. వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని చూసేందుకు కలెక్టర్ సోమవారం అధికారులతో వెళ్లి మోతీనగర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వెళ్తుండగా, అక్కడికి సమీప వీధుల్లో నివాసముండే వారు అడ్డుకున్నారు. కలెక్టర్ వాహనానికి ఎదురుగా వచ్చి తమ ప్రాంతంలో కూడా నష్టాన్ని చూడాలని వేడుకున్నారు. ఇప్పటికే ఎవరూ పట్టించుకోవడం లేదని, తమ ఇళ్లను ఎందుకు చూడటం లేదని ప్రశ్నించారు. ఇళ్లు, సామగ్రి సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని మహిళలు కోరగా, సర్వే పూర్తి పారదర్శకంగా చేపడుతామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు.

తెప్ప ఎక్కితేనే మల్లన్న దర్శనం

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలోని అతిపురాతన ఆలయాల్లో ఒకటైన చెరువు మధ్యలో తూర్పు ముఖద్వారం కలిగిన సిరిచెల్మ మల్లికార్జున ఆలయానికి ప్రతీ సోమవారం భక్తులు పోటెత్తుతారు. అయితే ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో చెరువు నిండుకుండలా మారడంతో తెప్ప ఎక్కితేనే గానీ మల్లన్న దర్శనం లభించడం లేదు. సోమవారం వచ్చిన భక్తులు ఇలా తెప్పలో వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు.



యాదాద్రిలో లీకేజీలు పరిశీలించిన టెక్నికల్ కమిటీ సభ్యులు

యాదగిరిగుట్ట: వారం రోజులుగా కురిసిన వర్షాలకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయ ముఖ మండపంతో పాటు ప్రాకార మండపాల్లో భారీగా లీకేజీలు ఏర్పడటంతో సోమవారం టెక్నికల్ కమిటీ సభ్యులు కొండల్‌రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్ నాయక్ పరిశీలించారు. ప్రధానాలయ ముఖ మండపంలోని ఎలక్ట్రికల్ ప్యానెల్‌బోర్డు, తూర్పు త్రితల రాజగోపురంలో నుంచి ప్రధానాలయంలోకి వెళ్లే మార్గంలో, అష్టభుజి ప్రాకార మండపాల్లో వర్షం నీళ్లు ఎలా లీక్ అవుతున్నాయనే అంశాలను చెక్ చేశారు. తరచూ లీకేజీలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

'మున్నేరు'కు శాశ్వత పరిష్కారం: పువ్వాడ

కాంక్రీట్ వాల్ నిర్మించాలని కేబినెట్ నిర్ణయం




ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న పువ్వాడ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: మున్నేరు వరదలతో ప్రతిసారి ఇబ్బందులకు గురవుతున్న ఖమ్మం ప్రజలకు శాశ్వత పరిష్కారంగా ఇరువైపులా కాంక్రీట్‌వాల్ నిర్మించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇచ్చిన నివేదికను కేబినెట్ చర్చించి ఆమోదించింది. ఈ కాంక్రీట్ వాల్ నిర్మాణం కోసం రూ. 150 కోట్లు మంజూరు చేయాలని ఆర్థిక శాఖను సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీనితో మున్నేరు వరద బాధితుల కష్టాలు శాశ్వతంగా దూరమవుతాయని పరీవాహక ప్రాంత ప్రజలు, ఖమ్మం నగర ప్రజల పక్షాన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని మంత్రి అజయ్ పేర్కొన్నారు.

పంటలకు పరిహారం ఇప్పించండి

వరద బాధితులను ఆదుకోండి

- సీఎస్‌కు కాంగ్రెస్ ప్రతినిధి బృందం వినతిపత్రం



కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ నేతలు సంభాని చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్, ఈరవత్రి అనిల్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రోహిణ్‌రెడ్డి, జ్యోతి, అనిల్‌కుమార్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, చరణ్‌కౌశిక్ యాదవ్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, బాధితులకు ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. కాగా, వరికి ఎకరానికి రూ. 20వేలు, పత్తికి రూ.15వేలు, ఇతర వాణిజ్య పంటలకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించాలని, ఇసుక మేటలు వేసిన పొలాల్లో చదును చేసుకునేందుకు గాను ఎకరానికి రూ.50వేలు ఇవ్వాలని, పూర్తిగా నష్టపోయిన ఇండ్లకు రూ.5లక్షలు, పాక్షికంగా నష్టపోయిన ఇండ్లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సాఫ్ట్‌వేర్ నిపుణుడు, కార్మిక నేత

గవర్నర్ కోటాలో ఎంపికైన ఎమ్మెల్సీల వివరాలివీ..

సాక్షి, హైదరాబాద్: బీసీ సామాజిక వర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ నిపుణుడు దాసోజు శ్రవణ్ ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్న ఆయన ఆ పార్టీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. తర్వాత ఆ పార్టీని వీడి తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ పిలుపుతో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్)లో పనిచేశారు. ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. జాయింట్ యాక్షన్ కమిటీలో స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరించారు. తర్వాత కాంగ్రెస్‌లోకి, అక్కడి నుంచి బీజేపీలోకి వెళ్లారు. గత ఏడాది మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరారు. ఏ పార్టీలో ఉన్నా కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, గవర్నర్ కోటాలో ఆయనను ఎమ్మెల్సీకి ఎంపిక చేశారు.

కార్మిక నేత నుంచి..: ఎస్టీ ఉపకులం ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ 1956, 2 అక్టోబర్‌న సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో జన్మించారు. పీయూసీ వరకు చదివిన ఆయన పటాన్‌చెరు పారిశ్రామికవాడలో భారతీయ మజ్దూర్ సంఘం నాయకుడిగా పేరు పొందారు. పటాన్‌చెరులో కాలుష్యం తీవ్ర రూపం దాల్చినప్పుడు ప్రజలకు మద్దతుగా సత్యనారాయణ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1977లో జనతా పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. సుదీర్ఘ కాలం బీజేపీలో పనిచేశారు. 1999లో బీజేపీ నుంచి సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018 ఎన్నికల సందర్భంలో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)లో చేరారు. నాడు పార్టీలో చేరిన సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఆయనకు ఈ పదవి దక్కింది. మైనార్టీ వర్గంగా పేర్కొనే ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణకు పదవి ఇవ్వడం ద్వారా.. రాష్ట్రంలో గుర్తింపునకు నోచుకోని సామాజిక వర్గాలకు కూడా పార్టీ ప్రాధాన్యమిస్తుందనే సంకేతాలను కేసీఆర్ ఇచ్చారు.

> అన్నీ మారుతున్నాయని మీరు గ్రహిస్తే మీరు పట్టి ఉంచడానికి ప్రయత్నించేది ఏమీ ఉండదు. మీరు వైఫల్యానికి భీతి చెందకపోతే మీరు సాధించలేనిది ఏదీ లేదు.
>
> – తావోయిజం

సాక్షి

మంగళవారం, 1 ఆగస్టు 2023

దక్షిణాసియాపై ఉగ్ర పంజా

ఉగ్రవాద బెడద ఇంకా సజీవంగానే ఉన్నదని మన పొరుగునున్న పాకిస్తాన్‌లో తరచు జరిగే దాడులు నిరూపిస్తుండగా మన దేశంతోపాటు బంగ్లాదేశ్, మయన్మార్‌లలో తన కార్యకలాపాలు విస్తరించుకోవటానికి అల్ కాయిదా పథకరచన చేస్తున్నదని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అనుబంధ నివేదిక హెచ్చరిస్తోంది. ఉగ్రవాద సంస్థల తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన ఆంక్షలను సిఫార్సు చేసే విభాగం ఈ నివేదికను రూపొందించింది. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అఫ్గానిస్తాన్‌లో అడుగుపెట్టి రెండు దశాబ్దాలపాటు సాగించిన పోరాటం చెప్పుకోదగ్గ ఫలితం ఇవ్వకపోగా, అన్నివిధాలా దెబ్బతిన్న అమెరికా రెండేళ్ల క్రితం అక్కడినుంచి వెనుదిరిగింది. దేశంలోని అన్ని వర్గాల మధ్యా సామరస్య సాధనకు ప్రయత్నించటం, అఫ్గాన్ సమస్యతో సంబంధం వున్న దేశాలకు శాంతిప్రక్రియలో చోటీయటం వంటివేమీ చేయకుండానే అమెరికా కాడి కింద పారేసింది. దాని ఫలితంగానే ఆ దేశంలో మహిళలను దారుణంగా అణిచేయటం, ప్రత్యర్థులను కున్నవారిని తుదముట్టించటం కొనసాగుతూనే ఉంది. ఆఖరికి తమ గడ్డపై నుంచి ఎటువంటి ఉగ్రవాద కార్యకలాపాలనూ అనుమతించబోమని అమెరికాకు ఇచ్చిన హామీని సైతం తాలిబన్ పాలకులు తుంగలో తొక్కారు. భద్రతా మండలి తాజా నివేదిక దాన్నే ధ్రువీకరిస్తోంది.

తమ భూభాగంలో అల్ కాయిదా లేనేలేదని తరచు బుకాయిస్తున్న తాలిబన్‌ల తీరుకు భిన్నంగా అడపా దడపా ఆ ఉగ్ర సంస్థ జాడల గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆ దేశంలో అల్ కాయిదా ముఖ్యులు దాదాపు 60 మంది వరకూ ఉండగా, ఉగ్ర కార్యకలాపాలు నిర్వహించే మరో 400 మంది ఉన్నారని భద్రతామండలి నివేదిక తెలిపింది. వీరికి మద్దతుగా నిలబడే బంధువర్గాన్నీ, సన్నిహితులనూ పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 2,000 మంది ఉంటారని ఆ నివేదిక అంచనా వేసింది. అల్ కాయిదా నేతృత్వంలో రూపుదిద్దుకున్న మరో ఉగ్ర సంస్థ భారత ఉపఖండ అల్ కాయిదా (ఏక్యూఐఎస్)కు ప్రస్తుతం 200 మంది ఉగ్రవాదులున్నారని, ఈ సంస్థ పాకిస్తాన్‌లోని తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ)తో విలీనమై మన దేశంలోని జమ్మూ, కశ్మీర్‌తోపాటు మయన్మార్, బంగ్లాదేశ్‌లలో కార్యకలాపాలకు సిద్ధమవుతున్నదని భద్రతామండలి నివేదిక అంటున్నది. టీటీపీ ఆనుపానులు కనిపెట్టడంలో, ఆ సంస్థను నియంత్రించటంలో పాకిస్తాన్ పదే పదే విఫలమవుతోంది. టీటీపీతో పాకిస్తాన్ ప్రభుత్వం జరుపుతున్న చర్చలు నిరుడు నవంబర్‌లో విఫలమయ్యాక ఉగ్ర దాడులు మళ్లీ పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో ఒక మసీదుపై దాడిచేసి 95 మంది ప్రాణాలు తీసిన ఉగ్రవాదులు, తాజాగా ఆదివారం ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా రాష్ట్రంలో ఆత్మాహుతి దాడి జరిపి, 40 మంది మరణానికి కారకులయ్యారు. అయితే ఈ దాడుల వెనక తాము లేమని టీటీపీ చెబుతోంది. ఆ సంస్థకు దన్నుగా నిలుస్తున్న అఫ్గాన్ ప్రభుత్వం కూడా ఖండిస్తోంది. ఇరుగు పొరుగుకు ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న దేశంగా ముద్రపడిన పాకిస్తాన్ చివరకు అదే ఉగ్రవాదం సాలెగూటిలో చిక్కుకుని విలవిల్లాడటం, దాడుల కారకులెవరో కూడా గుర్తుపట్టలేని నిస్సహాయ స్థితిలో పడటం వింతేమీ కాదు. దేశంలో లెక్కకు మించిన ఉగ్రవాద సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని పాక్ సైన్యం అంచనా వేస్తోంది. ఇవన్నీ అటు సైన్యం పైనా, ఇటు పౌరుల పైనా తరచు దాడులు సాగిస్తున్నాయి. ఉగ్రవాద సంఘటనలు జరిగినప్పుడు ఏ సంస్థా తన ప్రమేయం ఉన్నదని ప్రకటించటం లేదు. ఇప్పుడు టీటీపీ, అల్ కాయిదాలు విలీనం కాబోతున్న వార్త నిజమే అయిన పక్షంలో దక్షిణాసియా ప్రాంత దేశాలతోపాటు పాకిస్తాన్‌కు కూడా మరింత ముప్పు ఖాయం. ఈ రెండు సంస్థలూ అఫ్గాన్‌లో ఇప్పటికే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నాయని తాజా నివేదిక వెల్లడించింది.

ఆ సంస్థలను అన్నివిధాలా కట్టడి చేస్తున్నామని భ్రమల్లో కూరుకుపోయిన ప్రపంచ దేశాలు ఒకసారి సమీక్షించుకోవటం మంచిది. తమ గడ్డపై ఉగ్రవాద కార్యకలాపాలకు అనుమతించబోమని గతంలో ఇచ్చిన హామీకి తాలిబన్‌లు కట్టుబడటం లేదని ఈ పరిణామాలన్నీ నిరూపిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశంపై ఐక్యరాజ్యసమితి దృష్టి పెట్టాలి. తగినన్ని నిధులు లేకుండా, ఎవరి అండదండలూ లేకుండా ఉగ్రవాద సంస్థలు వర్ధిల్లటం ఉత్తమాట. దాదాపు 20 ఉగ్రవాద సంస్థలు పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో తిష్ఠ వేసి, కార్యకలాపాలు సాగిస్తున్న సంగతి తాలిబన్ పాలకులకు తెలియదనుకోవటం భ్రమ. తమతోపాటు కలిసినడుస్తున్నట్టు కనిపిస్తున్న నేతల్లో కొందరు వేరే ఉగ్ర సంస్థలకు విధేయులుగా మసులుకుంటున్నారని, వారు వివిధ ప్రభుత్వ విభాగాల్లోకి ప్రవేశిస్తున్నారని తాలిబన్‌లకు తెలియదనుకోవటం అమాయకత్వం. ఆ సంస్థల నేతలను ఉద్దేశపూర్వకంగానే అధికారిక వ్యవస్థల్లోకి ప్రవేశపెడుతున్నారని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. పాకిస్తాన్ సైతం మొదట్లో టీటీపీకి, అల్ కాయిదాకు సహాయ సహకారాలందించిన మాట వాస్తవం. టీటీపీ నాయకత్వం తనకు ఎదురుతిరగటం మొదలయ్యాక దానిపై దాడులు సాగిస్తోంది. ఒక బ్రిగేడియర్‌ను కోల్పోవటంతో సహా ఎన్నో నష్టాలను చవిచూస్తోంది. అటు అమెరికాకు తప్పుడు సమాచారం అందించి తాలిబన్‌లను అఫ్గాన్‌లో పునఃప్రతిష్ఠించటంలో కీలక పాత్ర పోషించి దెబ్బతింది. ఏ విలువలకూ కట్టుబడని పాలకుల చేతుల్లో అఫ్గాన్ ఉండటం దక్షిణాసియా ప్రాంత దేశాలకు మాత్రమే కాదు... ప్రపంచానికే ముప్పు తెస్తుంది. కనుక తాజా నివేదికపై భద్రతా మండలి దృష్టి సారించాలి. ఇతరత్రా అంశాల్లో ఎలాంటి విభేదాలున్నా ఉగ్రవాదాన్ని కట్టడి చేయటంలో అన్ని దేశాలూ ఏకాభిప్రాయానికి రావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి రా.12.50 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.10 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.8.54 నుండి 10.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.05 నుండి 12.34 వరకు, తిరిగి తె.5.52 నుండి 7.21 వరకు (తెల్లవారితే బుధవారం)

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

గాలిలో దీపాలైన ప్రాథమిక హక్కులు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

అన్య మార్గాలలో సాధించిన 'బ్రూట్ మెజారిటీ' ద్వారా కోర్టు చెప్పినా పాటించకపోవడం పాలకులకు 'కూసు విద్య'గా మారింది. లౌకిక రాజ్యాంగ చట్టంలో ప్రజలకు కల్పించామని చెప్పిన పౌర ప్రాథమిక హక్కులు అమలు జరగని పరిస్థితి తలెత్తింది. చివరికి పౌర ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు'ను ఉన్నత న్యాయస్థానం రక్షించే వరకూ గతి లేని పరిస్థితిని కల్పించి సంకీర్ణ ప్రభుత్వాలు పాలన చలాయిస్తూ వచ్చాయి. ఫలితంగా ప్రజల ప్రాథమిక పౌరహక్కులు సైతం నేడు 'గాలిలో దీపాలు'గా మారాయి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన సెక్యులర్ వ్యవస్థకు బదులుగా పాలనా రథాన్ని కుల, మతాలపై ఆధారపడి కాపాడుకోవడానికి పార్టీలు, వాటి సంకీర్ణ పాలనా కూటములు అధికారాన్ని దుర్వినియోగం చేయడానికీ వెనుకాడట్లేదు.

"ప్రపంచంలో తలెత్తుతూ వచ్చిన గొప్ప గొప్ప విప్లవాలన్నింటికీ గొప్పగొప్ప మహానుభావులు కారకులనుకుంటాం. కానీ, వాస్తవానికి ప్రపంచ మహా విప్లవాలకు కారకులు, నాయకత్వం వహించిందీ ప్రజలేనని మరచిపోరాదు. ఇదే నిజమైన మన ఉమ్మడి హైందవ సంస్కృతి కూడా!"
– ఎరవాడ కేంద్ర కారాగారంలో బందీగా ఉన్న గాంధీజీ ప్రకటన 17.1.1931

"ఇండియాలో ప్రజా బాహుళ్యాన్ని స్వతంత్రంగా ఆలోచింపనివ్వరు. ఆ స్వేచ్ఛను వారికి దక్కనివ్వరు. ఇది అత్యంత అవమానకర పరిణామం. అందుకే కిరాతకులు ప్రజల్ని చూసి భయపడరు. దయార్ద్ర హృదయులమనుకునే వారికి తెగింపు తక్కువ, తెలివి గలవాళ్లమనుకొనే వాళ్ళు ఎవరెటు పోతే మనకెందుకు లెమ్మని నిర్లిప్తంగా ఉండిపోతారని విలియం మోరిస్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు."
– భారత లౌకిక రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

ప్రజల బతుకులు నేడు 'ఎండమావుల్లో' తచ్చట్లాడుతున్నాయి. దీనిక్కారణం – ఏదో ఒక 'రాజ్యమైతే' ఉంది గానీ దాని ముక్కు ముఖమూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి నలభై ఏళ్లలో అలా అలా ఉన్నప్పటికీ తర్వాతి నుంచీ మెరుగవలేదు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు, వాటి అతుకుల బొంత సంకీర్ణ మంత్రివర్గాలు పాలనకు వచ్చాయి. ఆ వర్గాలు దేశంలో పౌరహక్కుల్ని, 'భారత ప్రజలమైన మేము' అన్న సంకల్ప ప్రకటనను ఆచరణ నుంచే గాదు, లౌకిక వ్యవస్థ నుంచే తప్పించేశాయి. ఏనాడైతే ఓఫ్రా రిపోర్టు కేంద్ర పాలనా వ్యవస్థలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను బహిర్గతం చేసిందో ఆనాడే ప్రజల లిఖిత పూర్వక సంకల్పానికి చేటు మూడింది. ఓఫ్రా రిపోర్టును సమర్థిస్తూ ఆనాడే సుప్రీంకోర్టు "ప్రభుత్వాలు, పాలకులూ ఎలా పాలన సాగిస్తున్నారో తెలుసుకునే సంపూర్ణ హక్కు ప్రజలకు ఉందని" నిర్మొహమాటంగా తీర్పు చెప్పిందని మరచిపోరాదు.

అయితే విచిత్రమేమంటే, ఇదే లౌకిక రాజ్యాంగ చట్టం ద్వారా ఆ చట్టంలో దేశ ప్రజలకు కల్పించామని చెప్పిన పౌర ప్రాథమిక హక్కులు (21వ అధికరణ నుంచి 45వ అధికరణ వరకూ) అమలు జరగని పరిస్థితి తలెత్తింది. చివరికి 21వ పౌర ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు' ఉన్నత న్యాయస్థానం దయదలచి రక్షించే వరకూ గతి లేని పరిస్థితిని కాంగ్రెస్ – బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాలు కల్పించి పాలన చలాయిస్తూ వస్తున్నాయి. ఈ పాలకుల తతంగమంతటికీ కీలకమైన పునాది... ఉత్తరప్రదేశ్‌లోని 80 పార్లమెంట్ సీట్లపై పట్టు సాధించడం ద్వారా కేంద్రంలో తిష్ఠ వేయగల ఎత్తుకు పాలకులు ఈ క్షణం దాకా అలవాటు పడి ఉండటం! పైగా ఈ 80 పార్లమెంట్ స్థానాలను గుప్పిట్లో పెట్టుకొని ఉత్తర – దక్షిణ – తూర్పు భారత రాష్ట్రాల ప్రయోజనాల్ని దెబ్బ తీయడానికి వారు వెనుకాడటం లేదు.

రెండో మాట



ఇందుకు రాష్ట్రపతి స్థాయిని కూడా దిగజార్చడానికి జంకడం లేదు. ఆ మాటకొస్తే తొల్లింటి భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ తర్వాత గవర్నర్ల ప్రతిపత్తిని కాపాడే బాధ్యతను కూడా కాంగ్రెస్ – బీజేపీ పాలకులు, వారి సంకీర్ణ మంత్రి వర్గాలు దిగజార్చుతూ వచ్చాయి. ఫలితంగా ప్రజల ప్రాథమిక పౌర హక్కులు సైతం నేడు 'గాలిలో దీపాలు'గా మారాయి. క్రమంగా దేశంలో రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన సెక్యులర్ (కులాతీత, మతాతీత) వ్యవస్థకు బదులుగా పాలనా రథాన్ని కుల, మతాలపై ఆధారపడి కాపాడుకోవడానికి ఈ రెండు రాజకీయ పార్టీలు, వాటి సంకీర్ణ పాలనా కూటములు లౌకిక రాజ్యాంగ ప్రతిపత్తిని, అధికారాన్ని భ్రష్టు పట్టిస్తూ వచ్చాయి. కనుకనే, ఈ పౌరుల ప్రాథమిక హక్కుల్ని (జీవించే హక్కు, ప్రశ్నించే హక్కు సహా) ఉభయ కూటముల పాలకులు అమలు చేయించాల్సిన బాధ్యతల (డ్యూటీస్)ను ఆచరణలో పక్కకు నెట్టేశాయి.

ఇందులో భాగంగానే, రాజ్యాంగం ప్రాథమిక బాధ్యతగా గుర్తించిన 'పత్రికా స్వేచ్ఛ రక్షణ'కు (అధికరణం 19(1) (2)కు) తనకు తోచినట్టుగా వ్యాఖ్యానాలు చేస్తూ ప్రతిబంధకాలు కల్పిస్తూ వచ్చాయి ఈ రెండు రాజకీయ కూటములూ! పౌరహక్కుల రక్షణకై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీవన్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి రంగంలోకి దిగి మాడు పగిలిపోయే తీర్పులు ఇచ్చే వరకూ అంబేడ్కర్ ఆశించిన లౌకిక రాజ్యాంగ విలువలకు న్యాయం నానాటికీ దూరమవుతూ వచ్చింది. అందుకే నెహ్రూ హయాంలోనే గాడి తప్పుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం నుంచి, నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేస్తూ డాక్టర్ అంబేడ్కర్ లౌకిక రాజ్యాంగ వ్యవస్థకు క్రమేణా దూరమవుతున్న భారత పార్లమెంటరీ వ్యవస్థను ఉత్తరోత్తరా భారత ప్రజలు కూల్చివేసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ బయటికి రావలసి వచ్చింది. ఆ తరువాతనే ఆయన ఉత్తరాది పాలకుల '80 సీట్ల' నాటకానికి విరుగుడుగా దక్షిణ భారత రాజధానిగా హైదరాబాద్ నగరాన్ని ప్రకటించాల్సిన అవసరాన్ని పదే పదే చాటుతూ వచ్చారని మరచిపోరాదు.

ఇప్పుడు కోర్టు ధిక్కార నేరాలకు, అన్య మార్గాల ద్వారా సాధించిన 'బ్రూట్ మెజారిటీ' ద్వారా పాల్పడడం పాలకులకు 'కూసు విద్య'గా మారింది. చివరికి ఒక ఖైదీ మరణశిక్షను సైతం సుప్రీంకోర్టు 'రాజ్యాంగ విరుద్ధం'గా (1980) ప్రకటించింది. ఆదివాసీల భూమి హక్కుల్ని సుప్రీం కోర్టు 1983లోనే రక్షిస్తూ తీర్పు చెప్పినా ఇప్పటికీ పాలకులు తీర్పును ఉల్లంఘిస్తూనే ఉన్నారు, మోతుబరులకు రక్షణ కల్పిస్తున్నారు. రానురాను ఇక రాజ్యమంటే వ్యాపార దిగ్గజాలదిగా ప్రజల్ని అర్థం చేసుకోమంటున్నారు పాలకులే బాహాటంగా! చివరికి మహిళా క్రీడాకారుల్ని వేధించి, అవమానించిన వాళ్ళు పాలక పక్షానికి చెందిన వారైతే శిక్షార్హులు కాకుండా తప్పించుకోగల్గుతున్నారు. మణిపుర్‌లో ఉనికికి సంబంధించి రెండు జాతుల మధ్య (మైతేయి – కుకీ) ఏర్పడిన తగాదాను ఆసరా చేసుకుని ఒక జాతిని అణచడానికి పాలకులే నడుం కట్టడం స్వార్థ రాజకీయం. గాంధీజీని చంపినవాళ్ళు గాంధీ చాటున దాగి, తిరిగి రాజకీయాలు చలాయించాలని చూడడం కన్నా దౌర్భాగ్య స్థితి మరొకటి ఉంటుందా?! ఇలాంటి స్థితిని గుర్తు చేస్తూ మహాకవి జాషువా ఏమన్నాడో ఒక్కసారి మరొక్కసారి చెవులారా విందాం:

"ఒకడు రుద్రాక్ష మాలికలు నెత్తికి చుట్టి
శివమూర్తియై భూమి కవతరించు
ఒక దూర్వపుండ్రంబు లురువుగా తగిలించి
శివలింగమును జూచి చీదరించు
ఒకడు రెండునుగాని వికట వేషము దాల్చి
పైవారి మీద సవాలు చేయు
ఒకడు గంజాయి దమ్ముకు దాసుడైపోయి
బూడిద గురవడై పుట్టి వచ్చు
మనుజులార మాది ఘనమైన మతమని
ఒకడు తరిమి తరిమి ఉగ్గడించు
పెక్కు మతములిట్లు పేచీలు సాగింప
మార్గమేది ఐకమత్యమునకు
చిలిపి రాళ్ళకు నగిషీలు చెక్కిచెక్కి
కాలమెంత యుగాంతాన గలిపిరొక్కొ
చదువ నేర్చిన వెర్రిని చంపగలరె
ఒక్క బుద్ధుడు, ఒక్క క్రీస్తు, ఒక్క గాంధి?"!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అమర వీరుడు



బ్రిటిష్ జనరల్ డయ్యర్‌ను చంపడం ద్వారా జలియన్‌వాలాబాగ్ మారణకాండకు ప్రతీకారం తీర్చుకున్న షహీద్ ఉధమ్ సింగ్‌కు వందనం. భారతదేశంలోని అన్ని మతాల సామరస్యాన్ని ప్రతిఫలించేలా ఆయన తన పేరును రామ్ మహ్మద్ సింగ్ ఆజాద్‌గా మార్చుకున్నారు. 1940లో ఇదే రోజున (జూలై 31) ఆయన్ని ఉరి తీశారు. కానీ ఆయన చూపిన తెగింపు మార్గం నేటికీ చెక్కు చెదరలేదు.
– శ్రీనివాస్ బీవీ, కాంగ్రెస్ కార్యకర్త

ఇప్పుడూ మౌనమేనా?



అధికారం కోసం మోదీ ఏమైనా చేయగలరని మోదీకి సన్నిహితుడూ, జమ్ము కశ్మీర్ మాజీ గవర్నర్ అయిన సత్యపాల్ మాలిక్ దిగ్భ్రాంతికరమైన ప్రకటన చేశారు. మణిపుర్‌పై మౌనం వహించినట్లే సత్యపాల్ ప్రకటన పైన కూడా మోదీ మౌనం వహిస్తారేమో చూద్దాం.
– ధనుష్ జేపీ, పొలిటికల్ కామెంటేటర్

పరిశుభ్రత తప్పా?!



సుధామూర్తిజీకి తనకు కావలసిన ఆహారాన్ని, కావలసిన విధంగా తీసుకునే హక్కు ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కూడా అనేక మంది పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ రెస్టారెంట్‌లకు వెళ్లినప్పుడు తమ సొంత నీళ్ల బాటిళ్లు, స్పూన్‌లు తీసుకెళతారు. కానీ మన వామపక్ష ప్రగతిశీల వాదులు అలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని నిరంతరం నీచమైన ప్రచారాలను నిర్వహిస్తుంటారు.
– ఇష్మరణ్ సింగ్ భండారీ, కామెంటేటర్

నిజమైన స్నేహం



చైనా బూటకపు వాగ్దానాలు శ్రీలంకను అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అందుకు భిన్నంగా భారతదేశ స్నేహ హస్తం శ్రీలంకను వాణిజ్య విజయంలో ఆకాశానికి ఎత్తేసింది. చైనా కమ్యూనిస్టు పార్టీ శ్రీలంకలో ఆర్థిక రక్తపాతాన్ని సృష్టించగా భారతదేశం శ్రీలంకకు ఎఫ్.టి.ఎ. ఎగుమతులను పెంచి బలమైన సంబంధాలను నిర్మించింది.
– సిమీ దాస్, అధ్యయన విద్యార్థి

వ్యక్తం కాని ఉద్దేశం



"దేహ ధర్మశాస్త్రాన్ని సరిగా అధ్యయనం చేయని వైద్యుల నుండి శరీరాన్ని రక్షించడంలో మూత్రపిండాలు అద్భుతమైన పాత్రను పోషిస్తాయి.." అనే వాక్యాన్ని ఒక తాజా వైద్య వ్యాసంలో చదివి నవ్వు ఆపుకోలేకపోయాను. ఇది ఏ ఇతర భాష నుండో 'గూగుల్ ట్రాన్స్‌లేట్' ద్వారా ఇంగ్లిష్‌లోకి వచ్చి ఉంటుందా?!
– డాక్టర్ శౌర్య గార్గ్, సైకియాట్రిస్ట్

పోతే పోయింది



స్వయం ఉపాధిలో ఉన్న వ్యక్తులు తమ సంపాదనపై కోత పడకుండా పొందే పలు రకాల తగ్గింపులు, పన్ను ఆదా అవకాశాల గురించి విన్నప్పుడు నిజంగా విస్తుపోయాను. అధిక సంపాదన కలిగి ఉన్న జీతభత్యాల ఉద్యోగులు తమ జీతంలో 35 శాతం వరకు ఆదాయ పన్ను చెల్లించడం చూస్తే, డబ్బిచ్చి ఒక మంచి సలహాదారును నియమించుకోవడం నిజానికి ఒక మంచి పెట్టుబడే అవుతుంది.
– రవిసుతంజని, స్టార్టప్‌ల ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్ బాక్స్

విద్యా విధ్వంసంపై కదన భేరి

తెలంగాణలో రెండు దఫాల తెరాస ప్రభుత్వ పాలనలో విద్యా రంగం విధ్వంసమై, విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైంది. అరకొర బడ్జెట్ కేటాయింపులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలలో అలసత్వం, మౌలిక వసతుల కొరత వంటివి ఇందుకు కొన్ని హేతువులు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఏళ్ల పాటు అనేకమార్లు నాణ్యమైన విద్య అంటూ నినదించి, అధికార పీఠమెక్కిన అనంతరం పాలకులు దాన్ని మరచారు. 'కేజీ టూ పీజీ' ఉచిత విద్య అని ప్రకటించిన ముఖ్యమంత్రి అందుకు పూర్తి విరుద్ధంగా 'కేజీ టూ పీజీ' వరకు విద్యా రంగాన్ని కార్పొరేట్ సంస్థల వశం చేశారు.

నిధులు లేక శిథిలావస్థకు చేరిన సర్కారు బడుల్లో మంచి నీటి వసతి, మూత్రశాలలు వంటి కనీస సదుపాయాలు లేవు. 'మన ఊరు – మన బడి' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం తన మాట ఎంతవరకు నిలబెట్టుకుందో ఈ వర్షాకాలంలో 'గొడుగుల కింద కూర్చొని క్లాసులో పాఠాలు వింటున్న' చిన్నారులను చూస్తే అర్థమవుతుంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో ఏటా క్షీణించిన బడ్జెట్ కేటాయింపుల కారణంగా 'సంక్షేమ వసతి గృహాలు' నరక కూపాలుగా మారాయి. విద్యార్థులు వినియోగించే నిత్యావసర సరుకులు సహా ఇతర వస్తువుల ధరలు రెట్టింపు అయినా మెస్ ఛార్జీలు 2016 నుండి నేటికీ సవరించకపోవడం ఇందుకు కారణం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కనీస వసతులు అందడంలేదు. తరచూ ఆహారం విషతుల్యమై వేల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం మామూలు విషయం అయ్యింది. రాష్ట్రంలో ఉస్మానియా, కాకతీయతో సహా ఇతర యూనివర్సిటీలు తెరాస పాలనలో అధఃపాతాళానికి వెళ్లాయి. స్వరాష్ట్రం వచ్చాక నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలతో పేద విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని ఆశించాం. కానీ తెరాస పాలనలో అందుకు పూర్తి విరుద్ధంగా తిరోగమనంతో యూనివర్సిటీలు నిర్వీర్యం అయ్యాయి. పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రభుత్వం పాఠశాల నుండి యూనివర్సిటీ స్థాయి వరకు విద్యారంగంలో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ చేపట్టడం, బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించడం వంటి చర్యలు చేపట్టాలి. తెలంగాణ విద్యా రంగాన్ని, భవిష్యత్తును కాపాడేందుకు, తెరాస ప్రభుత్వ విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక పాలనపై ఏబీవీపీ హైదరాబాద్‌లో నేడు 'విద్యార్థి కదన భేరి' బహిరంగ సభను తలపెట్టింది.

– డాక్టర్ కె. ప్రవీణ్ రెడ్డి; ఏబీవీపీ వర్కింగ్ కమిటీ మెంబర్, తెలంగాణ

ఎన్నికల లాభాల వేటలో... కూటమి బాట!

అభిప్రాయం



బచ్చు శ్రీనివాస్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితం దేశంలోని రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లను తమ తమ కూటములను బలోపేతం చేసుకొనే దిశగా నెట్టింది. ఇంతకాలం దేశంలో మా పాలనకు ఎదురే లేదన్నట్లుగా వ్యవహరించిన బీజేపీకి కర్ణాటక ప్రజలు ఓటమి రుచి చూపారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా ఏడాదే ఉండడంతో కర్ణాటక పాఠంతో బీజేపీ కొంత భయాందోళనలో పడింది. అందుకే గతంలో కాదనుకున్న మిత్ర పక్షాలను మళ్లీ దగ్గరకు తీస్తూ... కూటమిని కూడగడుతున్నది. ఇటీవల ఏకంగా 38 పార్టీలతో బీజేపీ ఎన్‌డీఏ కూటమిని బలోపేతం చేస్తూ ఢిల్లీలో సమావేశం నిర్వహించింది. ఇక గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా ఘోర పరాజయం ఎదుర్కొన్న కాంగ్రెస్... కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా అన్ని త్యాగాలకూ సిద్ధపడి కొన్ని రాష్ట్రాల్లో తనను భూస్థాపితం చేసిన శత్రువులతో సైతం జట్టు కడుతున్నది. అందులో భాగంగానే దాదాపు 26 ప్రతిపక్ష పార్టీలతో కాంగ్రెస్ 'ఇండియా' పేరుతో కూటమిని ఏర్పాటు చేసింది.

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సొంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో మొదలైన బీజేపీ అపజయం కర్ణాటకకు విస్తరించింది. దీంతో రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం కన్నా... ఆ యా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకొని వీలైనన్ని ఎక్కువ ఎంపీ సీట్లు గెలుచుకొని కేంద్రంలో మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాలని వ్యూహం రచించింది.

గతంలో బిహార్ సీఎం నేతృత్వంలోని జేడీయూ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివ



సేన, అకాలీ దళ్ వంటి పార్టీలు బీజేపీతో విభేదించి ఎన్డీఏ నుంచి వైదొలిగాయి. ఆ మధ్య ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనను ఎన్డీఏ గొడుగు కిందకు తెచ్చిన కమలదళం, ఎన్సీపీ తిరుగుబాటు నేత అజిత్ పవార్‌తో జతకట్టింది. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఎస్బీఎస్పీ నాయకుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ సహా.. బిహార్ మాజీ సీఎం జితన్‌రామ్ మాంఝీ నేతృత్వంలోని 'హిందుస్థానీ అవామీ మోర్చా సెక్యులర్' పార్టీతోనూ చేతులు కలిపింది. లోక్ జనశక్తి నేత చిరాగ్ పాశ్వాన్ కూడా ఆ మధ్య అమిత్ షాను కలిశారు.

మరోపక్క బెంగళూరులో జూలై 18న ప్రతిపక్ష పార్టీలు ఎన్‌డీఏతో తలపడేందుకు 'ఇండియా'ను ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్‌ది ప్రధాన భూమిక. బీజేపీని గద్దె దించే ఏకైక లక్ష్యంతో ఈ ప్రతిపక్ష కూటమి ఏర్పడింది. ప్రతిపక్షాల ఐక్యత ఏ సమస్యా లేకుండా ముందుకు సాగాలంటే జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ ఆ యా ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో తన పార్టీ అభ్యర్థులను త్యాగం చేయాల్సి ఉంటుంది. ఢిల్లీలో, పంజాబ్‌లో కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేసిన 'ఆమ్ ఆద్మీ పార్టీ' (ఆప్) సైతం ఇండియా కూటమిలో ఉండడం విశేషం. ఆప్ లాగే టీఎంసీ, జనతాదళ్ యునైటెడ్, ఎన్‌సీపీ వంటి పార్టీలు ప్రతిపక్ష ఐక్యతకు కలిసి వచ్చినా... ఆ యా రాష్ట్రాల్లో అవి గెలిచేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ముఖ్యంగా కూటమిలో ఉన్న పార్టీలు కాంగ్రెస్ నుంచి ఎక్కువ సీట్లను డిమాండ్ చేస్తాయి. అందుకే ప్రతిపక్షాల ఐక్యత సవాలుతో కూడుకున్న అంశం. రెండు కూటములు ఎవరికి వారు మరింత బలపడడం పార్లమెంట్ ఎన్నికలకు ముందు, ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అవి చూపించే సత్తా మీద ఆధారపడి ఉంటుందనేదీ కాదనలేని నిజం.

వ్యాసకర్త బీఆర్ఎస్ నాయకులు
మొబైల్: 93483 11117

భూమ్యాకాశాలు

ప్రశాంత వాతావరణంలో ప్రకృతిని తిలకించడం ప్రతి ఒక్కరికీ ఇష్టమైన వ్యాసంగంగానే ఉంటుంది. ఏదో దిగులుతో భారమైన హృదయానికి, ఎవరూ పలకరించని చోటికి వెళ్ళి ఆకాశపు హద్దులలోకి చూస్తూ కాలం గడపడం ఒకింత సేదను చేకూర్చేదై ఉంటుంది. భూమ్యాకాశాలు కలిసే చోటు అందరికీ ఎప్పటికప్పుడు ఏదో అంతుచిక్కని మాయ వంటి భావననే మనసులో మిగుల్చుతుంది. చూపు పక్కకు మరలదు. అలసట తీరి విశ్రాంతి చేకూరే మార్గానికి సంబంధించిన ఒక అమూల్యమైన సూత్రాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఎన్నో వేల సంవత్సరాల క్రితమే అక్కడ లిఖించి వదిలి వెళ్ళిపోయాడేమో అన్న ఊహ మనసులో మెదిలి ఒక్క క్షణం ఆహ్లాదపరుస్తుంది.

జ్యోతిర్మయం

దిఙ్మండలం (హొరైజన్) అని పిలవబడే (భూమ్యాకాశాలు రెండూ కలిసినట్లుండి కనబడే) ఆ రేఖకు మనిషి భావనా ప్రపంచంలో మెదిలే ఆలోచనలు పై విధంగా ఉండే అవకాశం ఉంటే, భౌతిక దృష్టితో చూసే బోధనామయ మానవ చిత్తానికి అదే రేఖ ఎలా కనపడుతుందో క్రీ.శ. 16వ శతాబ్దం నాటికే వెన్నెలకంటి సూరన తన రచనయైన 'ఆంధ్ర శ్రీ విష్ణు పురాణం' తృతీయాశ్వాసంలోని ఒక ఆటవెలది పద్యంలో 'అవని యెంత విరివియై యుండు నింగియు/ నంత విరివితోడ నతిశయిల్లు/ దృష్టి గోచరములు దివియును భువి యును/ గాన నెందు జూడ గడలు లేవు' అని అలతి మాటలలో సులభంగానే అర్థమయేలా చెప్పాడు.

భూమి ఎంత దూరం విస్తరించి ఉండి కంటికి కనబడుతుందో అంత దూరం ఆకాశం కూడా విస్తరించి ఉండి కనపడుతుంది. అంటే మనిషి ఎంత దూరం వెళితే అంత దూరం వెంటనే ఉంటూ కనిపించేవి భూమ్యాకాశాలు. ఈ రెండింటికీ ఏ ప్రదేశంలోనూ కంటితో చూడడానికి 'కడలు' అనగా చివరలు మాత్రం కనపడవు అని పై పద్యంలో వివరణ. అది చెబుతూనే, భూమి బల్లపరుపుగా కాక గుండ్రంగా ఉండడమనే భౌతికశాస్త్ర విషయాన్ని కూడా అంతర్లీనంగా సూచిస్తూ చెప్పడం ఈ పద్యంలో గుర్తించవలసిన మరొక ముఖ్యమైన అంశం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

టీఎస్‌సెట్-2023 నోటిఫికేషన్ విడుదల

● ఏపీ, తెలంగాణలో అక్టోబర్‌లో పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): టీఎస్‌సెట్–2023 నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ అధ్యాపక ఉద్యోగాల అర్హత కోసం వీసీ రవీందర్ ఆధ్వర్యంలో ఓయూ రెండోసారి నిర్వహిస్తున్న స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టుకు ఆగస్టు 5 నుంచి 29 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ.1,500 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకు, రూ.2,000తో 9వ తేదీ వరకు, రూ.3,000 అపరాధ రుసుముతో 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫీజు ఓసీలకు రూ.2,000, బీసీ/ఈబీసీలకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, తిరుపతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 12 కేంద్రాల్లో అక్టోబర్ 20, 28, 30 తేదీల్లో 29 సబ్జెక్టులకు పరీక్షలు జరగనున్నాయి. పూర్తి వివరాలకు osmania.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువును పెంచుతూ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీచేశారు. జూలై 31తో అడ్మిషన్ల గడువు ముగిసింది. అయితే వర్షాలు, వరుస సెలవుల నేపథ్యంలో ఆగస్టు 5 వరకు అడ్మిషన్లకు అనుమతించారు. విద్యార్థులు రూ.500 ఆలస్య రుసుముతో ఆగస్టు 16లోగా కాలేజీల్లో అడ్మిషన్లు పొందవచ్చని ఇంటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు ఈ ఆదేశాన్ని పాటించాలని పేర్కొంది. ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఉన్న కాలేజీల్లో మాత్రమే విద్యార్థులను చేర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించింది. గుర్తింపు ఉన్న కాలేజీల జాబితాను తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు బోర్డు తెలిపింది.

10 నుంచి 'ఎలిమెంటరీ ఎడ్యుకేషన్' ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ రెండో ఏడాది (2021–23 బ్యాచ్) ఫైనల్ లెసన్స్ టీచింగ్ ప్రాక్టికల్స్ ఆగస్టు 10 నుంచి 28 వరకు జరుగుతాయని పాఠశాల పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన టైం టేబుల్ సంబంధిత కాలేజీల వద్ద ఉంటుందని వెల్లడించారు.

7 నుంచి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్ ఆగస్టు 7 నుంచి మొదలవుతుందని ఉన్నత విద్యామండలి తెలిపింది. అభ్యర్థులు 7 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పేర్కొంది. 14 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చంది. సీట్ల కేటాయింపు 17వ తేదీన ఉంటుందని, 21 లోగా సీటు వచ్చిన వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించింది. కాలేజీల్లో 21న రిపోర్టు చేయాలంది. ఇంట్రా కాలేజీ ఆప్షన్ల ప్రక్రియ ఆగస్టు 2 నుంచి చేపడతామని, 5వ తేదీన ఇంట్రా కాలేజీ సీట్లు వెల్లడిస్తామని తెలిపింది.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నోటిఫికేషన్ విడుదల

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ విధానంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

ఆ విద్యార్థులను ఇతర కాలేజీల్లో చేర్చం

● ప్రభుత్వానికి శ్రీనిధి సంస్థ ఝలక్

సాక్షి, హైదరాబాద్: అనుమతుల్లేకుండా ఉన్నత విద్యా కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకున్న రెండు ప్రైవేటు కాలేజీల వ్యవహారంపై ప్రభుత్వం నియమించిన కమిటీ సోమవారం సమావేశమై చర్చించింది. ఇందులో ఒక కాలేజీ గతంలో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా వ్యవహరించడంతో ఏం చేయాలనే తర్జనభర్జనలో కమిటీ సభ్యులున్నారు. వాస్తవ నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయాలనే యోచనలో ఉన్నారు. ప్రైవేటు వర్సిటీ బిల్లును అసెంబ్లీ గత ఏడాది ఆమోదించి, గవర్నర్‌కు పంపింది. అప్పట్నుంచీ ఈ అంశం పెండింగ్‌లోనే ఉంది. ఈలోగానే శ్రీనిధి, గురునానక్ విద్యాసంస్థలు అనుమతులు వస్తాయని భావించి, విద్యార్థులను చేర్చుకున్నాయి. గురునానక్ సంస్థలో వివిధ కోర్సుల్లో 2,500 మంది చేరారు. శ్రీనిధిలో ఇంజనీరింగ్ కోర్సులో 284 మంది చేరారు. ఏడాదైనా అనుమతులు రాకపోవడంతో ఈ వర్సిటీల్లో చేరిన విద్యార్థుల సర్టిఫికెట్లు గుర్తించబోమని అధికారులు చెప్పారు. దీంతోగురునానక్ సంస్థ మాత్రం విద్యార్థులను ఇతర కాలేజీల్లో చేర్చడానికి సిద్ధంగా ఉన్నట్టు కమిటీకి తెలిపింది. శ్రీనిధి సంస్థ ఇందుకు అంగీకరించడం లేదని అధికారులు చెప్పారు. దీంతో ఈ వ్యవహారంపై ఏ నిర్ణయం తీసుకోవాలనే విషయాన్ని కమిటీ ప్రభుత్వానికే వదిలిపెట్టినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

చెప్పులే ధరించాలి

● బూట్లు వేసుకుంటే ఎగ్జామ్స్‌కు నో ఎంట్రీ
● 15 నిమిషాల ముందు వరకే కేంద్రంలోకి అనుమతి
● ప్రతీ అభ్యర్థి బయోమెట్రిక్ సమాచార సేకరణ
● ఒక్కో పరీక్షకు 120 నిమిషాలే సమయం
● నేటి గురుకుల కొలువుల అర్హత పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: పరీక్షలకు హాజరయ్యేవారికి గురుకుల బోర్డు 28 రకాల నిబంధనలు విధించింది. ప్రధానంగా ఎగ్జామ్‌హాల్‌లోకి వచ్చే అభ్యర్థులు కేవలం చెప్పులు మాత్రమే వేసుకొని రావాలని, బూట్లు ధరించిన అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 23వ తేదీ వరకు వరుసగా(సెలవులు మినహా) పరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) విడుదల చేసింది. ఇప్పటివరకు 88 శాతం మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, పరీక్ష సమయానికి గంటముందు వరకు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు టీఆర్ఈఐఆర్‌బీ కల్పించింది. ముందస్తుగా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని నిబంధనలు పాటించాలని, పరీక్ష కేంద్రాలను ముందస్తుగా పరిశీలించుకుంటే ఇబ్బందులు ఉండవని గురుకుల బోర్డు కన్వీనర్ మల్లయ్యబట్టు తెలిపారు.

- అర్హత పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకు మొదటి సెషన్, రెండోసెషన్ మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు, మూడోసెషన్ సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ఉంటుంది.
- పరీక్ష సమయంకంటే గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను లోపలికి అనుమతిస్తారు. పరీక్ష సమయం 15 నిమిషాల వరకు మాత్రమే గేట్లు తెరిచి ఉంచుతారు. ఆ తర్వాత గేట్లు మూసివేస్తారు.
- పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరు. అధికారుల పరిశీలనలో సంతృప్తి చెందితేనే లోనికి పంపిస్తారు.
- అభ్యర్థులు తమ వెంట ఏదేని ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు (పాస్‌పోర్టు, ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్) వెంట తీసుకెళ్లాలి.
- ఎగ్జామ్‌హాల్‌లోకి వెళ్లిన తర్వాత అభ్యర్థి బయోమెట్రిక్ సమాచారం సేకరిస్తారు.
- ప్రతి పరీక్ష 120 నిమిషాల పాటు నిర్వహిస్తారు. నిర్దేశించిన గడువు తర్వాతే అభ్యర్థిని బయటకు పంపిస్తారు.
- ప్రతి అభ్యర్థి హాల్‌టికెట్ తప్పకుండా వెంట తీసుకెళ్లాలి. హాల్‌టికెట్‌లో సాంకేతిక కారణాలతో ఫొటో ముద్రితం కాకుంటే ఒరిజినల్ ఫొటో అతికించి నిబంధనలకు అనుగుణంగా గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి హాజరుకావాలి.



బోర్డు కార్యాలయం వద్ద అభ్యర్థుల ఆందోళన

పరీక్ష కేంద్రాల కేటాయింపు గందరగోళంగా జరిగిందంటూ కొందరు అభ్యర్థులు సోమవారం ఉదయం దామోదరం సంజీవయ్య సంక్షేమభవన్‌లో ఆందోళనకు దిగారు. దాదాపు 50 మంది అభ్యర్థులు బోర్డు కార్యాలయ ఆవరణకు చేరుకుని అధికారులను నిలదీశారు. ఒక్కో పరీక్షకు ఒక్కోచోట కేంద్రం కేటాయించడం, సుదూర ప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణించడం కత్తిమీద సాముగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు ప్రశాంతంగా ఎలా రాయగలమని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాల కేటాయింపులో అధికారులు, ఉద్యోగుల ప్రమేయం ఏమీ లేదని, అభ్యర్థులకు సర్దిచెప్పి పంపించారు.

గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన గద్దర్

● గద్దర్‌ను పరామర్శించిన పలువురు ప్రముఖులు
● వేగంగా కోలుకుంటున్నా.. తిరిగి సాంస్కృతిక ఉద్యమంలో పాల్గొంటా: గద్దర్



గద్దర్‌ను పరామర్శిస్తున్న జానారెడ్డి

సాక్షి, హైదరాబాద్ (అమీర్‌పేట): ప్రజా గాయకుడు గద్దర్ గుండెపోటుతో అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. గత 10 రోజుల క్రితం అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చేరిన గద్దర్‌కు డాక్టర్ ప్రసాదరావు నేతృత్వంలోని ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగానే ఉందని, వేగంగా కోలుకుంటున్నానని వైద్యుల సూచనల మేరకు అన్నిరకాల పరీక్షలు, చికిత్సలు తీసుకున్నానని సోమవారం ఓ ప్రకటనలో గద్దర్ తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాంస్కృతిక ఉద్యమంతో ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. 76 ఏళ్ల వయస్సున్న తన దేహంలో ఇరుక్కున్న తూటా వయస్సు పాతికేళ్లని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సినీ దర్శక నిర్మాత ఆర్.నారాయణ మూర్తి, మాజీ హోంశాఖ మంత్రి కె.జానారెడ్డి, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌సాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్ రావు, జూపూడి ప్రభాకర్‌రావు, గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు యాదగిరి తదితరులు గద్దర్‌ను కలిసి పరామర్శించారు.

డీజిల్‌కు డబ్బులు ఇవ్వలేదని...

● రోగిని తీసుకెళ్లని అంబులెన్స్ డ్రైవర్
● అనారోగ్యంతో ఏరియా ఆస్పత్రిలోనే మృతి

బాన్సువాడ: మెరుగైన చికిత్స కోసం ఓ రోగిని బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు తరలించారు. అయితే డీజిల్‌కు డబ్బులు ఇవ్వలేదని అంబులెన్స్ డ్రైవర్ రోగిని తీసుకెళ్లలేదు. దీంతో పరిస్థితి విషమించి ఆ రోగి మృతి చెందిన ఘటన బాన్సువాడ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నస్రూల్లాబాద్ మండలం నెమ్లి గ్రామానికి చెందిన సాయిలు (40) వాంతులు, విరోచనాలతో మూడురోజుల క్రితం బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. సోమవారం తెల్లవారుజామున సాయిలుకు ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారింది. విధుల్లో ఉన్న వైద్యుడు పరిస్థితి గమనించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించాలని సాయిలు కుమారుడికి సూచించారు. వైద్య సిబ్బంది ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి పిలిపించారు. అయితే డ్రైవర్ అంబులెన్స్‌లో డీజిల్ లేదని...రూ.800 ఇవ్వాలని సాయిలు కుమారుడికి చెప్పాడు. తన వద్ద రూ.50 ఉన్నాయని, ఎలాగైనా తన తండ్రిని నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని అంబులెన్స్ డ్రైవర్‌ను ప్రాధేయపడ్డాడు. డబ్బులు ఇస్తేనే తీసుకెళ్తానని చెప్పి అంబులెన్స్ డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోగా, కొద్దిసేపటి తర్వాత సాయిలు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు కూడా ఇందులో పాల్గొన్నారు. సాయిలు మృతికి కారణమైన వైద్య సిబ్బందిపై, అంబులెన్స్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి వచ్చి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు. రాస్తారోకోలో కొత్తకొండ భాస్కర్, కాసుల బాల్‌రాజ్, గుడుగుట్ల శ్రీనివాస్, ఖలేక్, హన్మాండ్లు, మంత్రి గణేశ్, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని...

● ప్రేమికురాలితో ఫోన్ మాట్లాడుతూనే యువకుడి ఆత్మహత్య
● మృతుడు ఖోఖో జాతీయస్థాయి క్రీడాకారుడు



జున్న గణేష్

మామునూరు: ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఓ ప్రేమికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ నగరంలోని బొల్లికుంటలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన జున్న చేరాలు కుమారుడు జున్న గణేష్(25) ఖోఖోలో జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీలో పీపీడీ చదువుతున్నాడు. గణేష్‌కు ఐనవోలు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. విషయం అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులకు తెలిసింది. దీంతోవారు ఆదివారం సాయంత్రం ఆగ్రహంతో బొల్లికుంటకు వచ్చి గణేష్‌ను బెదిరించారు. దీంతో ప్రేమ విఫలమైనట్టేనని మనస్తాపానికిలోనైన గణేష్ సోమవారం ఉదయం 11 గంటలకు కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా, ప్రేమికురాలతో మాట్లాడుతూ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తర్వాత కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగా, ఫ్యాన్‌కు వేలాడుతూ గణేష్ మృతదేహం కనిపించింది. మృతుడి తండ్రి చేరాలు సమాచారంతో ఎస్‌ఐ కృష్ణవేణి సంఘటనా స్థలికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను తల్లిదండ్రుల నుంచి సేకరించింది. గణేష్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఆత్మహత్య చేసుకున్న అంశంపై పోలీసులను వివరణ కోరగా, గణేష్ ఉరి వేసుకున్న చోట ఫోన్‌కింద పడి ఉందని, దీనిపై పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు తెలుస్తాయన్నారు.

పాఠశాల ఆవరణలో ప్రసవం

ఆస్పత్రికి తరలించాక మరో శిశువుకు జన్మనిచ్చిన మహిళ

● తల్లి, ఇద్దరు శిశువులు క్షేమం



ఆస్పత్రిలో శిశువు

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని ఓ మహిళ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. రక్తపు మడుగులో ప్రాణాపాయస్థితిలో శిశువుని పక్కలో పెట్టుకొని తీవ్ర నరకయాతన అనుభవించింది. ప్రసవం అయ్యాక గంటపాటు ఆ మహిళ అక్కడే ఉండటంతో స్పృహతప్పి పడిపోయింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం పరిధిలోని పెద్దమ్మగూడలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ మహిళ శిశువుని పక్కన పెట్టుకొని పడిపోయిన విషయాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు. జిన్నారం ఎస్‌ఐ విజయారావు ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు స్పందించారు. జిన్నారం ఆస్పత్రి వైద్యులు ఆ మహిళకు వైద్యసేవలు చేసేందుకు యత్నించగా, ఆమె సహకరించలేదు. దీంతో ఎస్‌ఐ విజయరావు స్పందించి 108 వాహనంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో మరో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, ఇద్దరు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారు. మహిళకు మతిస్థిమితం సరిగా లేదని, తారా అనే పేరును ఉచ్చరిస్తుందని, పశ్చిమబెంగాల్‌కు చెందిన మహిళగా గుర్తించామని ఎస్‌ఐ విజయరావు తెలిపారు.

మృతదేహాన్ని కొరికేసిన ఎలుకలు!

● యాదాద్రి భువనగిరి ఆస్పత్రి మార్చురీలో ఘటన



భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో ఉన్న ఓ మృతదేహాన్ని ఎలుకలు కొరుక్కుతిన్నాయి. ఏపీలోని గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన పెరికల రవికుమార్ (38) కుటుంబం 2016లో భువనగిరికి వలస వచ్చింది. రవికుమార్‌కు వివాహం జరగా, ఒక కుమార్తె జన్మించింది. కొంతకాలానికి ఆమె చనిపోవడంతో, రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు. ఏడాది క్రితం రెండో భార్య రవికుమార్‌ను వదిలివెళ్లింది. దీంతో ఆయన తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి పట్టణంలోని ప్రగతినగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్న రవికుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తగాదా పడుతుండడంతో తల్లిదండ్రులు, పిల్లలు సమీపంలోని తెలిసిన వారి ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 11:30 నిమిషాలకు ఇంటికి వచ్చేసరికి రవికుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మార్చురీ గదిలోని ఫ్రీజర్‌లో కాకుండా బయట భద్రపరిచారు.

ఆ ఆనవాళ్లు చూసి..

రవికుమార్ మృతదేహాన్ని చూసేందుకు సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో పాటు బంధువులు మార్చురీకి వచ్చారు. అప్పటికే మృతదేహం ముఖం, చెంపలు, నుదుటిపై ఎలుకలు కొరికిన ఆనవాళ్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఎలుకలు కొరికినట్టు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నానాయక్ తెలిపారు.

70,689 సీట్ల కేటాయింపు

రెండో విడత ఎంసెట్ కౌన్సెలింగ్ పూర్తి ● కంప్యూటర్ కోర్సులు 94 శాతం ఫుల్ ● సివిల్, మెకానికల్ 43 శాతమే

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్ (ఇంజనీరింగ్) సోమవారం పూర్తయ్యింది. అన్ని బ్రాంచీలకు కలిపి 70,689 సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్య కమిషనర్ వాకాటి కరుణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 174 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. తొలి విడత భర్తీ చేయని 18 వేల సీట్లు, సీట్లు వచ్చినా రిపోర్ట్ చేయకపోవడంతో మిగిలిన 12 వేల సీట్లు మొత్తం 30 వేల సీట్లను రెండో విడతలో కలిపారు. 53,764 మంది 23,02,869 ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద మొత్తం 82,702 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా.. రెండో విడత భర్తీ తర్వాత ఇంకా 12,013 సీట్లు మిగిలాయి. నాలుగు యూనివర్సిటీలు, 28 ప్రైవేటు కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. విద్యార్థులు ఎక్కువగా కంప్యూటర్ సైన్స్ కోర్సులకే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, ఐవోటీ అండ్ సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ బ్రాంచీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)లో 2,103 సీట్లు ఉంటే 1,987 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తం మీద 18 రకాల కంప్యూటర్ కోర్సుల్లో 56,059 సీట్లు ఉంటే 52,922 సీట్లు భర్తీ కాగా 3,137 సీట్లు మాత్రమే మిగిలాయి. అయితే ఇవి మారుమూల ప్రాంతాల్లో ఉన్న కాలేజీల్లోనే ఉన్నాయి. ఇక ఎలక్ట్రికల్ దాని అనుబంధ బ్రాంచీల్లో 17,320 సీట్లు అందుబాటులో ఉంటే, రెండో దశ నాటికి 13,515 సీట్ల కేటాయింపు జరిగింది. సివిల్, మెకానికల్‌లో 8,125 సీట్లు ఉంటే 3,533 మాత్రమే భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన వ్యక్తులు ఆగస్టు 2లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఆఖరి విడత కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత ఆగస్టు 9 నుంచి 11 తేదీల మధ్య కాలేజీల్లో సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ప్రధాన బ్రాంచీల్లో సీట్ల కేటాయింపు...

బ్రాంచీలు	ఉన్న సీట్లు	కేటాయింపు	మిగిలినవి	కేటాయించిన శాతం
కంప్యూటర్ సైన్స్ కోర్సులు	56,059	52,922	3,137	94.40
ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్	17,320	13,515	3,805	78.03
సివిల్, మెకానికల్	8,125	3,533	4,592	43.48
ఇతర బ్రాంచీలు	1,198	719	479	60.02
మొత్తం	82,702	70,689	12,013	85.47

క్లుప్తంగా...

విద్యార్థిని వాటర్ బాటిల్‌లో మూత్రం పోసిన విద్యార్థులు

జైపూర్: తోటి విద్యార్థిని పట్ల కొందరు విద్యార్థులు అమానుషంగా ప్రవర్తించారు. ఆమె మంచినీళ్ల బాటిల్‌లో మూత్రం పోశారు. ఈ ఘటన రాజస్తాన్‌లోని భిల్వారా జిల్లా లుహారియా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక స్కూలులో చదువుకుంటోంది. శుక్రవారం కొందరు విద్యార్థులు ఆమె మంచినీళ్ల బాటిల్‌లో మూత్రం కలిపారు. ఇది తెలియని బాలిక ఆ నీళ్లు తాగింది. దుర్వాసన రాగా ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేసింది. తన పుస్తకాల బ్యాగులో ప్రేమ లేఖ కూడా ఉన్నట్లు తెలిపింది. స్పందించకపోవడంతో కుటుంబసభ్యులకు తెలిపింది. వారు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తహశీల్దారు, పోలీసులకు కూడా వారు తెలిపారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అనుమానితుల ఇళ్లపై రాళ్ల దాడికి దిగారు.

మూడేళ్లలో 3,110 మనీ లాండరింగ్, 12 వేల ఫెమా కేసులు

న్యూఢిల్లీ: గడిచిన మూడేళ్ల కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 3,110 మనీలాండరింగ్ కేసులు, విదేశీ మారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘనల కింద మరో 12 వేల కేసులు నమోదు చేసినట్లు కేంద్రం సోమవారం తెలిపింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఆయా కేసుల తీవ్రత ఆధారంగానే మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)-1999 కింద ఈడీ కేసులు నమోదు చేసినట్లు మంత్రి పంకజ్ చౌధరి వివరించారు.

వర్షాలు, వరదలతో 9 ఏళ్లలో 17 వేల మంది మృతి

న్యూఢిల్లీ: దేశంలో 2012-2021 సంవత్సరాల మధ్య సంభవించిన వరదలు, భారీ వర్షాలతో 17,422 మంది చనిపోయినట్లు కేంద్రం తెలిపింది. సోమవారం రాజ్యసభలో జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి విశ్వేశ్వర్ తుడు ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా ఈ వివరాలను ఆయన వెల్లడించారు. అతి తక్కువ సమయంలో అతి భారీ వర్షాలు కురియడమే పట్టణ ప్రాంతాల్లో వరదలకు ప్రధాన కారణమన్నారు. ఆక్రమణలకు గురైన సహజ నీటి వనరులు, విచ్చలవిడిగా నిర్మాణాలు, నాణ్యతలేని మురుగు వ్యవస్థ వంటివి సమస్యను మరింత పెంచుతున్నాయని వివరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2012-21 సంవత్సరాల కాలంలో వర్షాలు, వరదలతో పంటలు, నివాసాలు, ఇతరాలకు కలిపి మొత్తం రూ.2.76 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు.



శునకంలా వాకింగ్ చేస్తున్న టోకో

అచ్చు శునకంలా

- అచ్చం కుక్కను తలపించే వేషధారణ
- జపాన్‌లో ఓ యూట్యూబర్ ప్రయోగం
- జీవితకాల కోరిక తీర్చుకున్న వైనం
- అందుకు రూ.12 లక్షలు వెచ్చించిన టోకో
- యూట్యూబ్‌లో 10 లక్షలు దాటిన వ్యూస్

జిహ్వకో రుచి. పుర్రెకో బుద్ధి. వెర్రి వేయి విధాలు. జపాన్‌లో ఓ వ్యక్తి చేసిన పని చూస్తే ఇలాంటి సామెతలన్నీ వరుసబెట్టి గుర్తు రాక మానవు! అచ్చం కుక్కలా కనిపించేందుకు మనవాడు ఏకంగా 12 లక్షల రూపాయలు ఖర్చు పెట్టాడు. పైగా ఆ వేషంలో ఆరుబయట యథేచ్ఛగా తిరిగాడు. అలా జీవితకాల ముచ్చట నెరవేర్చుకుని మురిసిపోయాడు!

జపాన్‌కు చెందిన టోకో అనే వ్యక్తి ఓ యూట్యూబర్. తన చానల్ పేరేమిటో తెలుసా? ఐ వాంట్ టు బీ యాన్ యానిమల్' (జంతువులా మారాలనుకుంటున్నా). దానికి ఏకంగా 31 వేల మందికి పైగా సబ్‌స్క్రైబర్లున్నారు. మనవాడి జీవితకాలపు కోరికుంది. ఏమిటో తెలుసా? ఎలాగైనా కుక్కలా మారడం! దాన్ని తీర్చుకోవడానికి జపాన్‌లో సినిమాలకు, టీవీ షోలకు కాస్ట్యూమ్స్ సరఫరా చేసే జెప్పెట్ అనే ప్రముఖ స్థానిక కంపెనీని సంప్రదించాడు. తన కోరిక వివరించాడు. అచ్చం కుక్కలా కనిపించే కాస్ట్యూమ్ డిజైన్ చేసిచ్చేందుకు వాళ్లూ సరేనన్నారు. అయితే తాను కుక్కను కాదని మనుషులు కాదు కదా, కనీసం కుక్కలు గుర్తు పట్టొద్దని టోకో షరతు విధించాడు. కుక్క వేషంలో తన లుక్ అంత సహజంగా ఉండాలన్నాడు. అందుకోసమని ఏకంగా 20 లక్షల యెన్‌లు (రూ.12 లక్షలు) చెల్లించాడు. కంపెనీ వాళ్లు దీన్నో సవాలుగా తీసుకున్నారు. 40 రోజులు కష్టపడి మరీ టోకోకు కావాల్సిన కుక్క కాస్ట్యూమ్ తయారు చేసిచ్చారు.

పార్కులో 'డాగ్' వాక్

➤ అంతా రెడీ అయ్యాక, ఒక మంచి రోజు చూసుకుని తను తయారుచేయించుకున్న కుక్క వేషం వేసి మనవాడు తొలిసారిగా షికారుకు బయల్దేరాడు. సమీపంలోని పార్కుకు వెళ్లి సందడి చేశాడు. అచ్చం కుక్కలా దొర్లుతూ, తోటి కుక్కల దగ్గరికెళ్లి వాటిని వాసన చూస్తూ హడావుడి చేశాడు. దీన్నంతటినీ వీడియో తీయించుకోవడం మర్చిపోలేదు. దాన్ని తన యూట్యూబ్ చానల్లో అప్‌లోడ్ చేస్తే చూస్తుండగానే 10 లక్షలకు పైగా వ్యూస్ వచ్చి పడ్డాయి! ''నా కుక్క వేషం సూపర్‌హిట్టయింది. జీవితకాల కలా నెరవేరింది. వీడియో కూడా బంపర్ హిట్టయింది. ఎలా చూసుకున్నా కుక్క వేషం కోసం పడ్డ ప్రయాసకు తగిన ఫలితం దక్కింది'' అంటూ టోకో సంబరపడిపోతున్నాడు.

గతేడాదే చెప్పాడు

➤ మనోడు తన మనోగతాన్ని గతేడాదే బయట పెట్టాడు. మానవ శునకంగా మారాలనుందని డైలీ మెయిల్ వార్తా పత్రిక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ''ఇలాంటి నా అభిరుచులు బయటికి తెలియడం నాకిష్టముండదు. ముఖ్యంగా నా సహోద్యోగులకు. ఎందుకంటే మరీ కుక్కలా మారాలనుందంటే వాళ్లకు విచిత్రంగా తోస్తుందేమో కదా! అందుకే ఇప్పుడు నా అసలు రూపం ఎలా ఉంటుందో అందరికీ చూపించదలచలేదు. ఇలా కుక్కలా మారాలనుందని నా క్లోజ్ ఫ్రెండ్స్‌కు కూడా చెప్పలేదు. పిచ్చనుకుంటారేమోనని భయం'' అన్నాడు టోకో! కుక్క వేషంలో తొలిసారి పార్కుకు వెళ్లినప్పుడు కాస్త నెర్వస్‌గా, మరి కాస్త భయంగా అనిపించిందట మనవాడికి. ''అయితే, అక్కడ నన్ను చూసిన మనుషులతో పాటు కనీసం కుక్కలు కూడా నేను కుక్కను కాదని పొరపాటున కూడా అనుకోలేదు. అంటే నా మిషన్ గ్రాండ్ సక్సెస్ అన్నట్టే కదా'' అంటూ సంబరపడిపోయాడు.

> టోకో కోరిక మేరకు కోలీ జాతి కుక్కలాంటి కాస్ట్యూమ్ తయారు చేసిచ్చాం. అది వేసుకున్న వాళ్లు కుక్క కాదని చెప్పినా ఎవరూ నమ్మరు. అంత సహజంగా కుదిరిందది
> – కాస్ట్యూమ్స్ తయారీ కంపెనీ జెప్పెట్ అధికార ప్రతినిధి

మణిపూర్ దురాగతం.. భయానకం

సుప్రీంకోర్టు ధర్మాసనం ఆందోళన

- మహిళలపై జరిగిన హింసను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడలేం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరు ప్రశ్నలు
- 24 గంటల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశం



న్యూఢిల్లీ: మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న దారుణాలు తీవ్ర ఆందోళనకరమని, ఇవి అసాధారణమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం నిజంగా భయంకరమైన సంఘటన అని పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో మహిళలపై చోటుచేసుకున్న దురాగతాలను మణిపూర్ మహిళల అంశంతో సమానంగా చూడలేమని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ తదితర బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో మహిళలపై ఎన్నో ఘోరాలు జరిగాయని, వారికి అవమానాలు ఎదురయ్యాయని, దీనిపై విచారణ జరపాలని కోరుతూ లాయర్, బీజేపీ నేత బాన్సురీ స్వరాజ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతోపాటు మణిపూర్ హింసకు సంబంధించిన ఇతర పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బాన్సురీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. రక్షిస్తే దేశంలోని మహిళలనందరినీ రక్షించండి, లేకపోతే ఎవరినీ రక్షించకండి అని చెబుతున్నారా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇతర రాష్ట్రాల్లో కూడా మహిళలపై హింస జరుగుతోందంటూ మణిపూర్‌లో జరిగిన దారుణాలను సమర్థించుకోలేరని ఘాటుగా వ్యాఖ్యానించింది. మహిళలపై హింస అనేది దేశమంతటా జరుగుతోందని, స్వరాజ్ పిటిషన్‌పై తర్వాత దృష్టి సారిస్తామని పేర్కొంది. మణిపూర్ విచారణ విషయంలో తమకు సహకరించాలని భావిస్తే సహకరించవచ్చని స్వరాజ్‌కు సూచించింది.

నమోదు చేసిన కేసులెన్ని?

ఇద్దరు బాధిత మహిళల తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలో హింసకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయో కూడా ప్రభుత్వం వద్ద వివరాలు లేవని ఆక్షేపించారు. మణిపూర్ మారణకాండపై దర్యాప్తును సుప్రీంకోర్టు స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. దీంతో మణిపూర్ హింసపై కేంద్ర ప్రభుత్వానికి, మణిపూర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధర్మాసనం 6 ప్రశ్నలు సంధించింది. 24 గంటల్లో వాటికి సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. 1.రాష్ట్రంలో హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా మొత్తం ఎన్ని కేసులు నమోదు చేశారు? 2.వీటిలో జీరో ఎఫ్ఐఆర్‌లు ఎన్ని? 3.ఇతర పోలీసు స్టేషన్లకు ఎన్ని కేసులను బదిలీ చేశారు? 4.ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారు? 5.అరెస్టయిన నిందితులకు అందించిన న్యాయ సహాయం పరిస్థితి ఏమిటి? 6.సెక్షన్ 164 కింద రికార్డు చేసిన స్టేట్‌మెంట్లు ఎన్ని? అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించింది. మణిపూర్ ఘటనలపై దర్యాప్తును పర్యవేక్షించడానికి రిటైర్డ్ న్యాయమూర్తులతో ఒక కమిటీని లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలన్న ఆలోచన వస్తోందని వివరించింది.

పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం

మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసతోపాటు రాష్ట్రంలో అడవుల నరికివేత, గంజాయి సాగు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ తాజాగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తిరస్కరించింది. మాయాంగ్లాంబమ్ బాబీ మైతేయి తరఫున సీనియర్ అడ్వొకేట్ మాధవి దివాన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), జాతీయ మానవ హక్కుల సంఘం, మణిపూర్ ప్రభుత్వాన్ని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. కేవలం ఓ వర్గంపై నిందలు వేసేలా ఉన్న ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది.

14 రోజులు ఏం చేశారు?

ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం అనేది నిర్భయ తరహా కేసు కాదని, ఇది వ్యవస్థీకృతంగా జరిగిన హింస అని వెల్లడించింది. మే 4న సంఘటన జరిగితే, మే 18న కేసు పెట్టారని, మధ్యలో 14 రోజులపాటు ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీసింది. బాధిత మహిళలను రాష్ట్ర పోలీసులే చేజేతులా రాక్షస మూకకు అప్పగించినట్లుగా ఉందని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇప్పటిదాకా ఏయే చర్యలు తీసుకున్నారో తమకు నివేదిక సమర్పించాలని మణిపూర్ పోలీసులను ఆదేశించింది. మణిపూర్ హింస కేసులో తాము ఎంతవరకు జోక్యం చేసుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ స్పందనపై ఆధారపడి ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. ప్రభుత్వ చర్యలు సంతృప్తికరంగా ఉంటే తాము జోక్యం చేసుకోబోమంది.

జైపూర్ రైల్లో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ దారుణం



ముంబై: రాజస్తాన్ నుంచి ముంబైకి వస్తున్న జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ చేతన్ సింగ్(34) విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ టికారామ్ మీనాపై, వేర్వేరు బోగీలు, ప్యాంట్రీకార్‌లోని ప్రయాణికులపై తుపాకీగుళ్ల వర్షం కురిపించాడు. ఈ ఘటనలో టికారామ్, ముగ్గురు ప్రయాణికులు మరణించారు. తర్వాత రైలు దిగి కానిస్టేబుల్ పారిపోతుండగా ఆర్‌పీఎఫ్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ముంబైకి 100 కి.మీ.ల దూరంలోని పాల్ఘర్ వద్ద సోమవారం ఉదయం ఐదుగంటలకు ఈ కాల్పుల ఘటన జరిగింది. 'విచక్షణకోల్పోయి అతను ఎందుకిలా ప్రవర్తించాడనేది ఇంకా తెలియరాలేదు' అని గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) కమిషనర్ రవీంద్ర చెప్పారు.'కానిస్టేబుల్ చేతన్‌కు కోపం ముక్కోపి. ఆటోమేటిక్ ఆయుధం నుంచి 12 రౌండ్లకాల్పులు జరిపాడు' అని జీఆర్‌పీ మరో అధికారి వెల్లడించారు. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ఏఎస్సై మీనా 2025లో పదవీవిరమణ చేయాల్సి ఉంది. అతని కుటుంబానికి రైల్వే శాఖ రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కానిస్టేబుల్ చేతన్, ఏఎస్సైల బృందం రైలులో భద్రత నిమిత్తం గుజరాత్‌లోని సూరత్‌లో రైలు ఎక్కారని అధికారులు తెలిపారు.



బీచ్ వెంట సరదాగా సైకిల్ తొక్కుతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య జిల్ బైడెన్. సోమవారం డెలావెర్‌లో రెహొబొత్ బీచ్ వద్ద తీసిందీ ఫొటో.

డీకే శివకుమార్‌కు సుప్రీంలో ఊరట


న్యూఢిల్లీ: కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అవినీతి కేసులో తమ దర్యాప్తును నిలుపుదల చేస్తూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా దానిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఫిబ్రవరి పదో తేదీన హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులో కలగజేసుకోబోమని బెంచ్ స్పష్టంచేసింది. గతంలో కర్ణాటక హైకోర్టు సీబీఐ దర్యాప్తుపై స్టేను పలుమార్లు పొడిగించడం తెల్సిందే.

మా పార్టీ గెలిస్తే మా అన్నే పీఎం: షెహబాజ్

ఇస్లామాబాద్: రానున్న ఎన్నికల్లో తమ పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్(పీఎంఎల్-ఎన్) మరోసారి విజేతగా నిలిచిన పక్షంలో తన సోదరుడు, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రధానిగా పగ్గాలు చేపడతారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. లండన్‌లో గడుపుతున్న నవాజ్ స్వదేశానికి త్వరలో వస్తారన్నారు. సాధారణ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు వీలుగా తటస్థుడిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేస్తామన్నారు. తాత్కాలిక ప్రధాని ఎవరనే విషయమై భాగస్వామ్య పార్టీలతోపాటు, పీఎంఎల్-ఎన్ చీఫ్ నవాజ్ షరీఫ్‌తో చర్చలు జరిపాక నిర్ణయిస్తామని తెలిపారు.

పార్లమెంట్‌లో రచ్చ రచ్చ

- మణిపూర్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్
- ఉభయ సభల్లోప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, నినాదాలు



విపక్ష సభ్యులను శాంతింపజేస్తున్న ధన్‌ఖడ్



రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో తక్షణమే చర్చ ప్రారంభించాలని, ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సిందేనని ప్రతిపక్షాలు పునరుద్ఘాటించాయి. సోమవారం ఉభయ సభల్లో ఆందోళనకు దిగాయి. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు ఆమోదం

లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తర్వాత స్పీకర్ బిర్లా మాట్లాడారు. వెంటనే విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి నిల్చున్నారు. మణిపూర్ అంశంపై ప్రధాన మంత్రి ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విపక్షాల ఆందోళన మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. విద్యా, ఆర్థిక శాఖలకు చెందిన ప్రశ్నలపై చర్చ మొదలైంది. 'మీ స్థానాల్లోకి తిరిగి వెళ్లండి, సభకు సహకరించండి' అని స్పీకర్ పదేపదే కోరినా విపక్ష సభ్యులు లెక్కచేయలేదు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. లోక్‌సభ పునఃప్రారంభమైన తర్వాత సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు-2023ను ఆమోదించారు. ఈ బిల్లు రాజ్యసభలో గతంలోనే ఆమోదం పొందింది. పైరసీని అరికట్టడానికి ఈ బిల్లును తీసుకొచ్చినట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ప్రతిపక్ష ఎంపీల ఆందోళన, నినాదాలు కొనసాగుతుండడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాజ్యసభలో వాయిదాల పర్వం

మణిపూర్ అంశంపై '267 నిబంధన' కింద వెంటనే చర్చ చేపట్టాలని ఎగువసభలో ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి జోషి చెప్పారు. విపక్ష ఎంపీలు ప్రధాని సమాధానం చెప్పాలని పునరుద్ఘాటించారు. దీంతో సభను చైర్మన్ ధన్‌ఖడ్ పలుమార్లు వాయిదా వేశారు. తొలుత ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో మధ్యాహ్నం 2 గంటల దాకా, తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల దాకా, అనంతరం 3.30 గంటల వరకూ వాయిదా వేశారు. విపక్షాలు ఎంతకూ వెనక్కి తగ్గకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

మూడింట రెండొంతుల మెజార్టీ: పీయూష్ గోయల్

కేంద్రానికి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీ ఉందని, ఈ విషయం అందరికీ తెలుసని కేంద్ర మంత్రి, బీజేపీ నేత పీయూష్ గోయల్ చెప్పారు. సంఖ్యలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయన్నారు. మెజార్టీని నిరూపించుకున్న తర్వాతే బిల్లులను ఆమోదించాలన్న నిబంధన ఏదీ లేదని పేర్కొన్నారు. అవిశ్వాసం తీర్మానంపై ఎప్పుడు చర్చ చేపట్టాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని వివరించారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. అలాగే మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరిగే యూపీఏ ప్రభుత్వ హయాంనాటి నిర్వాకాలు బయట పడతాయన్న భయంతో కాంగ్రెస్ పార్టీ సభా కార్యకలాపాలను అడ్డుకుంటోందని పీయూష్ గోయల్ మండిపడ్డారు.

జెలెన్‌స్కీ సొంత నగరంపై క్షిపణి దాడులు



కీవ్: రష్యా సోమవారం ఉదయం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రివ్యిరిహ్‌పై రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో పదేళ్ల బాలిక సహా ఆరుగురు చనిపోయారు. ఈ దాడుల్లో ఓ అపార్టుమెంట్, నాలుగంతస్తుల యూనివర్సిటీ భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పదేళ్ల బాలిక, ఆమె తల్లి సహా అయిదుగురు ప్రాణాలు కోల్పోగా మరో 64 మంది గాయాలపాలయ్యారని నీప్రో గవర్నర్ సెర్హీ లిసాక్ తెలిపారు. ఇంకా కొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు చెప్పారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. రష్యా పాక్షికంగా ఆక్రమించిన డొనెట్స్క్ ప్రావిన్స్‌లో జరిగిన దాడిలో ఇద్దరు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ దాడికి కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. కాగా, మాస్కోపైకి ఆదివారం డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్ సోమవారం రష్యాలోని బ్రియాన్స్క్‌పై డ్రోన్ దాడి జరిపింది. ఎవరూ చనిపోయినట్లు సమాచారం లేదని స్థానిక గవర్నర్ చెప్పారు. ఖర్కీవ్, ఖెర్సన్, డొనెట్స్క్‌లపై రష్యా శతఘ్ని కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఏడుగురు గాయాలపాలయ్యారు.

చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): గత నెల 14వ తేదీన ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు సోమవారం అర్ధరాత్రి దాకా లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీ అనే ఆపరేషన్‌ను చేపట్టారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన అపోజీ ఇంధనాన్ని మండించి చంద్రయాన్-3 మిషన్‌ను భూకక్ష్య నుంచి చంద్రుని కక్ష్యవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఇలా చంద్రయాన్-3 కక్ష్య దూరం మరోమారు పెంచారు. అక్కడ నుంచి ఐదు రోజులపాటు చంద్రుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమించి వంద కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి తీసుకురావడానికి ఐదు రోజుల సమయం తీసుకుంటుంది. ఆ కక్ష్యలోకి వచ్చాక ఆగస్టు 23వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రునికి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. తర్వాత అది ల్యాండర్‌ను జార విడుస్తుంది. ఆ రోజు సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రాంతంలో దిగుతుంది. ల్యాండర్ విచ్చుకుని లోపలి నుంచి రోవర్ బయటకు అడుగుపెట్టనుంది. అది చంద్రుడిపై 14 రోజుల పాటు పరిశోధనలు చేసి సమాచారాన్ని అందిస్తుంది. అంటే చంద్రయాన్-3 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరుకోవడానికి ఇంకా 17 రోజులు, చంద్రుడిపై దిగడానికి 23 రోజులు పడుతుందన్న మాట.

ఆగస్ట్-సెప్టెంబర్ నెలల్లో సాధారణ వర్షాలు: వాతావరణ శాఖ

న్యూఢిల్లీ: దేశంలో వర్షాకాలం రెండో అర్ధభాగం(ఆగస్ట్-సెప్టెంబర్)లో సాధారణ వర్షాలే కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం తెలిపింది. జూలైలో దేశవ్యాప్తంగా అధిక వర్షాలు నమోదయ్యాయని పేర్కొంది. నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో పరిస్థితులు ప్రభావితం చేయలేకపోయాయని తెలిపింది. ఆగస్ట్, సెప్టెంబరు నెలల్లో సాధారణ వర్షపాతాన్ని అంచనా వేసినప్పటికీ, సాధారణ (422.8 మిల్లీమీటర్ల కంటే తక్కువగా (94 శాతం నుంచి 99 శాతం) కురిసే అవకాశాలున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర మీడియాతో అన్నారు. జూన్‌లో సాధారణం కంటే 9% లోటు వర్షపాతం నమోదవగా, జూలై వచ్చే సరికి 13% అదనంగా వానలు పడ్డాయని చెప్పారు. అయితే, తూర్పు, ఈశాన్య భారతంలో 1901 తర్వాత మొదటిసారిగా అత్యల్ప వర్షపాతం 280.9 మిల్లీమీటర్లు నమోదైందని చెప్పారు. గత అయిదేళ్లలోనే అత్యధికంగా ఈసారి 1,113 భారీ వర్షపాతం ఘటనలు, 205 అత్యంత భారీ వర్షపాతం ఘటనలు జూలైలో నమోదయ్యాయని చెప్పారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

తిరువనంతపురం: తమిళనాడులోని తిరుచిరాపల్లి నుంచి షార్జాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, విమానాన్ని ముందు జాగ్రత్తగా కేరళలో తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. 154 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో సోమవారం ఉదయం 10.45 గంటలకు తిరుచిరాపల్లి నుంచి ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకుంది. కొద్దిసేపటికే ఇంజిన్‌లో సమస్యలు తలెత్తినట్లు గుర్తించిన పైలట్ అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో పూర్తి స్థాయి అత్యవసర పరిస్థితి ప్రకటించి, మధ్యాహ్నం 12.01 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిరిండియా తెలిపింది. తిరువనంతపురం-బహ్రెయిన్ ఎక్స్‌ప్రెస్ సాంకేతిక లోపంతో నిలిచిపోయిందని ఎయిరిండియా పేర్కొంది.

నీతి–మనా లోయ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు

డెహ్రాడూన్: భోజపత్ర కాలిగ్రఫీని జీవనోపాధిగా మార్చుకున్న ఉత్తరాఖండ్‌లోని నీతి–మనా లోయ మహిళలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో వారి కృషిని ఆయన ప్రస్తావించారు. 'పురాతన కాలంలో మహాభారతాన్ని భోజపత్రపైనే రాశారు. మన సంస్కృతిలో భాగమైన భోజపత్రతో నీతి–మనా లోయ మహిళలు కళాఖండాలు, సావనీర్లు రూపొందిస్తున్నారు. దీనితో తమ జీవితాలనే మార్చేసుకున్నారు'అని కొనియాడారు. ఈ లేఖనాలను అందరూ ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నార న్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సాంస్కృతిక వారసత్వాన్ని ఉపయోగించుకోవడం అభినందనీయమన్నారు. వీరి కృషి కారణంగా ఈ ప్రాంతం పర్యాటకపరంగా ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. అక్టోబర్‌లో చైనా సరిహద్దు సమీపంలోని బద్రీనాథ్‌ను సందర్శించిన సమయంలో స్థానిక మహిళ ఒకరు అందమైన భోజపత్ర లేఖనాన్ని బహుమతిగా అందజేసినట్లు గుర్తుకు తెచ్చుకున్నారు. నీతి–మనా లోయలోని మనా గ్రామాన్ని ప్రధాని మోదీ అప్పట్లో మొట్టమొదటి భారతీయ గ్రామంగా అభివర్ణించారు.



ఆ మైనర్ అమాయకురాలేం కాదు

టీనేజర్ గర్భవిచ్ఛిత్తి పిటిషన్‌ను తిరస్కరించిన బాంబే హైకోర్టు

ముంబై: గత సంవత్సరం డిసెంబర్ నుంచి ఒక అబ్బాయితో శారీరక బంధం కొనసాగిస్తున్న ఈ మైనర్ బాలిక అమాయకురాలేం కాదని బాంబే హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ' సమ్మతి శృంగారంతోనే ఈ టీనేజీ అమ్మాయి గర్భం దాల్చింది. నిజంగా ఈ 17 ఏళ్ల బాలికకు గర్భం ఇష్టంలేదని భావిస్తే గర్భంవచ్చిందని నిర్ధారించుకున్న వెంటనే గర్భవిచ్ఛిత్తి కోసం దరఖాస్తు చేసుకొని ఉండాల్సింది' అని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ 26వ తేదీన వెలువర్చిన ఉత్తర్వులో వ్యాఖ్యానించింది. 'ఈమెకు ఈ నెలాఖరుకల్లా 18 ఏళ్లు నిండుతాయి. కొన్ని నెలలుగా 'ఫ్రెండ్'తో అమ్మాయి శారీరక బంధం కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వయంగా తనే ప్రెగ్నెన్సీ కిట్ తెచ్చుకుని పరీక్షించుకుంది. సంబంధిత కేసు వివరాలు పరిశీలిస్తే బాధిత మైనర్ అమాయకురాలేం కాదని అర్థమవుతోంది' అని జస్టిస్ రవీంద్ర, జస్టిస్ వైజీ ఖోబ్రగడేల బెంచ్ అభిప్రాయపడింది. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్(పోక్సో) చట్ట నిబంధనల ప్రకారం చూస్తే తాను చైల్డ్‌నని, గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఇవ్వాలంటూ తల్లి ద్వారా ఈ అమ్మాయి హైకోర్టులో పిటిషన్ వేసింది. 'వైద్యపరంగా గర్భవిచ్ఛిత్తి చట్టం' ప్రకారం 20 వారాలుదాటిన సందర్భాల్లో గర్భవిచ్ఛిత్తికి అనుమతి తప్పనిసరి. ప్రాణానికి హాని, తల్లి లేదా బిడ్డ ఆరోగ్యం విషమంగా మారొచ్చనే సందర్భాల్లోనే గర్భవిచ్ఛిత్తికి అనుమతిని ఇస్తారు. ' మరో 15 వారాల్లో డెలివరీ అనగా ఇప్పుడు గర్భవిచ్ఛిత్తి చేసినా బిడ్డ ప్రాణాలతోనే జన్మిస్తుంది. కానీ బ్రతికే అవకాశాలు తగ్గుతాయి. ఈ పరిస్థితుల్లో అబార్షన్‌కు అనుమతి ఇవ్వబోం. పుట్టాక ఎవరికైనా దత్తత ఇవ్వాలనుకుంటే ఇచ్చుకోవచ్చు. ఆమెకు ఆ 'స్వేచ్ఛ ఉంది' అని ధర్మాసనం స్పష్టంచేసింది.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



కొరియర్ అని నమ్మించి..

ఎల్‌బీనగర్ పరిధిలోని సచివాలయ నగర్‌లో కొరియర్ ఉందని చెప్పి ఇంట్లోకి వచ్చిన ఇద్దరు దుండగులు వృద్ధురాలిని బాత్‌రూంలో బంధించి ఇంట్లో ఉన్న బంగారం, నగదు దోచేశారు. -8లో



మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం వేగవంతం

మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం వేగవంతం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. -8లో

వాయిదా పడిన ఓయూ పరీక్షల నిర్వహణ తేదీల వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్షాల కారణంగా ఇటీవల ఓయూ పరిధిలో జూలై నెలలో జరగాల్సిన వివిధ కోర్సుల పరీక్షలు వాయిదా వేశారు. తాజాగా బీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఫార్మ్ కోర్సుల వివిధ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తేదీలను సోమవారం విడుదల చేశారు. వివరాలను www.osmania.ac.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

న్యూస్‌రీల్

ఫిలింనగర్‌లో ఎలక్ట్రికల్ బెంజ్ కారు బీభత్సం



ఫిలింనగర్: ఫిలింనగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఓ ఎలక్ట్రికల్ బెంజ్ కారు బీభత్సం సృష్టించింది. కారులో అతివేగంతో వచ్చిన యువతి దూసుకువెళ్తూ కంట్రోల్‌తప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. మాదాపూర్‌లో నివసించే దివ్య సోమవారం తెల్లవారుజామున 1.45 గంటల ప్రాంతంలో తన బెంజ్ కారు (టీఎస్ 07 జీవీ 5679)లో జర్నలిస్ట్ కాలనీ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్తుండగా వేగానికి స్టీరింగ్ అదుపు చేయలేక రోడ్డుపక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పాటు డివైడర్ పైకెక్కి ఓ ప్రహరీని ఢీకొట్టింది, ఈ ధాటికి కారులోని బెలూన్లు ఓపెన్‌కావడంతో కారు నడిపిస్తున్న యువతి ప్రాణాలు దక్కాయి. ప్రమాదం ధాటికి కారు రెండు టైర్లు విడిపోయి గాల్లోకి ఎగిరిపడ్డాయి. ఓవర్ స్పీడ్‌తో ఢీకొట్టడంతో కరెంట్ స్తంభంతో పాటు ప్రహరీ ధ్వంసమయ్యాయి. ప్రహరీ వెనుకాల వాచ్‌మెన్ కుటుంబం నివాసం ఉంటుండగా తృటిలో ప్రమాదం తప్పింది. ప్రమాదం అనంతరం కారు నడిపిస్తున్న యువతి అక్కడ నుంచి పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించారు.

ఎన్నికల 'ఏర్పాట్లు' షురూ!

- సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ఏర్పాట్లను సైబరాబాద్, రాచకొండ పోలీసులు ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం రెవెన్యూ అధికారులతో కలిసి తొలి సంయుక్త సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఇది జరిగింది. ఎన్నికల నేపథ్యంలో సమన్వయంతో పని చేయాలని అధికారులు నిర్ణయించారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ... సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక రూపొందిచాలని అన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలు ఉండాలన్నారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి, విధులపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ డి.అమోయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో టీమ్ వర్క్‌తో సమిష్టిగా పని చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ హరీష్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సహకరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



లక్డీకాపూల్‌లో..





ఖైరతాబాద్‌లో..

మన్సూరాబాద్ మల్లిఖార్జున కాలనీలో..





ఎల్బీనగర్‌లో ..

10 నిమిషాల్లోనే..

మళ్లీ దంచికొట్టిన వాన...

- పొంగిపొర్లిన డ్రైనేజీ, నాలాల మ్యాన్‌హోళ్లు
- భారీగా ట్రాఫిక్ జామ్
- మరో 24 గంటలు భారీ వర్ష సూచన

సాక్షి, సిటీబ్యూరో: మరోమారు వరుణ దేవుడు ఉన్నట్టుండి ఉండి ఉరిమాడు. సోమవారం సాయంత్రం పదంటే పది నిమిషాల్లోనే భారీ వర్షం దంచికొట్టింది. మహానగరం తడిసి ముద్దయింది. డ్రైనేజీలు, నాలాలు మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సగటున రెండు నుంచి మూడు సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. ఇక యథావిధిగా ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు నరకయాతన పడ్డారు. మరో 24 గంటలు తేలికపాటితో పాటు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. వరుసగా మూడు రోజులపాటు తెరిపిచ్చిన వర్షం సోమవారం సాయంత్రం ఒకేసారి ఆకాశంలో వచ్చిన మార్పుతో మళ్లీ కురిసింది. ఉద్యోగులు, విద్యార్థులు ఇళ్లకు చేరుకునే సమయం కావడంతో మరోసారి ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. జనం సుమారు గంటకుపైగా ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు. నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, మాసాబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, చార్మినార్, మాల్కాజిగిరి, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీ, ఉప్పల్, సరూర్‌నగర్, నాగోల్, రెయిన్‌బజార్, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, జూబ్లీహిల్స్, అశోక్‌నగర్, రామంతాపూర్, అంబర్‌పేట్, మలక్‌పేట్, హిమాయత్‌నగర్, పంజగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనూ వర్షం దంచికొట్టింది. కాగా రాత్రి పదిగంటల వరకు మియాపూర్‌లో 5.8 సెం.మీ, తిరుమలగిరిలో 5.6, కూకట్‌పల్లిలో 5, మల్కాజిగిరిలో 4.9, ఉప్పల్‌లో 4, బేగంపేటలో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఇక గ్రేటర్ 'మెట్రో'

విస్తరణతో మారనున్న ముఖచిత్రం

- నలుదిశలా మెట్రో పరుగులు..
- గతంలోనే అధ్యయనం చేసిన లీ అసోసియేషన్
- 2021 నాటికే 200 కిలోమీటర్ల మెట్రో అవసరమని ప్రతిపాదనలు
- రెండో దశలో బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్, ఎల్‌బీనగర్-నాగోల్ విస్తరణ
- ఔటర్ చుట్టూ మెట్రోతో ప్రజారవాణాలో పెనుమార్పులు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో విస్తరణతో గ్రేటర్ హైదరాబాద్ రవాణా ముఖచిత్రం మారనుంది. నగరానికి నలుదిశలా మెట్రో సేవలను అందుబాటులోకి తేవాలని తాజాగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో సుమారు 7,220 చదరపు కిలోమీటర్ల పరిధిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి మెట్రో మణిహారంగా పరుగులు తీయనుంది. ఔటర్‌చుట్టూ మెట్రో, ఎంఎంటీఎస్ వంటి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలోనే ప్రత్యేకంగా కొంత భూమిని కేటాయించారు. దీంతో ఆ మార్గంలో మెట్రో విస్తరణపైన ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. అన్ని వైపులా మెట్రో రైళ్ల అందుబాటులోకి వస్తే ప్రజారవాణా వేగవంతమవుతుందని, ప్రజలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా తేలిగ్గా రాకపోకలు సాగిస్తారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రెండో దశకింద బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో పొడిగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అలాగే రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో నిర్మాణానికి కార్యాచరణ మొదలైంది. మెట్రో మొదటిదశలో మిగిలిపోయిన ఎంజీబీఎస్-ఫలక్‌నుమా రూట్‌లో 5.5 కి.మీ.మార్గానికి లైన్ క్లియర్ అయింది. ఈ లైన్ పూర్తయితే మొదటిదశలో ప్రతిపాదించిన 72 కిలోమీటర్ల మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయి. శంషాబాద్ నుంచి తుక్కుగూడ వరకు విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. అలాగే ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు కూడా మెట్రో విస్తరణపైన ప్రభుత్వం తాజాగా దృష్టి సారించింది. 2021 నాటికే హైదరాబాద్ నగరానికి 200 కిలోమీటర్ల వరకు మెట్రో సేవలు అవసరమని లీ అసోసియేషన్ తేల్చిచెప్పింది. ప్రస్తుతం ఈ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి.

ఇవీ లీ అసోసియేషన్ ప్రతిపాదనలు ...

- హైదరాబాద్ మహానగర రవాణా రంగంపై 2011లోనే సమగ్రమైన అధ్యయనం చేపట్టిన లీ అసోసియేషన్ ప్రభుత్వానికి అందజేసిన నివేదిక ప్రకారం 2041 నాటికి మహానగర జనాభా 2.5 కోట్లు దాటుతుంది. ఈ మేరకు భువనగిరి, సంగారెడ్డి, షాద్‌నగర్ వరకు సుమారు 420 కిలోమీటర్‌ల వరకు మెట్రో సదుపాయం కల్పించవలసి ఉంటుంది.
- మెట్రో నగరాల్లో కనీసం 20 శాతం రోడ్లు అందుబాటులో ఉండాలి. కానీ నగరంలో ప్రస్తుతం 5 శాతం రోడ్లే ఉన్నాయి. కానీ రోడ్లపైన ప్రతి రోజు సుమారు 75 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.
- వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా అంతేవేగవంతమైన రవాణా సేవలకు మెట్రో ఒక్కటే పరిష్కారం. 2011 నాటికే 72 కిలోమీటర్‌ల మేరకు మెట్రో సదుపాయం కల్పించాలని లీ అసోసియేషన్ స్పష్టం చేసింది.

ఎయిర్‌పోర్టు మెట్రోతో ఊరట

రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు రూ.5 వేల కోట్లకు పైగా అంచనాలతో చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వే కార్యాచరణవేగవంతమైంది. టెండర్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం రెండు దిగ్గజ సంస్థలో పోటీలో ఉన్నాయి. వాటిలో ఏదో ఒకటి ఎయిర్‌పోర్టు మెట్రోను దక్కించుకోనుంది. దీంతో ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణ వల్ల కేవలం ప్రయాణికులకే కాకుండా జీవో 111 ప్రాంతాలకు కూడా మెట్రో అందుబాటులోకి వస్తుంది.

ఆ 38 కిలోమీటర్లు ఎంతో కీలకం...

అత్యధిక వాహన సాంద్రత కలిగిన మార్గాల్లో బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్ వరకు ఉన్న మార్గం ఎంతో కీలకమైంది. ఈవైపు నుంచి ఆ వైపు చేరుకోవాలంటే కనీసం 3 గంటల సమయం పడుతుంది. కానీ మెట్రో అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే వాహనాల వినియోగం కూడా చాలావరకు తగ్గుతుంది. మెట్రో రెండోదశపైన ప్రభుత్వం ఇప్పటికే సమగ్రమైన నివేదికను సిద్ధం చేసింది.

నగరం నలువైపులా మెట్రో....

- ఇప్పటికే రెండో దశలో బీహెచ్‌ఈఎల్ నుంచి లకిడికాపూల్ వరకు ప్రతిపాదించిన మార్గాన్ని అటు బీహెచ్‌ఈఎల్ నుంచి పటాన్‌చెరు, ఇస్నాపూర్ వరకు సుమారు 13 కిలోమీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించారు.
- అలాగే ఎల్‌బీనగర్ వరకు ఉన్న మెట్రోను హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్ వరకు మరో 13 కిలోమీటర్లు పొడిగిస్తారు.
- శంషాబాద్ నుంచి కొత్తూరు. షాద్‌నగర్ వరకు మరో 25 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉప్పల్ వరకు ఉన్న మెట్రోను ఘట్కేసర్ , బీబీనగర్ వరకు పొడిగిస్తారు.శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ప్రస్తుతం నిర్మించ తలపెట్టిన మెట్రో కారిడార్‌ను మరో 26 కిలోమీటర్లు పొడిగించి తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు వరకు మెట్రో సదుపాయం కల్పిస్తారు.
- తార్నాక నుంచి ఈసీఐఎల్ వరకు 8 కిలోమీటర్ల ఎలివేటెడ్ మార్గాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టూ 158 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి తూంకుంట, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ, కొంపల్లి, తదితర ప్రాంతాలకు కూడా మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయి. సుమారు రూ.60 వేల కోట్ల అంచనాలతో 400 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణపై కేబినెట్ లో తాజాగా చేసిన ప్రతిపాదనలు హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని సమూలంగా మార్చనున్నాయి.

'ట' మోత @ రూ.200



రికార్డు ధరతో సామాన్యుల బెంబేలు

సాక్షి, సిటీబ్యూరో: టమాట ధర మోత మోగింది. ఏకంగా కిలో రూ.200కు చేరింది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఒక్క టమాటే కాదు.. దాదాపు అన్ని కూరగాయల రేట్లు ఎన్నడూ లేనంతగా మండిపోతున్నాయి. సోమవారం బహిరంగ మార్కెట్లో అన్నిచోట్లా టమాటాలను కిలో 200 రూపాయలకు విక్రయించడంతో వినియోగదారులు బిత్తరపోయారు. బీన్స్ సైతం కిలో రూ.200 ధర పలికింది. ఏ కూరలోకైనా విరివిగా వినియోగించే టమాటా ధరలు ముందెన్నడూ ఈ ధరకు కొనలేదని పలువురు వాపోయారు. ఇక అధిక ధరల కారణంగా టమాటా కొనుగోళ్లు భారీగా పడిపోయాయని మరోవైపు వ్యాపారులు అంటున్నారు. ఎవ్వరూ కూడా పావుకిలోకు మించి కొనడం లేదని చెప్పారు. ఇక పచ్చిమిర్చి కిలో రూ.150, మిగతా కూరగాయలు దాదాపు అన్నీ కిలో రూ.100కు తక్కువగా లేవు. ఇటీవలి వర్షాలు, దిగుమతులు పడిపోవడం కారణంగా నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్లయిన బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, ఎల్‌బీ నగర్, మాదన్నపేట, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లకు కూరగాయల సరఫరా 30 శాతానికి తగ్గింది. కొన్ని రకాల కూరగాయలు మండీల జాబితా నుంచి కనుమరుగయ్యాయంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా టమాటా ధర రికార్డులో నమోదైనట్లు రిటైల్ వ్యాపారులు అంటున్నారు.

ఐటీ కారిడార్‌కు లేడీస్ స్పెషల్ బస్సులు

జేఎన్‌టీయూ నుంచి వేవ్‌రాక్ వరకు ఏర్పాటు

- మొదటి బస్సును ప్రారంభించిన ఆర్టీసీ
- త్వరలో మరిన్ని లేడీస్ స్పెషల్స్



సాక్షి, సిటీబ్యూరో: సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఐటీ సంస్థల్లో వివిధ విభాగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల కోసం ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ లేడీస్ స్పెషల్ బస్సులను ప్రవేశపెట్టింది. జేఎన్‌టీయూ నుంచి వేవ్‌రాక్ వరకు లేడీస్ స్పెషల్ బస్సును ఆర్టీసీ అధికారులు సోమవారం ప్రారంభించారు. దశలవారీగా, ప్రయాణికుల రద్దీకనుగుణంగా మరిన్ని బస్సులను నడుపనున్నట్లు సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖాన్ తెలిపారు. ఈ బస్సు ఉదయం 9 గంటలకు జేఎన్‌టీయూ నుంచి వేవ్‌రాక్‌కు బయలుదేరుతుంది. తిరిగి విధులు ముగిసిన తరువాత సాయంత్రం 5 గంటలకు వేవ్‌రాక్ నుంచి జేఎన్‌టీయూకు లేడీస్ స్పెషల్ బస్సులను నడుపుతారు. ఐటీ సంస్థల్లో పనిచేసే సాంకేతిక ఉద్యోగులే కాకుండా హౌస్‌కీపింగ్ వంటి సర్వీస్ రంగంలో పనిచేసే మహిళలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, మియాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో జేఎన్‌టీయూ వద్ద రద్దీ నెలకొంటుంది. దీంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ లేడీస్ స్పెషల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక బస్సును ఏర్పాటు చేశారు. మొదటి రోజే మహిళా ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చినట్లు అధికారులు తెలిపారు. మహిళా ప్రయాణికుల డిమాండ్ మేరకు మరిన్ని బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐటీ కారిడార్‌లకు ఎలక్ట్రిక్ బస్సులు...

నగరంలోని వివిధ మార్గాల నుంచి ఐటీ కారిడార్‌లకు త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. నగరానికి వచ్చే మొదటి విడత 20 ఎలక్ట్రిక్ బస్సులలో కొన్నింటిని వివిధ మార్గాల నుంచి ఐటీ కేంద్రాలకు నడిపే అవకాశం ఉంది. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వివిధ రూట్‌లలో 40 ఏసీ బస్సులు ఎయిర్‌పోర్టుకు నడుస్తున్నాయి. ప్రతి రోజు 5000 మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఉన్న రూట్‌లలో అదనపు బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది.

వర్క్ ఫ్రమ్ పార్క్



హైటెక్ సిటీలోని పార్క్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

జీహెచ్‌ఎంసీ వినూత్న ఆలోచన

- పచ్చని ప్రకృతిలో ఆహ్లాదంగా పనిచేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు
- ఒంటరిగా, గుంపులుగా పనిచేసుకునే సదుపాయం
- వైఫై, మొబైల్ చార్జింగ్ సౌకర్యాలు సైతం
- హైటెక్ సిటీ ప్రాంతంలో త్వరలో ప్రారంభం







సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ తరుణంలో లభించిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' సదుపాయాన్ని దాదాపుగా అన్ని సంస్థలు ఎత్తివేశాయి. వర్క్‌ఫ్రమ్ హోమ్ ద్వారా కొన్ని ఇబ్బందులు పడ్డవారితో పాటు అది అలవాటయ్యాక ఆఫీసుల కెళ్లాలంటే చిరాకు పడుతున్న వారూ ఉన్నారు. ఎప్పుడూ ఆఫీస్‌లోనే పనిచేయాలన్నా, ఇంట్లో పని చేసుకోవాలనుకున్నా విసుగొస్తోంది అంటున్న వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో అటు ఆఫీస్, ఇటు హోమ్ నుంచి కాకుండా వర్క్ ఫ్రమ్ పార్క్ సదుపాయాన్ని జీహెచ్‌ఎంసీ అందుబాటులోకి తెస్తోంది. కార్యాలయాల పనివేళలు ముగిశాక, మిగిలిపోయిన పనుల్ని ప్రశాంతంగా చేసుకోవాలనుకునే వారిని ఈ పార్కు ఎంతగానో ఆకట్టుకోనుంది. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉండే హైటెక్ సిటీ దగ్గరలోని పత్రికానగర్‌లో ప్రకృతిఒడిలో పచ్చని చెట్ల మధ్య ల్యాప్‌టాప్‌తో పనులు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలు కల్పిస్తోంది. మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారక రామారావు ఆలోచనలకనుగుణంగా నగరంలో వివిధ థీమ్‌పార్కుల ఏర్పాటుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ యూబీడీ విభాగం...ప్రజల అవసరాలు, వారి ఆలోచనల కనుగుణంగా ఆయా ప్రాంతాల్లో పార్కుల్ని ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం పత్రికానగర్‌లో ఐటీ ఉద్యోగులతోపాటు పిల్లలకు ఉపకరించేలా పార్కులో సదుపాయాలు కల్పించింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లోనూ ఈ థీమ్‌తో మరిన్ని థీమ్‌లతో మరిన్ని పార్కులు ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే వివిధ థీమ్ పార్కులు అందుబాటులోకి రావడం తెలిసిందే. ఈ పార్కులో ఒంటరిగా ప్రశాంతంగా ల్యాప్‌టాప్‌తో పనిచేసుకునేలా సదుపాయంతోపాటు దాదాపు 30 మంది కూర్చునేలా , చర్చలు జరుపుకునేలా సైతం సదుపాయాలున్నాయి. పిల్లలకోసం విడిగా ప్లేజోన్లతో పాటు ఓపెన్‌జిమ్, సైన్స్‌కు సంబంధించిన విషయ పరిజ్ఞానం కలిగేలా పరికరాలు, ఐదారు ప్రాంతాల్లో కుర్చీలు, టేబుళ్లు మాత్రమే కాక వైఫై,రెండు మూడు చోట్ల మొబైల్ చార్జింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. సమీపంలోని ఐటీ ఉద్యోగులు తమ పిల్లలతో సహా పార్కుకు వస్తే పిల్లలు ప్లేజోన్‌లో ఆటలాడుకోవడంతోపాటు తల్లిదండ్రులు తమ కంప్యూటర్లలో పనులు చేసుకునేందుకు సదుపాయంగా ఉంటుందని జీహెచ్‌ఎంసీ యూబీడీ విభాగం అడిషనల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మాదాపూర్‌లో ఎన్నో ఐటీ కంపెనీలతోపాటు వాటిల్లో పనిచేసే ఉద్యోగుల హాస్టళ్లు ఉన్నాయి. వారందరికీ ఈ పార్కు సదుపాయంగా ఉండటమే కాకుండా ఔట్‌డోర్‌లో పనులతో కొత్త అనుభూతి నిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎండలు, వానల నుంచి రక్షణ నిచ్చేలా పైకప్పు కలిగిన షెల్టర్లు సైతం ఉన్నాయి. దాదాపు 1.25 ఎకరాల స్థలంలో రూ. 2కోట్ల అంచనావ్యయంతో తీర్చిదిద్దిన 'ఇంటరాక్టివ్ సైన్స్ పార్క్'గా పిలుస్తున్న ఈపార్కులో యోగా చేసుకునేందుకు సైతం సదుపాయాలు కల్పించనున్నారు. ఇన్ని విశేషతలు కలిగిన ఈ పార్కు త్వరలో ప్రారంభం కానుంది.

రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ దివస్

రసూల్‌పురా: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సోమవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్. సిధానా పాల్గొని ప్రసంగించారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ఉద్దేశించి సిధానా మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ విజయాన్ని వివరించారు. సైనికుల త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమర సైనికుల సంస్మరణార్థం థ్యాంక్యూ సందేశాలు, రంగోలి, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజని ప్రియ రాష్ట్రపతి నిలయం విశేషాలను విద్యార్థులకు వివరించారు. పరిపాలన అధికారి హనీఫ్ ఖాన్, రాష్ట్రపతి నిలయం సిబ్బంది, ఐటీబీపీ, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

బుద్వేల్ భూములను పరిశీలించిన మంత్రి కేటీఆర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసహిల్స్ ప్రాంతంలోని బుద్వేల్ ప్రభుత్వ భూములను సోమవారం ఉదయం హెచ్ఎండీఏ అధికారులతో కలిసి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పరిశీలించారు. బుద్వేల్‌లో 250 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. గతంలో ఇందులోని 41 ఎకరాల భూమిని హెచ్ఎండీఏకు అందించారు. హెచ్ఎండీఏ 41 ఎకరాలను 2018లో వేలం వేయగా యూనిటెక్ సంస్థ వేలంలో దక్కించుకుంది. ఈ స్థలంలో సంస్థ మరో సంస్థతో కలిసి భారీ వెంచర్‌ను చేసి ప్లాట్లు చేసి విక్రయించింది. మిగిలిన స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉంది. గతంలో ఈ స్థలాలను టూరిజంతో పాటు శిల్పారామం కోసం కొంత స్థలాన్ని కేటాయించారు. ఇందులోనే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎస్ఎస్ అధికారులకు స్థలాలను ఇచ్చేందుకు సర్వే చేసినప్పటికీ ఎవరికీ మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఈ స్థలం మొత్తం హెచ్ఎండీఏకు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈస్థలాన్ని హెచ్ఎండీఏ ఆధునీకరించి వేలం వేయనున్నట్లు తెలుస్తుంది. ఐటీ కంపెనీలతో పాటు భారీ కంపెనీలకు ఈ స్థలాన్ని కేటాయించేలా 2–10 ఎకరాల చొప్పున ఒక ప్లాటును చేయనున్నట్లు సమాచారం.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా మారుతి ప్రసాద్



హిమాయత్‌నగర్: హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా కార్యంపురి వెంకట మారుతి ప్రసాద్ (కేవీఎం) నియమితులయ్యారు. ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో సిటీ సైబర్ క్రైం నుంచి ఇక్కడకు వచ్చారు. సిటీ సైబర్ క్రైం ఏసీపీగా కేవీఎం ప్రసాద్ మూడు సంవత్సరాల ఏడు నెలల పాటు విధులు నిర్వర్తించారు. తాజా బదిలీల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఆయన సేవలను అందించనున్నారు.

సైబర్ క్రైం ఏసీపీగా శివమారుతి



హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(ఏసీపీ)గా ఆర్.జి.శివ మారుతి నియమితులయ్యారు. కొంతకాలంగా ఆసిఫ్‌నగర్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శివ మారుతి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. శివ మారుతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం వేగవంతం



మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ దానకిశోర్

- గడువులోపు ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేయాలి
- జలమండలి ఎండీ దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం వేగవంతం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఫతేనగర్, ఖాజాకుంట, మియాపూర్ – పటేల్ చెరువు ఎస్టీపీలను సోమవారం సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని సూచించారు. ఇన్ లెట్, అవుట్ లెట్, యంత్రాల బిగింపు, ఎలక్ట్రికల్ తదితర అన్ని పనులు సమాంతరంగా జరపాలని సూచించారు. తద్వారా పనులు త్వరగా పూర్తి చేయవచ్చని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో కార్మికుల రక్షణకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రివేళల్లో పనులు చేయడానికి వీలుగా లైటింగ్ ఏర్పాటు చేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. నివాసాల సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీపీల నుంచి దుర్వాసన రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు, దీనికోసం విదేశీ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

మూడు ప్యాకేజీల్లో 31 ఎస్టీపీలు

మహానగర పరిధిలో రూ.3,866.41 కోట్ల అంచనా వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో కొత్తగా 31 నూతన మురుగు నీటి శుద్ధి కేంద్రాలను (ఎస్టీపీ)ల నిర్మాణాలు చేపట్టినట్లు ఎండీ దానకిశోర్ వెల్లడించారు. నగరంలో దినసరి 1650 మిలియన్ గ్యాలన్ల మురుగు నీరు ఉత్పన్నమవుతోందని, ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేస్తున్నామన్నారు. ఇక మిగిలిన 878 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుభ్రం చేసేందుకు కొత్తగా ఎస్టీపీలు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్యాకేజీ-1 లో అల్వాల్, మల్కాజ్ గిరి, కాప్రా, ఉప్పల్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1230.21 కోట్లతో 8 ఎస్టీపీలను ఏర్పాటు చేసి వీటి ద్వారా 402.50 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

ప్యాకేజీ-2 కింద రాజేంద్రనగర్, ఎల్బీ నగర్ సర్కిల్ ప్రాంతాల్లో రూ.1355.33 కోట్లతో 6 ఎస్టీపీలను ఏర్పాటు చేసి 480.50 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్యాకేజీ-3 కింద కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో రూ.1280.87 కోట్ల వ్యయంతో 17 ఎస్టీపీలను ఏర్పాటు చేసి 376.5 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. 31 ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే.. నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుదన్నారు. వీటి ద్వారా రోజూ 1282 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయవచ్చవచ్చాన్నారు. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఈడీ డాక్టర్ సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూతురిపై లైంగిక దాడి.. తండ్రికి కఠిన కారాగార శిక్ష



కొడేకర్ రాజు

మల్కాజిగిరి: కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన తండ్రికి మల్కాజిగిరి అడిషనల్ స్పెషల్ ఫోక్సో కోర్టు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది.ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన మేరకు.. మౌలాలి లక్ష్మీనగర్‌కు చెందిన కొడేకర్ రాజు(30) కూలి పనిచేసేవాడు. అతని భార్య కుషాయిగూడలో హోటల్ నిర్వహించేది. 2019 మే 21 వ తేదీ హోటల్‌కు వెళ్లి రాత్రి తిరిగి వచ్చే సరికి రెండవ కూతురుపై లైంగికదాడికి పాల్పడుతూ కనిపించాడు. గతంలో కూడా పాల్పడినట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేశారు.సోమవారం విచారణకు రావడంతో కోర్టు ఐదు సంవత్సరాల కఠినకారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించింది.

గుండెపోటుతో ఎంబీఏ విద్యార్థి మృతి



కుషాల్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: హార్ట్ ఎటాక్ తో ఎంబీఏ విద్యార్థి మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు కొత్తపల్లి కుషాల్ ఎంబీఏ చదువుతూ మైసమ్మగూడలోని సాత్విక్ బాయిస్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆదివారం తన స్నేహితుడు సత్యగిరీశ్ ఉంటున్న సాయిమణి బాయిస్ హాస్టల్‌కు వెళ్లి రాత్రి అక్కడే నిద్రపోయాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన కుషాల్ హార్ట్ ఎటాక్‌తో కుప్పకూలాడు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు హాస్టల్‌కు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొరియర్ అని నమ్మించి.. వృద్ధురాలిని బంధించి..



వివరాలు వెల్లడిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తదితరులు, చిత్రంలో నిందితులు, స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

ఇద్దరు పాతనేరస్తుల అరెస్ట్

నాగోలు: కొరియర్ ఉందని చెప్పి ఇంట్లోకి వచ్చిన ఇద్దరు దుండగులు వృద్ధురాలిని బాత్‌రూంలో బంధించి అమె ఇంట్లో ఉన్న బంగారం, నగదుతో దోపిడీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10. 5 తులాల బంగారం, రూ. 50 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపిన మేరకు.. సచివాలయనగర్‌లో వెంకటనర్సమ్మ (84)నివాసం ఉంటోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నేలపూడి సురేష్‌కుమార్(31) మాన్సూరాబాద్ బేతస్థ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మహారాష్ట్ర రాష్ట్రంలోని రాయగడ జిల్లాకు చెందిన పరమిజిత్‌సింగ్ (43) నగరంలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఇద్దరు పాత నేరస్తులు దొంగతనం కేసులో 2016లో జైలుకు వెళ్లివచ్చారు. ఈ క్రమంలో వనస్థలిపురం సచివాలయనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న వెంకటనర్సమ్మను వీరు గమనించారు. గత నెల 26న తేదీ కొరియర్ వచ్చిందని చెప్పి వెంకటనర్సమ్మ ఇంట్లోకి వెళ్లారు. అమెను బెదిరించి బాత్‌రూమ్‌లో బంధించి ఆమె దగ్గర ఉన్న 10 తులాల బంగారం, 50 వేల నగదు తీసుకుని పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఇంజాపూర్ చౌరస్తాలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు హోండా యాక్టివాపై వెళ్తుండగా పోలీసులు వాహనాన్ని ఆపి డాక్యుమెంట్ల గురించి ప్రశ్నించారు. నిందితులు పత్రాలు చూపించకుండా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారం, నగదు, హోండా యాక్టివా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వనస్థలిపురం డబుల్ బెడ్ రూమ్ పార్కింగ్ వద్ద యాక్టివాను చోరీ చేసినట్లు తెలిపారు. పోలీసులు ఇద్దరినీ విచారణ చేయగా గతంలో వీరిపైన వనస్థలిపురం, పటన్‌చెరువు, నాందేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ భీమ్‌రెడ్డి, సీఐ జలేందర్‌రెడ్డి, డిఐ వెంకట్, ఎస్ఐ నర్సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో ఎకరం రూ.65లక్షలంటూ టోకరా

- ఇలా వంద ఎకరాలు అమ్మకం అంటూ మోసం
- ఇతరుల భూమి తనదేనంటూ నమ్మించి రూ.7 కోట్లు చీటింగ్

హిమాయత్‌నగర్ : ఒక్కో ఎకరాన్ని మీకు మాత్రమే రూ.65 లక్షలకు ఇస్తానంటూ ఓ వ్యక్తి భారీ మోసానికి పాల్పడ్డాడు. ఇద్దరి నుంచి తక్కువ రేటుకు భూమి ఇస్తానంటూ, రిజిస్ట్రేషన్ పేరుతో కోట్లాది రూపాయలు లూటీ చేశాడు. అసలు ఆ భూమి సదరు వ్యక్తిది కాదని తేలడంతో తమ డబ్బు తమకి ఇవ్వాలని కోరిన బాధితులను చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో న్యాయం చేయాలంటూ నగరానికి చెందిన అస్లాం బిన్ మహ్మద్, మీర్ హిమాయత్ అలీ అనే ఇద్దరు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా నాగర్‌కుంట గ్రామంలో వంద ఎకరాల భూమిని అమ్మేందుకు బాధితులిద్దరికీ రెండేళ్ల క్రితం నెంటూరి రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ఈ భూమిని కొన్నేళ్ల క్రితం భూయజమానుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పాడు. తక్కువ రేటుకు అంటే ఒక్కో ఎకరం రూ.65 లక్షలకు ఇస్తామని చెప్పడంతో బాధితులిద్దరూ ఆశ పడ్డారు. దీంతో అడ్వాన్స్‌గా రిజిస్ట్రేషన్‌కు ముందే రూ.7కోట్ల 50లక్షలు రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఖాతాలకు బదిలీ చేశారు. రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగనివ్వడం లేదు. భూమిని చూసుకునేందుకు ఆ గ్రామానికి వెళ్లిన బాధితులకు ఈ భూమికి రవీందర్‌రెడ్డికి ఏవిధమైన సంబంధం లేదని తెలిసింది. దీంతో తమ డబ్బు వెనక్కి ఇవ్వాలని కోరగా..బాధితులపై రవీందర్‌రెడ్డి, అతని అనుచరులు బెదిరింపులకు పాల్పడ్డారు. డబ్బు అడిగినా, భూమి వద్దకు వచ్చినా చంపేస్తామంటూ బెదిరించడంతో అస్లాం బిన్ మహ్మద్, మీర్ హిమాయత్ అలీలు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య



పవన్‌సాయి (ఫైల్)

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎస్బీటీ నగర్‌లో నివసించే దండు పవన్ సాయి(24) తన ఇంటి మేడపైన రెయిలింగ్ కోసం ఏర్పాటు చేసిన ఇనుపచువ్వలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి మీనా డాబాపై ఆరేసిన బట్టలు తీసుకొచ్చేందుకు వెళ్లగా ఎదురుగా చువ్వలకు వేలాడుతూ కుమారుడు విగత జీవిగా కనిపించాడు. ఒక్కసారిగా అరుస్తూ కుప్పకూలిన ఆమెను ఆపడం ఎవరితరం కాలేదు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే మృతుడికి సంబంధించి సెల్‌ఫోన్ అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ ఫోన్ ఎక్కడున్నది అన్నదానిపై పోలీసులు గాలిస్తున్నారు.

యువకుడిపై కత్తితో దాడిచేసిన రౌడీషీటర్

బంజారాహిల్స్: తొట్టెల ఊరేగింపు సందర్భంగా జరిగిన గొడవతో ఆగ్రహానికి గురైన ఓ రౌడీషీటర్ తన స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న కోడూరు నవీన్(22) గతంలో పలు నేరాల్లో నిందితుడిగా ఉండడంతో అతడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో రౌడీషీట్ ఉంది. మధురానగర్‌లో నివాసం ఉంటున్న పి.సాయికుమార్ బంధువులు ఇందిరానగర్‌లో ఆదివారం రాత్రి తొట్టెల ఊరేగింపు నిర్వహించడంతో అక్కడకు వచ్చాడు. ఊరేగింపులో భాగంగా సాయికుమార్‌కు, నవీన్‌కు మధ్య గొడవ జరిగింది. స్థానికుల జోక్యంతో కాసేపటికి గొడవ సద్దుమణిగింది. కాగా ఊరేగింపు ముగిసిన తర్వాత రాత్రి ఒంటి గంట సమయంలో రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న సాయికుమార్‌ను వెంబడించిన నవీన్‌కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దాంతో స్థానికులు అతడిని అమీర్‌పేటలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు.

రూ.1.65 కోట్ల పెట్టుబడిని అందించిన 'ఏంజెల్స్'

సాక్షి, సిటీబ్యూరో: మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రారంభించిన 'ఆహా–నేను సూపర్ ఉమెన్' కార్యక్రమం నూతన పెట్టుబడులతో ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండవ వారంలో విభిన్న స్టార్టప్ వెంచర్ల కోసం ఏంజెల్స్ (సుధాకర్ రెడ్డి, రేణుక బొడ్ల, డాక్టర్ సింధూర నారాయణ, రోహిత్ చెన్నమనేని, శ్రీధర్) ఆధ్వర్యంలో 1.65 కోట్ల పెట్టుబడిని అందించారు. ఇందులో భాగంగా ఏఐ, బయోకెమిస్ట్రీకి చెందిన అత్యాధునిక జీవరసాయన పారామీటర్ పరికరాలతో హెల్త్‌కేర్ పరిశ్రమలో విప్లవాత్మకమైన సంస్థగా బయోరాస్ ఫార్మా నిలిచింది. ఈ సంస్థకు మద్దతునందించడానికి డాక్టర్ సింధూర నారాయణ, రోహిత్ చెన్నమనేని కోటి రూపాయల పెట్టుబడిని ప్రకటించారు. ఈ బయోరాస్ ఫార్మాతో దేశంలోని ప్రతి మూలకు సరైన ఆరోగ్య పరీక్షలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని సంస్థ వ్యవస్థాపకురాలు, నగరంలోని సీసీఎంబీ వేదికగా పరిశోధనలు చేసే రచనా త్రిపాఠి పేర్కొన్నారు. ఇదే వేదికగా డాగీ విల్లే వ్యవస్థాపకురాలు అమృత వర్షిణి 25 లక్షలను, టమ్మీ ఫ్రెండ్లీ ఫుడ్స్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి 40 లక్షలను, ఫార్వర్డ్ పార్శిల్ వ్యవస్థాపకురాలు చేతన ప్రియాంక మెంటోర్‌షిప్ అవకాశాన్ని పొందారు.

ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫారం 6, 7, 8 ద్వారా ఓటరు నమోదు, డిలేషన్స్, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, సమ్మర్ రివిజన్‌లో భా గంగా ఆగస్టు 21న డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఉంటుందని, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యేలా నాయకులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, ఎంఐఎం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేసులు ఉన్నవారికి పోటీ చేసే అవకాశం ఇవ్వరాదు



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు


పంజగుట్ట: పోలీసు కేసులు ఉన్నవారు ఎన్నికల్లో నిలబడకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో ప్రజా ప్రతినిధులు అయ్యాక వారిపై కేసులు ఎక్కువ కావడం బాధాకరమని వారు అభిప్రాయపడ్డారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఆధ్వర్యంలో 'ఎన్నికలు – అభ్యర్థుల ఎన్నిక' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎఫ్‌జీజీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి గోపాల్ రెడ్డి, సమాచార శాఖ మాజీ కమీషనర్ దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ .. అసలు మంచి అభ్యర్థి అంటే ఎలా నిర్ధారించాలి అనే విషయాన్ని మనం తెలుసుకోవాలన్నారు. జయప్రకాష్ నారాయణ ఒక పార్టీ ఏర్పాటు చేశారు. మంచి అభ్యర్థులను ప్రజల నుండే ఎన్నుకున్నాడు కాని అతను ఒక్కరే గెలిచారని ఒక్కరే గెలిచినా మార్పు తీసుకురాగలిగారన్నారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ .. ఒక్క ఎమ్మెల్యే పోటీచేయాలంటే కనీసం రూ.40 కోట్లు ఖర్చుచేయాల్సి వస్తోందన్నారు. రాజకీయాల్లో ప్రస్తుతం 30 శాతం మందిమాత్రమే నిజాయతీ పరులు ఉన్నారని వారుకూడా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ ముందుకు వెళుతున్నారన్నారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ .. మనం ధైర్యంగా ఒక అభ్యర్థి దొంగ అని ప్రజల్లోకి తీసుకువెళ్లగలగాలన్నారు. అప్పుడే పార్టీలువారికి టికెట్లు ఇచ్చేందుకు వెనకంజ వేస్తారన్నారు. అన్ని పార్టీలు తాను గెలిచిన తర్వాత పార్టీ మారను అని బాండ్ రాసిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆ బాండ్‌ను ప్రతీ పబ్లిక్ మీటింగ్‌లో చదివి వినిపించాలన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అన్ని పార్టీల అధ్యక్షులకు పంపుతామని ఎఫ్‌జీజీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి తెలిపారు.

ప్రొడక్ట్స్ సర్వీసెస్ పేరుతో చీటింగ్

రూ.కోటి 17లక్షలు ఇవ్వకుండా మోసం చేశారంటూ ఫిర్యాదు

హిమాయత్‌నగర్: కార్లకు సంబంధిచిన ప్రొడక్ట్స్, సర్వీసెస్ తీసుకుని అందుకు చెల్లించాల్సిన డబ్బు విషయంలో మోసానికి పాల్పడ్డ ప్రశాంత్ శాబూ షోరూం, కురా వీరేందర్‌రెడ్డిలపై సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పలు మార్లు ఫేక్ కమిట్‌లు ఇవ్వడమే కాకుండా వారిచ్చిన చెక్కులు సైతం బౌన్స్ అయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బషీర్‌బాగ్, ఫలక్‌నుమా ప్రాంతాలకు చెందిన సయ్యద్ అజీజ్, మరో ముగ్గురు ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ వ్యాపారం చేస్తుంటారు. కొంతకాలంగా వీరు మెట్టుగూడలో ఉన్న 'శాబూ కార్స్ ప్రైవేటు లిమిటెడ్'కు ఇంజన్ ఆయిల్, సీట్ కవర్స్, ఫ్లోర్ మ్యాట్స్, పెయింట్స్, పాలిషెస్, మ్యూజిక్ సిస్టం, యాక్సిసిరిస్, సెక్యూరిటీ సర్వీసెస్‌ను అందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన బిల్ పేమేంట్స్ అన్నీ కూడా 'శాబూ కార్స్ ప్రైవేటు లిమిటెడ్ పార్టనర్ కంపెనీ అయిన 'ప్రశాంత్ శాబూ' కుర వీరెందర్‌రెడ్డిలు వీరికి చెల్లించాల్సిన పేమెంట్ విషయంలో జాప్యం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పలు చెక్కులను సైతం ఇవ్వగా అవి బౌన్స్ కూడా అయ్యాయి. రూ.కోటి 17లక్షల 50వేలుకు ఫేక్ కమిట్‌మెంట్స్ ఇచ్చి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..పార్టనర్ కంపెనీ ప్రశాంత్ శాబూ, కురా రవీందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళా టీచర్ ఆత్మహత్య



మృతురాలు విజయ (ఫైల్)

ఘట్‌కేసర్: ఓ ప్రైవేటు మహిళా టీచర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...నల్లగొండ పట్టణానికి నక్కల అశోక్, భార్య విజయ (36) కుటుంబంతో కలిసి నగరంలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో నివాసముంటున్నారు. విజయ ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ చిట్టీలు నిర్వహిస్తుండేది. కాగా ఈ నెల 29న ఆమె భర్త అశోక్ నల్గొండలోని సొంతింటికి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం విజయ పిల్లలను దుకాణానికి పంపించి తలుపులు మూసివేసి బెడ్‌రూంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పిల్లలొచ్చి పిలిచినా పలకలేదు. దీంతో స్థానికులతో సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే మరణించింది. దీంతో మృతదేహాన్ని స్వస్థలం నల్గొండకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించకుండా అంత్యక్రియలు ఎలా తీసుకొచ్చారని అక్కడి పోలీసులు అభ్యంతరం చెప్పడంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా దుర్గారావు



పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.దుర్గారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లోనే క్రైం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గారావు బదిలీపై ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన హరిశ్చంద్రారెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొందారు. సీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎస్.క్రాంతికుమార్ పంజగుట్ట క్రైం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా బాల్ గోపాల్



ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా వి.బాల్ గోపాల్ బాధ్యతలు చేపట్టారు. లేక్ పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేసిన బాల్ గోపాల్ సోమవారం ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన నిరంజన్‌రెడ్డి బదిలీ కావడంతో బాల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.

చెక్కు అందజేత



కాసాని జ్ఞానేశ్వర్‌కు చెక్కును అందజేస్తున్న టీడీపీ నేత షేక్ ఆరిఫ్

బంజారాహిల్స్: ఇటీవల వర్షాలకు తెలంగాణ ప్రాంతంలో భారీ నష్టం వాటిల్లిందని, ఎంతో మంది నిరాశ్రయులయ్యారని నష్టపోయిన ప్రజల సహాయార్థంగా తనవంతు ఆర్థిక సాయం రూ.1.16లక్షల చెక్కును టీటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గం నేత షేక్ ఆరిఫ్ సోమవారం టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు అందజేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు తాను వరద బాధితులకు సాయం అందించేందుకు ముందుకు వచ్చానని ఆరిఫ్ తెలిపారు. టీడీపీ నేత బాలాజీ గోస్వామి, ఎం.నర్సింహులు, వినిత,. ఆటో సలీమ్, షేక్ సలీం.నాగరాజు పాల్గొన్నారు.

సింగాడికుంటలో కార్పొరేటర్ పర్యటన



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం .10లోని సింగాడికుంట బోరింగ్ గల్లీలో సోమవారం వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించే దిశలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇక్కడ తరచూ సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రంగా ఉంటున్నదని ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయని అలాగే కలుషిత నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ టీమ్‌తో పర్యటించిన ఆమె పేరుకుపోయిన బురదను, వ్యర్థాలను ఎత్తించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్‌నెం:10లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే.. రోడ్ నెం:10లో అపార్ట్‌మెంట్‌ను అనుకుని అక్రమంగా నిర్మాణం చేపట్టడంతో సమాచారం అందుకున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కట్టడాలను కూల్చేశారు. గతంలోనే రెండు సార్లు నోటీసులు అందించినా స్పందించకపోవడంతో కూల్చేశామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్, సెక్షన్ అధికారి విశాల్ తెలిపారు.

ఒకరికి జైలు.. ఇద్దరి డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 31 మంది మందుబాబులను సోమవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ అశోక్‌కు నాలుగు రోజుల జైలుతో పాటు రూ. 3300 జరిమానా విధించారు. అలాగే ఇద్దరు వాహనదారులకు జరిమానాతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. మిగతా 28 మందికి రూ.2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో మొత్తం రూ.68,700 వసూలు చేసినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి పనులకు ఆటంకం

- వర్షాలు తగ్గే వరకు పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ఉన్నతాధికారుల ఆదేశాల తర్వాతే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు
- పలు చోట్ల తవ్వేసిన రోడ్లు.. ఇబ్బందుల్లో స్థానికులు



ఖైరతాబాద్ బడా గణేష్ చౌరస్తాలో నిలిచిన సీసీరోడ్డు, సీవరేజ్ నిర్మాణ పనులు

బంజారాహిల్స్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు అభివృద్ధి పనులకు ఆటంకంగా నిలుస్తున్నాయి. గడిచిన పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు రెండు రోజుల పాటు తగ్గుముఖం పట్టినట్లే పట్టి మళ్లీ మొదలు కావడంతో జీహెచ్ఎంసీ, జలమండలి తలపెట్టిన పనులు ముందుకు సాగడం లేదు. కొద్దిగా తెరిపినిచ్చిన వానతో పనులు మొదలు పెడదామని భావించిన సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి సోమవారం కురిసిన వర్షం మళ్లీ అడ్డంకిగా మారింది. చాలా చోట్ల అభివృద్ధి పనులు అసంపూర్తిగానే ఉండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పనుల కోసం తవ్వేసిన గుంతలు వాహనదారులపాలిట శాపంగా మారుతున్నాయి. పలుచోట్ల రాకపోకలు నిలిపివేశారు. సరిగ్గా రోడ్డు తవ్విన మరుసటి రోజు నుంచే వర్షాలు మొదలు కావడంతో పనులు నిలిచిపోయాయి. ఖైరతాబాద్ బడా గణేష్ చౌరస్తాలో రెండు వైపులా రోడ్డును తవ్వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాజ్ భవన్ రోడ్డులో సెంట్రల్ మీడియన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీ శంకర్ కాలనీ రామాలయం వీధిలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మించేందుకు రోడ్డును పూర్తిగా తవ్వేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీలో సీవరేజ్ లైన్‌తో పాటు సీసీ రోడ్డు వేయాలని తలపెట్టినప్పటికీ వర్షంతో పనులు ముందుకు సాగడం లేదు.



రాజ్‌భవన్ రోడ్డులో నిలిచిన సెంట్రల్ మీడియన్ సుందరీకరణ పనులు



బంజారాహిల్స్ రోడ్ నెం.10 గౌరీ శంకర్ కాలనీలో నిలిచిన సీసీ రోడ్డు పనులు

అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయండి



అధికారులతో సమావేశమైన మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో వివిధ శాఖల ద్వారా చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తమ క్యాంపు కార్యాలయంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్, సర్కిల్–18 డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్, ఎలక్ట్రిసిటీ, టౌన్‌ప్లానింగ్, జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. దోమల నివారణ, పారిశుద్ధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలన్నారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో పేరుకుపోయిన బురద, చెత్త నిల్వలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లు, వీడీసీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మోడ్రన్ ఫంక్షన్ హాళ్లు, శ్మశాన వాటికల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను చేపట్టడం జరిగిందిన ఈ పనులను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. కుక్కల నియంత్రణ, కుక్కకాటు ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో కాలనీ ప్లాంటేషన్ లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు నాలాల పూడికతీత పనులు చేపట్టి వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

స్థానిక సమస్యలపై అధికారులు స్పందించాలి



ఖైరతాబాద్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: స్థానికులు సమస్యలపై అధికారులకు స్పందించకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులపై సీరియస్ అయ్యారు. సోమవారం లక్ష్మీనగర్, జైన్ మందిర్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే దానం అధికారులతో కలిసి పర్యటించారు. ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ రూ.6 కోట్లు కేటాయించారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఎస్టిమేషన్ వేయించామని గ్రావిటి ప్రకారం వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా మరోసారి ఎస్టిమేషన్ వేయగా అది కాస్తా రూ.10 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ మేరకు మరోసారి కేటీఆర్‌కు విషయాన్ని విన్నవించగా రూ.10 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసి, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు స్థానిక నాయకులు మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, ప్రవీణ్, అనిల్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదు



మురుగు నీటి సమస్యను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీలో సోమవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ బస్తీలో రహదారులను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందని, ఇక్కడి ప్రజాప్రతినిధులకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదనిపిస్తుందని దుయ్యబట్టారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎక్కడికక్కడ ఫిలింనగర్ బస్తీల్లో సమస్యలు పేరుకుపోయి స్థానికులు నరకాన్ని చవి చూస్తున్నారని ఆరోపించారు.

మంత్రి తలసానిని కలిసిన జోనల్ కమిషనర్



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్‌కమిషనర్ వెంకటేష్ దోత్రే సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలనే ఆయన జోనల్‌కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జోనల్ కమిషనర్‌గా పనిచేసిన రవి కిరణ్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో వెంకటేష్ నియమితులయ్యారు.

'మణిపూర్ సమస్య శాశ్వత పరిష్కార మార్గాలు' అంశంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఐ.వై.ఆర్.కృష్ణారావు

పంజగుట్ట: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు మత సమస్య కాదని, రెండు తెగల మధ్య సమస్య అని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు అన్నారు. విశ్వ సంవాద కేంద్రం తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం వెంకటరమణా కాలనీలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో 'మణిపూర్ సమస్య శాశ్వత పరిష్కార మార్గాలు'అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐ.వై.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల సమస్య మొదట గుర్తించింది సర్దార్ వల్లభాయ్ పటేల్ అని గుర్తుచేశారు. వీటిని భారత దేశ ప్రధాన భూభాగానికి అనుసంధానం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కాని దురదృష్టవశాత్తూ ఈ దిశగా పూర్తి అడుగులు పడడంలేదన్నారు. జాగృతి పత్రిక సంపాదకులు డాక్టర్ గోప రాజు నారాయణ రావు మాట్లాడుతూ .. మణిపూర్ సమస్యను సమగ్రంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల ఆందోళన



ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులు

వెంగళరావునగర్: ఆయుర్వేద వైద్య విద్యార్థులకు ఇతర రాష్ట్రాల్లో ఏడాదికి రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ఇస్తుంటే తెలంగాణలో మాత్రం కేవలం రూ.23 వేలు మాత్రమే ఇవ్వడం దారుణమని ఆయుర్వేద వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద సోమవారం స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. గతంలో స్టైఫండ్ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే స్టైఫండ్‌ను పెంచాలని లేనిపక్షంలో అన్ని ఆయుర్వేద వైద్య కళాశాలల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య విద్యార్థులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జగన్‌లాల్, డాక్టర్ కార్తికేయ, డాక్టర్ సంధ్య, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

లిబర్టీ: దేశం కోసం ఆత్మబలిదానం చేసిన మహనీయుల స్ఫూర్తితో దేశ ఐక్యతకు భద్రత కోసం ప్రతి పౌరుడు పాటుపడాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. త్యాగధనుల పోరాటయోధుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని పని చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. స్వాతంత్ర సమరయోధులు యుద్ధం సింగ్ వర్ధంతి సభను సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ రాజ్గురు ఉద్ధంసింగ్ ఆజాద్ చంద్రశేఖర్ ప్రాణాలర్పించారని ఆయన గుర్తుచేశారు. ఎంతో మహనీయులు ప్రాణాలు లెక్క చేయకుండా స్వాతంత్రం కోసం ప్రజలను కూడా గట్టి పోరాటం చేశారని అన్నారు. జలియన్వాలాబాగ్‌లో జరనల్ డయ్యర్ వందలాది మందిని బలి తీసుకున్నారని దానికి ప్రతీకగా ఉద్ధంసింగ్ లండన్ వెళ్లి ఆయనను కాల్చి చంపారని గుర్తుచేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశం సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి సీఎం కేసీఆర్ అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ నియోజకవర్గం బీఆర్ఎస్ కంచుకోటగా మారడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు ఎంతో కృషి చేశారని, భవిష్యత్‌లో కూడా ఇది కొనసాగాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ దేదీప్య విజయ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి వేణు, సీనియర్ నాయకులు అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: భారీ వర్షాల కారణంగా వంటసామగ్రితో పాటు సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ఆదర్శ్‌నగర్ బస్తీవాసులకు అండగా నిలవాలని మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బస్తీలో పర్యటించి బాధితులను పరామర్శించారు. నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.20వేల చొప్పున రూ.6 లక్షల నగదును బాధితులకు పంపిణీ చేశారు. ఇక్కడి సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి వెళ్లిందని, ఆయన సూచనలతో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

వేడుకగా తొట్టెల ఊరేగింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బంజారాహిల్స్ సీఐ నరేందర్, ఎస్సై వెంకటేష్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లు, డీజే హోరు మధ్య తొట్టెల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. బస్తీవాసులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తొట్టెల ఊరేగింపులో ఎమ్మెల్యే దానం, బంజారాహిల్స్ సీఐ

అర్ధరాత్రి వరకు హోటల్ నడిపిన వ్యక్తికి జైలు

వెంగళరావునగర్: నిబంధనలకు వ్యతిరేకంగా హోటల్‌ను నిర్వహిస్తున్న వ్యక్తికి నాంపల్లి న్యాయస్థానం 5 రోజులు జైలుశిక్ష విధించింది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న జాకీ బవార్చీ హోటల్ కొంతకాలంగా నిబంధనలకు వ్యతిరేకంగా సమయాన్ని మించి తెరిచే ఉంచుతున్నాడు. ఈ క్రమంలో కొందరు మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. మధురానగర్ పోలీసులు ఈ మేరకు హోటల్ వద్దకు వెళ్లి అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహిస్తున్న మోసిన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. కోర్టుకు హాజరుపరచగా 10వ స్పెషల్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్‌రావు ఐదురోజుల జైలు శిక్ష విధించారు.

జలమండలి సిబ్బంది అందుబాటులో ఉండాలి



జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఉండేందుకు నిరంతరం జలమండలి అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్, మసీదుగడ్డ, రహమత్‌నగర్ చర్చి గల్లీ తదితర ప్రాంతాల్లో ఆమె సోమవారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. పరిసరాల్లోని సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వానలు పడిన సందర్భాల్లో ఇళ్లల్లోకి కూడా నీరు వస్తున్నాయని పలువురు తెలియజేశారు. జలమండలి సిబ్బంది ఎవరూ ఇటువైపు రావడం లేదని పేర్కొన్నారు. స్పందించిన కార్పొరేటర్ ఇకపై ఎప్పుడు ఫోన్లు చేసినా తక్షణమే ఉండాలని అన్నారు. జలమండలి డీజీఎం వాహబ్, మేనేజర్ రమేష్, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజ్, సత్యనారాయణ, కృష్ణ, బాలు, యాదగిరి, షోయబ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: సీ–బ్లాక్ 11కేవీ ఫీడర్ యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద్ద మసీదు, సీ–బ్లాక్ ఏరియా, పోలీసులైన్స్, క్యాంటిన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా పోలీసు లైన్స్ 11 కేవీ ఫీడర్, యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఎమ్మెల్యే కాలనీ, రోడ్–10సి, గాయత్రి హిల్స్, ప్లెజెంట్ వ్యాలీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు. శ్రీకృష్ణానగర్ 11కేవీ ఫీడర్, కల్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. రహమత్‌నగర్, అమర్‌పాయింట్ హోటల్ ఏరియా, పోలీసు ఔట్‌పోస్ట్ ప్రాంతాల్లో, కమాండెంట్ 11 కేవీ ఫీడర్, శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతుల వల్ల పోలీసు లైన్స్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏరియా, గాయత్రీ హిల్స్, మసీదు ఏరియాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.

వాన.. హైరానా..

బంజారాహిల్స్: వానలు తగ్గుముఖం పట్టాయని అందురూ అనుకుంటుండగానే సోమవారం సాయంత్రం ఒక్కసారిగా దంచికొట్టిన వానతో రోడ్లన్నీ జలమయం కావడంతో పాటు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాలతో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు రోడ్డులో పెద్ద ఎత్తున వాన నీరు నిలవడంతో సహాయక బృందాలు మోటార్ల సాయంతో నీటిని తోడేశారు. శ్రీకృష్ణానగర్‌లో మోకాళ్లలోతు నీళ్లు రావడంతో అక్కడ ఉన్న వీధులన్నీ నీటమునిగాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



శ్రీకృష్ణానగర్‌లో..



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో..



కేబీఆర్ పార్కు వద్ద..

నేటి నుంచి శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల: శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు గాను మంగళవారం నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేస్తున్నారు. నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. పుష్కరిణి మరమ్మతుల కోసం మొదటి పది రోజుల పాటు నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పది రోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తి చేస్తారు. చివరి పది రోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పీహెచ్ విలువ ఏడు ఉండేలా చూస్తారు. టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో టీటీడీ షవర్లు ఏర్పాటు చేసింది.

వరద బాధితులపై సర్కార్ నిర్లక్ష్యం

కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సంజీవరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు నష్టపోయి అల్లాడుతుంటే వారిని ఆదుకోకుండా కేసీఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 900 కోట్లకుపైగా ఉన్న జాతీయ విపత్తు నిధులతో బాధితులకు తాత్కాలిక సాయం కూడా అందించలేకపోయిందని ధ్వజమెత్తారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు సర్కార్ నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డితోపాటు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల, జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు సంజీవ్‌రావు (చెన్నూరు), అమురాజుల శ్రీదేవి (బెల్లంపల్లి) ఆమె భర్త, బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లూ గెలుస్తామని, మరో 10 మంది సీనియర్ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు.

సోయం వివరణ కోరతాం...

'ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గిరిజన రిజర్వేషన్లపై చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగతం. ఈ ప్రకటనతో పార్టీకి సంబంధం లేదు. దీనిపై ఆయన వివరణ తీసుకుంటాం. గిరిజన రిజర్వేషన్ల కోసం పోరాటంలో బీజేపీ ముందుంటుంది. అధికారంలోకి రాగానే లంబాడాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుంది. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గిరిజనులకు అన్యాయం జరిగింది. జనాభా ప్రాతిపదికన ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్
- సీజేతో కలిపి 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న సీజే జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా జస్టిస్ కళాసికం సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఫస్ట్ కోర్టు హాల్లో ఉదయం 9.45 గంటలకు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సుజన, లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్‌లను అదనపు జడ్జీలుగా నియమిస్తూ రాష్ట్రపతి గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరి నియామకంతో హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ఇంకా శాశ్వత, అదనపు న్యాయమూర్తులు కలిపి 12 ఖాళీలున్నాయి. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కొత్త న్యాయమూర్తులు కేసుల విచారణలో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సోమవారం సాయంత్రం తెలంగాణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త న్యాయమూర్తులు జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్ కుమార్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ..'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రంపై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

- పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మరోసారి వెలుగులోకి
- ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అప్పులపై టీడీపీతో పాటు దాని అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో మరోసారి తేలిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అప్పులు రూ.1,77,991 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేశారు. 2019 నాటికి ఏపీకి రూ.2,64,451 కోట్లు అప్పులుండగా 2023 మార్చి నాటికి రూ.4,42, 442 కోట్లకు చేరినట్లు తెలిపారు. ''ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అసెస్ చేస్తోందా? 2019 మే నుంచి ఏపీ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసింది? ఆర్థిక పరిస్థితిని అంచనా వేశారా?..'' అంటూ నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధనల మేరకు వ్యవహ రిస్తోందని తేల్చి చెప్పారు. ద్రవ్యలోటు తగ్గింపు, వివేకంతో కూడిన రుణ నిర్వహణ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకతను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎఫ్‌ఆర్‌బీఎంను అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడే ఏపీ అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను, ఆర్థిక పరిమితులను అమలు చేస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన వ్యయ విభాగం పరిశీలన చేస్తూ ఉంటుందని వివరించారు.

కాకి లెక్కలతో పరిపాటిగా..

టీడీపీ దుష్ప్రచారానికి నిత్యం వంత పాడుతున్న ఎల్లో మీడియా అప్పులపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి తేటతెల్లమైంది. ఒకసారి రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో కథలు అల్లటం ఎల్లో మీడియాకు రివాజుగా మారింది. ఈ విష ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నా రహస్యంగా అప్పులను దాచారనే విధంగా ఎల్లో మీడియా అవాస్తవాలను వండి వారుస్తోంది. పరిమితులకు లోబడే అప్పులు తీసుకుంటున్నామని, టీడీపీ హయాంతో పోలిస్తే పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలు స్పష్టం చేసింది. తీసుకున్న అప్పులను సామాజిక హితం కోణంలోనే ఖర్చు చేస్తోంది. భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కోవిడ్ సమయంలోనూ డీబీటీతో పేదలను ఆదుకోవడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా చర్యలు తీసుకుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఇవన్నీ ముమ్మాటికీ నిజమని రుజువైంది. ఈ గణాంకాలను ఆర్బీఐ నివేదిక ప్రకారం వెల్లడిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పాఠకులకు తప్పుడు సమాచారాన్ని చేరవేయకుండా విశ్వసనీయతతో జర్నలిజం విలువలను పాటించాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఆ 3 పార్టీలూ ఒక్కటే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల డీఎన్‌ఏ ఒక్కటే
- అందుకే ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయి
- కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటే. ఈ మూడు కుటుంబ పార్టీలే. వాటి డీఎన్‌ఏ కూడా ఒకటే. అందుకే ఆ మూడు పార్టీలు యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి)ను వ్యతిరేకిస్తున్నాయి. ముస్లిం మహిళలకు హక్కులు వద్దంటున్నాయి..'అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఈ మూడు పార్టీలు ఒకే గూటి పక్షులు. గతంలో పొత్తు పెట్టుకున్నాయి. ఇందులో ఎవరికి ఓటేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్లే..'అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఉద్దేశపూర్వకంగా బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఏ పార్టీతో కలవలేదని, భవిష్యత్తులో కూడా కలవబోదని చెప్పారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌దని, గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని చెప్పారు.

ఇప్పటికీ వైఎస్ హయాంలోని రేషన్ కార్డులే..

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన రేషన్‌కార్డులే తప్ప.. తెలంగాణలో కొత్తవి రాలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డులివ్వాలనే సోయి కేసీఆర్ సర్కారుకు లేదని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి.. వెన్నుపోటు పొడిచారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాల్లో నిప్పులు పోశారని, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, దళితబంధు స్కీంను అమ్ముకుంటున్నారని, బీసీ బంధు పేరిట ఆ వర్గాలను మభ్యపెడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.

బీఆర్‌ఎస్ ఆట కట్టించాలి..

దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో నాలుగు కోట్లకు పైగా ఇళ్లు కట్టించామని, తెలంగాణలోనూ ఇళ్లు కట్టించాలని కోరినా ఇక్కడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు లేవు కానీ.. ప్రజాధనం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ముఖ్యమంత్రి రాజభవనాన్ని కట్టుకున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా లిక్కర్ తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణను దోచుకుంటున్న బీఆర్‌ఎస్ ఆట కట్టించాల్సిన అవసరముందని అన్నారు.

నియంత పాలనను అంతమొందిస్తాం: డీకే అరుణ

తెలంగాణలో నియంతపాలన అంతమయ్యే దాకా బీజేపీ నిద్రపోదని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చే వరకూ వదలబోమని, కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వకుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక తామే ఇస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగర వార్తలు

మహిళలు, పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డీఎం బ్రజేశ్ కుమార్ జైన్

- నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు
- రైల్వేస్టేషన్‌లో అలరించిన కళా ప్రదర్శనలు



రైల్వేస్టేషన్‌లో కళాబృందాల ప్రదర్శనలు తిలకిస్తున్న డివిజనల్ మేనేజర్ బ్రజేశ్‌కుమార్‌జైన్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత బెనర్జీ, ఇతర అధికారులు

సికింద్రాబాద్: మహిళలు, పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ బ్రజేశ్‌కుమార్‌జైన్ అన్నారు. బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సోమవారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే రక్షణదళం, ఎన్‌జీఓ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను బ్రజేశ్‌కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రయాణాల్లో బాలల అక్రమ రవాణా, మహిళలకు ఎదురవుతున్న ఇబ్బందులు, వేధింపులు, శిశువుల అపహరణ వంటి నేరాలను పూర్తిగా నియంత్రించడం కోసం ప్రయాణికుల సహకారం అవసరమని అన్నారు. ఇందుకోసం ప్రయాణికులు అప్రమత్తంగా ఉండే పద్ధతులు, నేరగాళ్ల సంచరించే తీరు గురించి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ 10వ నెంబర్‌లో పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఆర్పీఎఫ్ డివిజనల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత బెనర్జీ మాట్లాడుతూ డివిజనల్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రయాణికులకు అవగాహన కలిగిస్తామన్నారు. ఇందుకోసం 12 కళా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైలు ప్రయాణాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం లేదా బాలల రవాణా, మహిళల వేధింపులు గమనించే ప్రయాణికులు 139 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే అదనపు మేనేజర్లు బీఎస్ రాథోడ్, రాజీవ్‌కుమార్ గంగేల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హజ్ యాత్ర

- నగరానికి చేరుకున్న 7040 మంది యాత్రికులు
- క్యాంప్ విజయవంతం.. కృతజ్ఞతలు తెలిపిన హజ్ కమిటీ

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర- 2023 సోమవారంతో ముగిసింది. హైదరాబాద్ నాంపల్లి హజ్ క్యాంప్ నుంచి వెళ్లిన మొత్తం 7040 మంది యాత్రికులు నగరానికి క్షేమంగా చేరుకున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా తెలిపారు. సోమవారం హజ్ యాత్రికుల తిరుగు ప్రయాణం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూన్ 7 నుంచి 22వ తేదీ వరకు 46 విమానాల్లో 7040 మంది యాత్రకు వెళ్లారని అందరూ తిరిగి వచ్చారని వివరించారు. రాష్ట్రం నుంచి 5,583 మంది వెళ్లగా 8 రాష్ట్రాలకు చెందిన 1457 మంది తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ నుంచి వెళ్లినట్లు చెప్పారు. వెళ్లిన వారందరు నగరానికి చేరుకోగా 5 మంది యాత్రికులు మృతి చెందినట్లు తెలిపారు. హజ్ క్యాంప్, హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి అవడానికి సహకారం అందించిన జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్తు, రవాణ, అగ్నిమాపక, పోలీసు శాఖలతో పాటు జీయంఆర్, కస్టమ్స్, ఇమిగ్రేషన్, ఎయిర్‌లైన్స్ తదితర శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అశ్వత్‌కు ఐదు పతకాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిల్లా స్విమ్మర్ అశ్వత్ అయ్యల సోమయాజుల మెరిశాడు. ఈ పోటీల్లో 11 ఏళ్ల అశ్వత్ మూడు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలతో కలిపి మొత్తం ఐదు పతకాలు సాధించాడు. 200 మీటర్ల ఫ్రీస్టయిల్ (2ని:31 సెకన్లు), 100 మీటర్ల బటర్‌ఫ్లయ్ (1ని:23.88 సెకన్లు), 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ (34.77 సెకన్లు) ఈవెంట్స్‌లో అశ్వత్ పసిడి పతకాలు గెలిచాడు. 100 మీటర్లు, 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్స్‌లో అశ్వత్ రజత పతకాలు సొంతం చేసుకున్నాడు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థి అయిన అశ్వత్ గచ్చిబౌలి స్టేడియంలో కోచ్ ఆయుష్ యాదవ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

శ్రీనిధి యూనివర్సిటీ ఎదుట ఆందోళన

- అద్దాలు ధ్వంసం
- గుర్తింపులేని యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. శ్రీనిధి యూనివర్సిటీకి గుర్తింపు లేకున్నా కొనసాగిస్తున్న యాజమాన్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూనివర్సిటీ భవనం అద్దాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గుర్తింపు విషయంలో యూనివర్సిటీ నిర్వాహకులను పలుమార్లు నిలదీశామని చెప్పారు. ప్రతిసారీ ఏదో ఒక సాకు చెబుతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించి తమ పిల్లల భవిష్యత్తుపై ఖచ్చితమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామన్నారు. దీంతో సంస్థ అధినేత మహిజూమ్‌లో మాట్లాడారు. మూడు రకాల ఆప్షన్స్‌తో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు యూనివర్సిటీ ఓ ప్రొఫార్మాను రూపొందించింది.



ధ్వంసమైన శ్రీనిధి యూనివర్సిటీ భవనం అద్దాలు



యూనివర్సిటీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

జీవితాన్ని అనుభవించి రాసిందే కవిత్వం



సాక్షి, సిటీబ్యూరో : జీవితాన్ని అనుభవించి రాసిందే కవిత్వం అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ప్రముఖ రచయిత యాకూబ్ రచనలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తాయన్నారు. యాకుబ్ రాసిన 'మనుషుల్లారా మనుషులు' కవితా సంకలనాన్ని సోమవారం తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో వేసే ప్రతి అడుగును ఒక సవాలుగా చేసుకుని తనను తాను జయించుకుంటూ దీనులను, హీనులను, మూగజీవాలుగా పడివున్న మనుషులను పట్టించుకోండని యాకూబ్ తన కవిత్వం ద్వారా గొంతెత్తి అరుస్తున్నాడని చెప్పారు. మతాలన్నవి మనకొద్దని మానవత్వమే మనుషులకు హద్దు కావాలని యాకూబ్ తపించాడన్నారు. స్పష్టతలేని ప్రతి కోణము చీకటితో సమానమేనన్నారు. ఈ పుస్తకావిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, దాశరథి అవార్డు గ్రహీత రామోజు హరగోపాల్, సీనియర్ పాత్రికేయుడు గంధం బంగారు, కవి యాకూబ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన మలేషియా బృందం



మలేషియా బృందంతో వీసీ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ తదితరులు

రాయదుర్గం: మలేషియా దేశంలోని మోనాష్ విశ్వవిద్యాలయం బృందం సోమవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని సందర్శించింది. మోనాష్ విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ ఆపరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మాథ్యూనికల్సన్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ అండ్ స్ట్రాటజీ, ఎంగేజ్‌మెంట్ అండ్ ఇంపాక్ట్ స్కూల్ డిప్యూటీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర అవ్వారి వి మోహన్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం హెచ్‌సీయూను సందర్శించింది. వారు మొదట హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, వివిధ స్కూల్స్ డీన్స్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇతర హెచ్‌సీయూ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ అకడమిక్, రీసెర్చ్ సంబంధిత కార్య కలాపాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోనాష్ విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ ఆపరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మాథ్యూనికల్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో మోనాష్ యూనివర్శిటీ 45వ ర్యాంకింగ్‌లో ఉందని వివరించారు. బలమైన పరిశోధన, భాగస్వామ్యంతో రెండు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ఎస్పైర్ బయోనెస్ట్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సదుపాయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన స్టార్టప్‌లు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఫస్ట్ ఎయిడ్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలి

స్వాతి లక్రా



సీపీఆర్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న స్వాతి లక్రా, ఇతర అధికారులు

వెంగళరావునగర్: ప్రతి ఒక్కరూ ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కలిగి ఉండాలని టీఎస్‌ఎస్‌పీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్‌ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వాతి లక్రా మాట్లాడుతూ వృత్తిరీత్యా టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది అనేక పనులు చేస్తుంటామని, అయితే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో, ఎలాంటి ప్రమాదాలు కనబడతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయని అలాంటి సమయంలో తక్షణమే స్పందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందువల్ల సీపీఆర్ టెక్నిక్స్‌ను తెలుసుకుని ఉంటే ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. కాగా ఉస్మానియా మెడికల్ కళాశాల విద్యార్థులు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ, ఛాతీ ఆసుపత్రి సిటీ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ అనితా భల్లా, టీఎస్‌ఎస్‌పీ అడిషనల్ కమాండెంట్ కె.వీరయ్య, అసిస్టెంట్ కమాండెంట్స్ రామదాసు, సత్యనారాయణ, రంగారెడ్డి, జవహర్‌లాల్, నర్సింహరాజు, సీఏఓ జగపతిరాజు, ఆర్‌ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్‌ఎస్‌ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొ.లింబాద్రికి వీడ్కోలు



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రికి ఓయూలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్ట్స్ కాలేజీ పబ్లిక్ అడ్మిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులుగా ప్రొ.లింబాద్రి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు పరిశోధన విద్యార్థులు ప్రొ.లింబాద్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లింబాద్రి ఓయూతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.

'సేవ అనేది మన ఇంటి నుంచే మొదలు కావాలి' అని బలంగా నమ్మే సీమా సింగ్ విద్య నుంచి వైద్యం వరకు ఎన్నో రంగాలలో ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేస్తోంది. సీమ స్ఫూర్తితో ఆమె ఇద్దరు పిల్లలు కూడా సేవా పథంలో పయనిస్తున్నారు. 'సర్వైకల్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా' ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన 'మేఘా శ్రేయ్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సీమాసింగ్ తాజాగా 'చాంపియన్ ఆఫ్ చేంజ్' పురస్కారాన్ని స్వీకరించింది...



ఓ పండు కన్నతల్లిని కాపాడింది... కన్న బిడ్డను రక్షించింది.
ఒక బిడ్డగా ఒక తల్లిగా ఎదురైన అనుభవాలు...
ఆమె జీవితాన్ని కొత్త మలుపు తిప్పాయి.
కంప్యూటర్స్ నుంచి పంటపొలానికి దారి మళ్లించాయి.
పంట పొలం నుంచి పరిశ్రమ దిశగా నడిపించాయి.

● చికోటి కీర్తి

ఒక కష్టం
దశ... దిశను మార్చింది!!

'ఎన్ఆర్ఐలు ఇండియాలో వెయ్యి రూపాయలు చాలా సులువుగా ఖర్చు చేయగలుగుతారు. తిరిగి తాము పనిచేసే దేశాల్లో అంత డబ్బును సులువుగా సంపాదించుకోవచ్చనే ధీమా అది. అదే ఎన్ఆర్ఐలు ఇండియాలో వెయ్యి రూపాయలు సంపాదించడం చాలా కష్టం' అన్నారు చికోటి కీర్తి. జీవితం నేర్పించిన పాఠాలనుంచి ఆమె తెలుసుకున్న జ్ఞానం అది. 'నా జీవితమే నన్ను నడిపించింది. హైదరాబాద్‌లో కంప్యూటర్ సెంటర్ నిర్వహించి, పెళ్లితో నైజీరియా వెళ్లాను. ముగ్గురు పిల్లల తల్లిగా ఇండియాకి వచ్చి నా సవాళ్లకు జవాబుల కోసం అన్వేషణ మొదలు పెట్టాను. సంజీవనిలాంటి పరిష్కారం దొరికింది. తొగరు పండు నన్ను పారిశ్రామికవేత్తగా మార్చింది' అని క్లుప్తంగా వివరించారు కీర్తి. విజయవంతమైన కీర్తి ప్రయోగాల జీవితం ఇలా సాగింది.

బాబు తక్కువ బరువుతో పుట్టాడు

''నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. బీఎస్సీ కంప్యూటర్స్ చేసి లిబర్టీ సెంటర్‌లో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించాను. నాన్న నైజీరియాలో మెకానికల్ ఇంజనీర్, అమ్మ మా కోసం గాంధీ హాస్పిటల్‌లో గవర్నమెంట్ ఉద్యోగం మానేసింది. మూడు నెలలకోసారి ఎవరో ఒకరు ఇండియా– నైజీరియాల మధ్య ప్రయాణించే వాళ్లం. పెళ్లి కూడా అక్కడ ఉద్యోగం చేస్తున్న ఇక్కడి అబ్బాయితో కుదరడం యాదృచ్ఛికమే. నా పిల్లలు ఇండియాలోనే పుట్టాలనే ఆకాంక్ష కొద్దీ మూడు డెలివరీలకూ ఇండియాలోనే ప్లాన్ చేసుకున్నాను. రెండవసారి గర్భిణిగా ఉన్న సమయంలో సరిగ్గా ఏడవ నెలలో అమ్మ ఆరోగ్యం మా కుటుంబాన్ని కుదిపేసింది. అక్కడ (నైజీరియా) మలేరియా సర్వసాధారణం. అమ్మకు మలేరియా మెదడుకు సోకడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. అక్కడ అన్నిరకాల వైద్యం అందించిన తర్వాత ఇండియాకి తీసుకువచ్చి డాక్టర్ సూచనతో నోని ఫ్రూట్ (తొగరు పండు) జ్యూస్ పట్టించాం. ఆమె రికవరీ స్పీడ్ మాకే ఆశ్చర్యం కలిగించింది. నా డెలివరీ టైముకు పూర్తిగా కోలుకుని అంతా తనే చూసుకుంది. నాకది మిరకిల్. అయితే ఆ మిరకిల్ నా తదుపరి జీవితానికి ఒక సంకేతమని ఆ తర్వాత తెలిసింది. నాకు బాబు డౌన్ సిండ్రోమ్‌తో పుట్టాడు. బరువు ఒకటిరన్నర కిలోలు. మేము ఏ మాత్రం ఊహించని పరిణామం అది. నాలుగు నెలలు నిండినా బరువు గ్రాము కూడా పెరగలేదు. డాక్టర్‌లు ఏ భరోసా ఇవ్వలేకపోయారు.

అప్పుడు అమ్మ తనను కాపాడిన నోని జ్యూస్ బాబు ఆరోగ్యాన్ని కూడా బాగు చేస్తుందేమో చూద్దామన్నది. దేవుడి మీద భారం వేసి పట్టించాం. నెల రోజుల్లో ఏడు వందల గ్రాములు పెరిగాడు. అప్పటి నుంచి నోని మీద రీసెర్చ్ మొదలు పెట్టాను.

కంపెనీ మాట మార్చింది

మార్కెట్‌లో ఉన్న నోని ఫ్రూట్ జ్యూస్ కంపెనీలను సంప్రదించాను. ఇదీ అదీ అనే తేడా లేకుండా అందుబాటులో ఉన్న సమాచారాన్నంతటినీ సేకరించి అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. అదే సమయంలో అమ్మ ఆరోగ్య దృష్ట్యా నాన్న బయటి దేశాల్లో ఉండడానికి ఇష్టపడక ఉద్యోగం మానేసి ఇండియాకి వచ్చేశారు. ఆయన తనకంటూ వ్యాపకం కోసం వ్యవసాయం చేయాలనుకున్నారు. అలా పదెకరాల పొలం కొని తొగరు చెట్లను పెంచాం. ఓ కంపెనీ ఇచ్చిన భరోసాతో పంటను యాభై ఎకరాలకు విస్తరించాం. అయితే పంట పెద్ద మొత్తంలో వచ్చే సమయానికి కంపెనీ మాకిచ్చే ధర తగ్గించింది. ఖర్చులు కూడా రానంత తక్కువ ధరకు అమ్మడంకంటే ఈ పండ్లతో మనమే పరిశ్రమ స్థాపిద్దామనే ఆలోచన వచ్చింది. అప్పటి వరకు మా కుటుంబ అవసరాలకు తగినట్లు తయారు చేస్తున్న జ్యూస్, లోషన్, షాంపూ, హెయిర్ ఆయిల్ వంటి మొత్తం పాతిక రకాల ఉత్పత్తులను పెద్ద మొత్తంలో తయారు చేసి 'చెక్ బయో ఆర్గానిక్స్' పేరుతో మార్కెట్‌లోకి వచ్చాం. మా పొలంలో పండించి తయారు చేయడం వల్ల క్వాలిటీ విషయంలో మోసపోవడం, రాజీ పడడం రెండూ ఉండవు.

మా అమ్మను, నా బిడ్డను కాపాడిన ఈ పండులోని ఔషధగుణాలను ప్రపంచానికి తెలియ చేయాలనే సంకల్పంతో సంజీవని వంటి ఈ పండును ఎన్ని రకాలుగా అందించవచ్చనే పరిశోధనలు చేస్తున్నాను. ప్రభుత్వ అనుమతుల ప్రకారం సర్టిఫికేట్‌లతోపాటు నాచురల్ హెల్త్ సైన్స్ అసోసియేషన్ అవార్డు, ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్ పురస్కారం అందుకున్నాను'' అని తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన వైనాన్ని వివరించారామె. 'పరిశ్రమ స్థాపించిన ప్రతి మహిళ వెనుక ఒక కథ ఉంటుంది. అందుకు నేనే ప్రత్యక్ష ఉదాహరణ' అన్నారు కీర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

సంజీవని పండుతో పరిశోధన

తొగరు చెట్లు చలిని తట్టుకోలేవు. పాశ్చాత్య దేశాల్లో ఈ పండు మీద పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ ఈ పంట అక్కడ పండదు. కాబట్టి ఎన్నో ఔషధ గుణాలున్న సంజీవని వంటి ఈ పండుకు ప్రచారం కూడా పెద్దగా లభించలేదు. ఈ పండు నేరుగా మన దేహంలోని కణాల మీద పనిచేస్తుంది. అనేక రోగాలను నయం చేస్తుంది. కణాల శక్తిని పెంచి, దేహాన్ని వ్యర్థరహితం, విషరహితం చేస్తుంది. క్యాన్సర్ పేషెంట్‌లకు కూడా మంచి గుణాన్నిస్తుంది.



అనారోగ్యాలు వచ్చిన తర్వాత స్వస్థత కోసం వాడడమే కాదు. మామూలు వాళ్లు కూడా రోజుకు 30 మిల్లీలీటర్ల రసం తాగితే సమగ్రమైన ఆరోగ్యం చేకూరుతుంది. రసాయన రహితంగా తయారు చేస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికేట్ వచ్చింది. ఆయుష్ అనుమతి కోసం అప్లయ్ చేశాను.

– చికోటి కీర్తి
ఫౌండర్, చెక్ బయో ఆర్గానిక్స్

సేవాపథం



సీమాసింగ్
చాంపియన్ ఆఫ్ చేంజ్

'సేవలో ఉండే గొప్పతనం ఏమిటంటే అది మన శక్తిని మనకు పరిచయం చేస్తుంది. నువ్వు ఇంకా చేయగలవు అని ముందుకు నడిపిస్తుంది' అంటుంది ముంబైకి చెందిన సీమా సింగ్.

కష్టాల్లో ఉన్న డ్రైవర్ కుమారుడి చదువుకు సహాయం చేయడం ద్వారా ఆమె సేవాప్రస్థానం మొదలైంది. అది తనకు ఎంతో తృప్తిని, సంతోషాన్ని ఇచ్చిన సందర్భం. సీమ ఆర్థిక సహాయం చేసిన పిల్లాడు సీఏ విజయవంతంగా పూర్తి చేశాడు.

గృహిణిగా ఉన్న సీమ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి ఈ సందర్భమే పునాది. తన కలలను సాకారం చేసుకోవడానికి 'మేఘా శ్రేయ్' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ద్వారా పిల్లల చదువు, స్త్రీ సాధికారత నుంచి అన్నదానం వరకు ఎన్నో సేవాకార్యక్రమాలు చేయడం మొదలు పెట్టింది.

కోవిడ్ సమయంలో ముంబైవాసుల కోసం వాక్సినేషన్ డ్రైవ్‌ను నిర్వహించింది. పేదల అవసరాలను తీర్చింది.

''లాక్‌డౌన్ సమయంలో ఒక స్వీపర్‌కు భోజనం, మాస్క్, శానిటైజర్ అందించాను. అవి తీసుకున్న అతడు... 'థ్యాంక్స్ అమ్మా' అన్నాడు. ఈ రెండు మాటలు నాకు ఎంతో శక్తిని ఇచ్చాయి. వెంటనే శానిటైజేషన్ కిట్స్‌కు ఆర్డరు ఇచ్చాను. ఒక కిచెన్ సర్వీస్ ద్వారా వాటిని పేదలకు పంపిణీ చేశాను. బయటికి వెళ్లడం వల్ల నాకు ఏమైనా అవుతుందేమో అని మావారు భయపడేవారు. అయితే జాగ్రత్తల విషయంలో నేను ఎప్పుడూ రాజీపడలేదు. రెండు రోజుల తరువాత నా పిల్లలు అమ్మా నీతో పాటు మేమూ వస్తాం అన్నారు. ఇంతకంటే సంతోషకరమైన విషయం ఏముంటుంది'' అని గతాన్ని గుర్తు చేసుకుంది సీమ.

కోవిడ్ సమయంలో సీమ మామయ్యకు ఒంట్లో బాగలేకపోతే హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఆ సమయంలోనే సీనియర్ సిటిజెన్‌ల ప్రస్తావన తీసుకువచ్చింది ఆమె కూతురు మేఘన. తల్లీ కూతుళ్లు వృద్ధాశ్రమాలకు వెళ్లి అవసరమైన మందులు ఇవ్వడమే కాదు... వారికి ధైర్యం కూడా చెప్పేవారు.

పట్టణం– పల్లె తేడా లేకుండా 'సర్వైకల్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా' క్యాంపెయిన్‌ను ఎన్నోచోట్లకు తీసుకువెళ్లి అవగాహన సదస్సులు, ఉచిత స్క్రీనింగ్‌లు నిర్వహించింది సీమ.

తన ఇద్దరు పిల్లలు డా.మేఘన, శ్రేయ్ శ్రీ పేర్లను కలుపుతూ స్వచ్ఛందసంస్థకు 'మేఘాశ్రేయ్' అని నామకరణం చేసింది సీమ. ఇప్పుడు వారు కూడా సంస్థ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమె కుమారుడు శ్రేయ్ తన 14వ పుట్టిన రోజు సందర్భంగా ఆడంబరాల జోలికి పోకుండా పుట్టినరోజు వేడుకకు అయ్యే ఖర్చుతో 150 మంది పేదవాళ్లకు అవసరమయ్యే వస్తువులను కొనిచ్చాడు. ఇక మేఘనకు తన పుట్టిన రోజును అనాథాశ్రమాలలో జరుపుకోవడం అలవాటు. 'సమాజంపై సానుకూల మార్పు' అనే అంశానికి సంబంధించి సీమాసింగ్ లోతైన ఆలోచనలు చేస్తుంటుంది. అయితే అవి మనసుకు మాత్రమే పరిమితమయ్యే ఆలోచనలు కావు. ఆచరణకు ప్రేరేపించే అద్భుత ఆలోచనలు. ఒక మహిళా కానిస్టేబుల్... 'అమ్మా మీతో ఫొటో దిగుతాను' అని సీమాసింగ్‌ను అభ్యర్థించింది. 'నేను సినిమా స్టార్‌ని కాదు కదా!' అని చిన్నగా నవ్వింది సీమ.

'మంచి పనులు చేసే ప్రతి ఒక్కరూ స్టారే. మీ గురించి మా అమ్మాయికి చెప్పాలనుకుంటున్నాను' అన్నది ఆ కానిస్టేబుల్. మంచి పనులు చేసే వాళ్లను ప్రజలు ఎంతగా అభిమానిస్తారో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

మహిళా సహకార వెలుగులు

● ఆహారోత్పత్తుల శుద్ధి, విక్రయం ద్వారా ఆదాయం ● సోలార్ డ్రయ్యర్లతో పంటలకు విలువ జోడింపు
● సేంద్రియ సేద్యంలో పురోగమిస్తున్న శ్రీగాయత్రి మహిళా రైతుల సొసైటీ కృషి స్ఫూర్తిదాయకం

సాగుబడి
పుష్యమి కార్తె: ఆగస్టు 3 వరకు
అశ్లేష కార్తె: ఆగస్టు 4 నుంచి



● పత్తి చేనులో భర్త చంద్రశేఖరరెడ్డితో మల్లేశ్వరమ్మ

చిన్న, సన్నకారు మహిళా రైతులు సంఘటితమైతే ఆర్థికాభివృద్ధితో పాటు మంచి ఆహారం కూడా మారుమూల గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తుందనటానికి శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘం ఓ తాజా ఉదాహరణ. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లె మండలం ముసలిరెడ్డిగారిపల్లి కేంద్రంగా 2014లో ఈ సొసైటీ ఏర్పాటైంది. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఈ సొసైటీకి ఆది నుంచి అండగా నిలుస్తోంది. ముసలిరెడ్డిగారిపల్లి, మల్లేపల్లి తదితర పరిసర గ్రామాలకు చెందిన 301 మంది సన్న, చిన్నకారు మహిళా రైతు కుటుంబాలలో ఆర్థిక, ఆహార భద్రతా వెలుగులు నింపుతున్న ఈ సొసైటీకి సేంద్రియ రైతు వడ్డెమాని మల్లేశ్వరమ్మ అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. బడికి వెళ్లి చదువుకోలేకపోయినా.. కఠోర శ్రమ, పట్టుదలతో సొసైటీ వార్షిక వ్యాపారాన్ని రూ.65 లక్షలకు పెంచగలిగారామె. ఆమె కృషిని మెచ్చిన నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమెను ఉత్తమ రైతు పురస్కారంతో సత్కరించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు.ఎ., రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి చేతుల మీదుగా ఇటీవల విజయవాడలో ఆమె నాబార్డు పురస్కారాన్ని అందుకోవటం విశేషం.

మల్లేశ్వరమ్మ, చంద్రశేఖరరెడ్డి దంపతులు ముసలిరెడ్డిగారిపల్లి పరిసరాల్లోని 9 ఎకరాల సొంత భూమిలో చాలా ఏళ్లుగా సేంద్రియ సేద్యం చేస్తున్నారు. 2 ఎకరాల్లో మూడేళ్ల క్రితం బత్తాయి మొక్కలు నాటారు. అందులో అంతరపంటగా సాగు చేస్తున్న పత్తి ప్రస్తుతం కోతకు వచ్చింది. గతంలో వేరుశనగ తదితర ఆహార పంటలనే వేసే వారమని, అడవి పందుల బాధ పడలేక పత్తి వేశామని ఆమె తెలిపారు. ఆగస్టు ఆఖరుకు పత్తి తీత పూర్తవుతుంది. సగటున చెట్టుకు 35 కాయలు వచ్చాయి. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. మరో రెండెకరాల్లో కూడా పత్తి సాగు చేస్తున్నారు. 4 ఎకరాలను బొప్పాయి నాటడానికి సిద్ధం చేశారు. ఊరికి ఆనుకొని ఉన్న ఎకరంలో 32 రకాల కూరగాయలను ఇటీవలే విత్తామని మల్లేశ్వరమ్మ తెలిపారు. సిఎస్ఎ క్షేత్ర సిబ్బంది తోడ్పాటుతో ఏ పంటైనా సేంద్రియంగానే సాగు చేస్తుండటం విశేషం. పొలాలు కేసీ కెనాల్‌కు దగ్గర్లో ఉండటంతో భూగర్భ జలానికి కొదువ లేదు. ఒకే బోరుతో భూగర్భ పైపు లైను ద్వారా పొలాల్లోని పంటలకు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నారు.



● నాబార్డు వ్యవస్థాపక దినోత్సవంలో ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకుంటున్న మల్లేశ్వరమ్మ

48 మందికి సేంద్రియ సర్టిఫికేషన్

శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘంలో దాదాపు 11 గ్రామాలకు చెందిన 301 మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇందులో 48 మంది సేంద్రియ సేద్యం చేస్తున్నారు. మల్లేశ్వరమ్మ సహా పది మంది ఎన్‌పిఓపి థర్డ్‌పార్టీ సేంద్రియ సర్టిఫికేషన్ పొందారు. ఈ సర్టిఫికేషన్ ఉన్న ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయొచ్చు. మరో 40 మంది దేశీయ పీజీఎస్ సర్టిఫికేషన్ పొందారు. సొసైటీ తమ రైతులకు విత్తనాలు తదితర ఉత్పాదకాలను తక్కువ ధరకు అందిస్తుంది. దీనితో పాటు కొర్రలు, అండుకొర్రలు, వేరుశనగలు, తెల్లజొన్న, గోధుమలు, ధనియాలు, కందులు, పెసలను సుమారు 15 క్వింటాళ్ల వరకు సభ్య రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేసి, శుద్ధిచేసి ఏడాది పొడవునా విక్రయిస్తున్నారు. మల్లేశ్వరమ్మ తన ఇంట్లో కొన్ని గదులను సొసైటీకి చెందిన ధాన్యాల నిల్వకు ఉపయోగిస్తున్నారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలను మరపట్టే యంత్రాలను నెలకొల్పారు. డిమాండ్ మేరకు ధాన్యాలను శుద్ధి చేయించి సరసమైన ధరకు విక్రయిస్తున్నారు. కందులను సంప్రదాయ పద్ధతుల్లో పప్పుగా తయారు చేస్తున్నారు. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా పురుగు సమస్య ఉండదని తెలిపారు. కొందరు వచ్చి కొనుక్కెళ్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉన్న వారికి కూడా పంపుతున్నారు.



● సోలార్ డ్రయ్యర్లతో నిమ్మ ఒరుగులు

సోలార్ డ్రయ్యర్లతో ఒరుగులు

టొమాటోలు, నిమ్మకాయల వంటి పంటలకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేసి, సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఒరుగులు తయారు చేసి విక్రయించడం ఈ సొసైటీ చేస్తున్న మరో మంచి పని. రహేజా సోలార్ స్టార్టప్ 3 టన్నుల సామర్థ్యం గల 6 సోలార్ డ్రయ్యర్లను ఈ సొసైటీకి సిఎస్ఎ ద్వారా 80% సబ్సిడీపై 5 నెలల క్రితం అందించింది. గతంలో టొమాటో ఒరుగులు తయారు చేశారు. 20 కిలోల టొమాటోలను ఎండబెడితే కిలో ఒరుగులు వస్తాయి. 11 కిలోల నిమ్మకాయలతో కిలో ఒరుగులు చేసి, రూ.340కి అమ్ముతున్నారు. కరివేపాకు, మునగాకులను సైతం ఈ డ్రయ్యర్లలో ఎండబెట్టి పొడులను ఆర్డర్లపై సరఫరా చేస్తున్నామని మల్లేశ్వరమ్మ వివరించారు. సొసైటీ పనులు చేసే మహిళలకు వేతనానికి అదనంగా రోజుకు రూ.5లను భవిష్యనిధిగా జమ చేస్తున్నామని ఆమె సంతోషంగా తెలిపారు.

మంచి ఫుడ్డు అందిస్తున్నానన్న సంతృప్తి ఉంది

ప్రజలకు ఆదాయం ఉంది. చేతిలో డబ్బుంది. కానీ, మంచి ఫుడ్డు లేదు. ఈ గ్రహింపుతోనే సేంద్రియ ఆహారాన్ని పండించి అందించాలన్న ఆలోచన వచ్చింది. రసాయనాల్లేకుండా పండించిన రాగి సంగటి, కొర్రన్నం, సింగిల్ పాలిష్ బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు ఇంటిల్లపాదీ తింటున్నాం. దీని వల్ల మా ఆరోగ్యం ఎంతో బాగుంది. మా ఊళ్లో వాళ్లు 60% మా దగ్గర కొంటారు. బెంగళూరు, హైదరాబాద్‌లలో 18 కుటుంబాలకు కూడా పార్శిల్ ద్వారా పంపుతున్నాం. మా కుటుంబానికి, ప్రజలకు కూడా మంచి ఫుడ్డు అందిస్తున్నానన్న సంతృప్తి చాలా ఉంది. ఈ కీర్తి చాలు.

– **వడ్డెమాని మల్లేశ్వరమ్మ** (97044 02914), అధ్యక్షులు, శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘం, ముసలిరెడ్డిగారిపల్లి, వేంపల్లె మం., వైఎస్సార్ కడప జిల్లా.



పీచే కదా అని పారేయకండి!

• మొక్కజొన్న పీచులో పుష్కలంగా ఔషధగుణాలు
• కండెకు ఒక గ్రాము చొప్పున.. ఎకరానికి 32 కిలోలకు పైగా ఎండు పీచు లభ్యం
• పీచుతో టీ కాచుకొని సేవించవచ్చు.. పొడి చేసి చపాతీ పిండిలో కలుపుకోవచ్చు

మొక్కజొన్న కంకులను తీసుకొని దానికి ఉండే దారాల్లాంటి పీచు (కార్న్ సిల్క్)ను మాత్రం తీసి పారేస్తుంటాం. అయితే, ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ పీచును ప్రపంచవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉపయోగిస్తున్నారు. దీన్ని సేకరించి, ఎండబెట్టి అమ్ముకోవడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. మొక్కజొన్న సాగులో ప్రపంచంలో భారత్ 6వ స్థానంలో ఉంది. 2021–22 రబీ గణాంకాల ప్రకారం ఏపీలో 4.82 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో 4.74 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. మొక్కజొన్న కండెలు కోసేటప్పుడే పీచును కండె నుంచి తీసి జాగ్రత్త చేసుకోవాలి. సేకరించిన పీచును 0.1% ఉప్పు ద్రావణంతో కడిగి శుభ్రం చేసి ఎండబెట్టాలి. తేమ శాతం 7–10% మధ్యలో ఉండేలా చూసుకొని నిల్వ చేసుకోవాలి. ఈ పీచును అనేక ఆహారోత్పత్తుల్లో ఉపయోగించవచ్చు. ఒక మొక్కజొన్న పొత్తు నుంచి జాగ్రత్తగా సేకరించి ఎండబెడితే సగటున ఒక గ్రాము పీచు వస్తుందని అంచనా. ఏక పంటగా సాగు చేస్తే ఎకరానికి 32 వేల మొక్కలు వేస్తారు. అంటే, ఎకరానికి 32 కిలోల ఎండు పీచును సేకరించవచ్చన్న మాట.





మొక్కజొన్న పీచుతో టీ ఇలా..

ఎండబెట్టిన మొక్కజొన్న పీచుతో టీ(కషాయం) కాచుకొని తాగటం ఒక మేలైన పద్ధతి. 2 కప్పుల నీటిలో 2 చెంచాల ఎండిన పీచును కలిపి, తక్కువ మంటపై 10 నిమిషాలు మరిగించి వడకడితే.. చక్కటి టీ రెడీ అవుతుంది. బెల్లం, పంచదార, తేనె తగుమాత్రంగా కలిపి రోజుకు 3 కప్పుల వరకు తాగొచ్చు. వట్టి మొక్కజొన్న పీచు టీకి కొంచెం మట్టి వాసన ఉంటుంది. అందుకని ఇతర పదార్థాలతో కలిపి టీపొడిని తయారు చేసుకొని వాడొచ్చు. ఎండిన మొక్కజొన్న పీచు, ఎండు నిమ్మ బద్దలను వేర్వేరుగా పిండి చేసి కలిపి టీ కాచుకోవచ్చు.





షుగర్, కిడ్నీ, ప్రొస్టేట్ సమస్యలకు ఉపశమనం

మొక్కజొన్న పీచులో అధిక పోషక విలువలతో పాటు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ప్రొటీన్లు, విటమిన్లు, కార్బొహైడ్రేట్లు,కాల్షియం, పొటాషియం, మాంగనీసు, సిటోస్టెరాల్, స్టిగ్మాస్టెరాల్, అల్కలాయిడ్లు, సపోనిన్లు, టానిన్లు, ఫ్లావనాయిడ్లు పుష్కలంగా ఉన్నాయి. దేహంలో నుంచి అధిక నీటిని బయటకు పంపుతుంది. మూత్రవిసర్జనను సులభతరం చేయటం ద్వారా కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా చూస్తుంది. మూత్రవిసర్జనలో నొప్పి, మూత్రనాళంలో/మూత్రాశయంలో ఇన్ఫెక్షన్ల నివారణకు ఉపకరిస్తుంది. ప్రొస్టేట్ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. ఇన్సులిన్ సహజ ఉత్పత్తిని పెంపొందించి మధుమేహాన్ని నియంత్రిస్తుంది. గుండె జబ్బులు, అధిక కొలెస్టరాల్ సమస్యలను నివారిస్తుంది. గౌట్ నొప్పిని తగ్గిస్తుంది. కొవ్వును నియంత్రించి అధిక బరువును నివారించడానికి కూడా మొక్కజొన్న పీచు ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.

ఆహారోత్పత్తులెన్నో..

బ్రెడ్, బిస్కట్ల తయారీలో మొక్కజొన్న పీచు పొడిని కొద్ది మేరకు కలుపుతున్నారు. దీన్ని కలిపినందు వల్ల వాటి రంగు, వాసన ఏమీ మారవు. పోషక విలువలు పెరుగుతాయి. బియ్యపు పిండి, పచ్చి బొప్పాయి, నువ్వుల పిండితో మొక్కజొన్న పీచు పొడిని గరిష్ఠంగా 10% కలుపుతూ ఆరోగ్యదాయకమైన లడ్డూలు తయారు చేయొచ్చు. చపాతీ, పరోటా, రైతా, పప్పు వంటి వంటకాల్లో మొక్కజొన్న పీచు పొడిని కలుపుకుంటే మంచి పోషక విలువలు లభిస్తాయి. టాబ్లెట్లను కూడా మొక్కజొన్న పీచుతో తయారు చేయవచ్చు. బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యం కోసం ఈ టాబ్లెట్లను వాడుతున్నారు. ఒక్కో మాత్రను రూ.20 వరకూ ధర పలుకుతోందట.

మొక్కజొన్న పీచు ప్రాసెసింగ్, నిల్వకు అధిక ఖర్చుతో కూడిన నిర్మాణాలు అవసరం లేదు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, గ్రామీణ నిరుద్యోగులకు మొక్కజొన్న పీచు సేకరణ ద్వారా ఉపాధి కల్పించే అవకాశం ఉంది. మొక్కజొన్న రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ప్రకృతి/సేంద్రియ రైతులకు మరింత ఉపయోగకరమని చెప్పొచ్చు.

12 నుంచి బహుళ అంతస్తుల సేద్యంపై శిక్షణ

ఇస్కాన్ సదాశివపేట ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15 వరకు గోఆధారిత బహుళ అంతస్తుల ఉద్యాన పంటల సాగుపై నాలుగు రోజుల శిక్షణా శిబిరం జరగనుంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కంబాలపల్లిలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనే వారికి బహుళ అంతస్తుల ఉద్యాన పంటల సేద్య నిపుణుడు ఆకాశ్ చౌరాసియా శిక్షణ ఇస్తారు. వసతి, సాత్వికాహారం సహా శిక్షణకు ఫీజు రూ. 4 వేలు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 94495 96039.

4 నుంచి తిరుపతిలో సేంద్రియ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6 వరకు తిరుపతిలోని టీటీడీ గ్రౌండ్స్(ఇస్కాన్ టెంపుల్ పక్కన)లో సేంద్రియ ఉత్పత్తుల సంత జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన అనేక రకాల ఆహారోత్పత్తులు, కూరగాయలు, పండ్లను అనేక రాష్ట్రాల రైతులు స్వయంగా విక్రయించనున్నారు. 4న ఉ. 10 గం.కు రైతు సదస్సు, 5న ఆహార శుద్ధిపై సదస్సు, 6న సా. 3 గం.కు సేంద్రియ ఇంటిపంటల సాగుపై సదస్సు నిర్వహించనున్నారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 81436 32488, 83741 39439.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



ప్రతాప్ పసిడి గురి...

చైనాలో జరుగుతున్న ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రెండు స్వర్ణాలు సాధించాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ప్రతాప్, దివ్యాన్ష్, అర్జున్‌ల త్రయం 1894.7తో ప్రపంచ రికార్డు స్కోరు సాధించి పసిడి పతకం గెలిచింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో ప్రతాప్ (252.6 స్కోరుతో) మరో బంగారు పతకం గెలిచాడు. ఆర్చరీ క్రీడ మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో అవ్‌నీత్ కౌర్, పురుషుల ఈవెంట్‌లో సంగమ్‌ప్రీత్ బిస్లా భారత్‌కు పసిడి పతకాలు అందించారు.

భారత్ ఖాతాలో రెండో స్వర్ణం

ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం యూత్ పురుషుల 67 కేజీల విభాగంలో బేదబ్రత్ భరాలి పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. బేదబ్రత్ స్నాచ్‌లో 124 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 149 కేజీలు బరువెత్తి ఓవరాల్‌గా 273 కేజీలతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.



విజయమా... ప్రయోగమా!

వెస్టిండీస్‌తో రెండో వన్డేలో ఓటమి తర్వాత 'మేం భవిష్యత్తుపై దృష్టి పెట్టాం. ప్రస్తుత ఫలితాలు ముఖ్యం కాదు. అందుకే భిన్నమైన కూర్పుతో తుది జట్టు కోసం ప్రయోగాలు చేస్తున్నాం' అని భారత కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించారు. నిజంగానే ద్రవిడ్ మాటలను చేతలకు అన్వయిస్తే మరోసారి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మ్యాచ్ ఆడకుండా విశ్రాంతి తీసుకోవడం ఖాయం. ఇలాంటి స్థితిలో భారత్ చివరి వన్డేలో నెగ్గి సిరీస్ గెలుచుకుంటుందా లేక గత మ్యాచ్‌లాగే తలవంచుతుందా చూడాలి.

- నేడు మూడో వన్డే బరిలో భారత్
- వెస్టిండీస్‌తో సిరీస్ తేల్చే చివరి పోరు
- రాత్రి 7 గంటల నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



తరూబా (ట్రినిడాడ్): వన్డే వరల్డ్‌కప్ ఆతిథ్య జట్టు హోదాలో సిద్ధమవుతున్న భారత్ జట్టు వరల్డ్ కప్‌కు అర్హత సాధించని టీమ్‌తో సిరీస్ విజయం కోసం బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరిదైన మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. తొలి వన్డేలోనే కష్టంగా నెగ్గిన టీమిండియా... రెండో వన్డేలో ఓటమిపాలు కావడంతో సిరీస్ 1–1గా సమంగా నిలిచింది. ఈ నేపథ్యంలో మూడో వన్డే ఏకపక్షంగా మారకుండా హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

ఆ ఇద్దరికీ...

రోహిత్, కోహ్లి గత మ్యాచ్‌లాగే ఆడకపోతే భారత జట్టుకు సంబంధించి ఇద్దరు బ్యాటర్లపై ప్రధానంగా చర్చ సాగనుంది. తమను తాము నిరూపించుకోవాల్సిన స్థితిలో సూర్యకుమార్ యాదవ్, సంజూ సామ్సన్‌లు బరిలోకి దిగుతున్నారు. కోచ్ చెప్పిన దాన్ని బట్టి వీరిద్దరికి మరో అవకాశం ఖాయం. సూర్య వన్డేల్లో ఇంకా తడబడుతుండగా... చాలా కాలం తర్వాత దక్కిన అవకాశాన్ని సామ్సన్ ఉపయోగించుకోలేకపోయాడు. మూడు, నాలుగు స్థానాల్లో వీరు రాణిస్తే జట్టుకు మేలు కలుగుతుంది. ఇషాన్ కిషన్ ఆకట్టుకోగా, గిల్ ఇంకా ప్రభావం చూపలేదు. హార్దిక్ కూడా అంచనాలకు తగిన విధంగా రెండు విభాగాల్లోనూ రాణించలేకపోతున్నాడు. బౌలింగ్‌లో ఉమ్రాన్, ముకేశ్, కుల్దీప్‌లు తమ సత్తా మేరకు ఆడితే విండీస్‌ను కట్టడి చేయగలరు. జడేజా, అక్షర్ కూడా రాణిస్తే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయి.

ఆత్మవిశ్వాసంతో...

తొలి వన్డేలో కుప్పకూలినా... రెండో మ్యాచ్‌లో గెలుపు విండీస్ ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ముఖ్యంగా కెప్టెన్ షై హోప్ చక్కటి ఫామ్‌తో ముందుండి జట్టును నడిపిస్తున్నాడు. మేయర్స్ గత మ్యాచ్‌లో తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించాడు. కింగ్, అతనజ్ కూడా రాణించడంతో పాటు కార్టీ కూడా నిలబడితే జట్టు మంచి స్కోరు సాధించేందుకు అవకాశం ఉంటుంది. విండీస్ బౌలింగ్ గత మ్యాచ్‌లో ఆకట్టుకుంది. పేసర్లలో అల్జారి జోసెఫ్ పదునైన పేస్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టగా రొమారియో షెఫర్డ్ కూడా చాలా తెలివిగా బౌలింగ్ చేశాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ గుడకేశ్ మోతీ కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోసారి సమష్టిగా రాణించి సొంతగడ్డపై సిరీస్ సాధించాలని ఆ జట్టు పట్టుదలగా ఉంది.

పిచ్, వాతావరణం

బ్రియాన్ లారా స్టేడియం ఇప్పటి వరకు ఒకే ఒక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఈ మైదానంలో ఇదే తొలి అంతర్జాతీయ వన్డే. అయితే ఈ వేదికపై జరిగిన దేశవాళీ వన్డేల్లో స్వల్ప స్కోర్లే నమోదు కావడం పిచ్ పరిస్థితికి ఒక సూచిక. మ్యాచ్ రోజు వాన ముప్పు లేదు.

బుమ్రా వచ్చేశాడు

- కెప్టెన్ హోదాలో పునరాగమనం
- ఐర్లాండ్‌తో టి20 సిరీస్‌లో భారత జట్టు



ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ మైదానంలోకి దిగబోతున్నాడు. వెన్నుకు గాయంతో జట్టుకు దూరం కావడం, ఆపై శస్త్రచికిత్స, అనంతరం రీహాబిలిటేషన్... ఇప్పుడు పూర్తిగా కోలుకొని బుమ్రా ఆట కోసం సిద్ధమయ్యాడు. ఐర్లాండ్‌తో జరిగే 3 మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం అతడిని సెలక్టర్లు ఎంపిక చేశారు. పైగా అతను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఒక టెస్టులో బుమ్రా భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. కీలకమైన ఆసియా కప్, ప్రపంచకప్‌కు ముందు బుమ్రా మ్యాచ్ ఫిట్‌నెస్ స్థాయిని పరీక్షించేందుకు పెద్దగా ఒత్తిడి లేని, బలహీన జట్టుతో జరిగే సిరీస్‌లో ఆడించబోతున్నారు. చివరిసారిగా గత ఏడాది సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన బుమ్రా... ఐపీఎల్ కూడా ఆడలేదు. బుమ్రాతో పాటు గాయం నుంచి కోలుకున్న మరో పేసర్ ప్రసిధ్ కృష్ణకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. ప్రసిధ్ కూడా సంవత్సరం క్రితం భారత్‌కు ఆడాడు. వీరిద్దరు మినహా సీనియర్ ఆటగాళ్లెవరూ లేకుండా యువ ఆటగాళ్లతోనే మిగతా జట్టును ఎంపిక చేశారు. ఆసియా క్రీడలకు ఎంపిక చేసిన టీమ్‌లోని సభ్యులే దాదాపుగా ఇక్కడా ఉన్నారు. భారత్, ఐర్లాండ్ మధ్య ఆగస్టు 18, 20, 23 తేదీల్లో డబ్లిన్‌లో మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

జట్టు వివరాలు: బుమ్రా (కెప్టెన్), రుతురాజ్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఠాకూర్ తిలక్ వర్మ, రింకూ సింగ్, సంజూ సామ్సన్, జితేశ్ శర్మ, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్.

రన్నరప్ సరయు



సాక్షి, హైదరాబాద్: పోంటెవెద్రా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి వేల్పుల సరయు అద్భుత ప్రదర్శన కనబరిచింది. స్పెయిన్‌లో జరిగిన ఈ టోర్నీలో వరంగల్ జిల్లాకు చెందిన 16 ఏళ్ల సరయు రన్నరప్‌గా నిలిచింది. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో చివరిదైన 79వ ర్యాంక్‌తో బరిలోకి దిగిన సరయు చివరకు 6.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సరయు నాలుగు గేముల్లో నెగ్గి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. ఈ టోర్నీ ద్వారా మొత్తం 211 రేటింగ్ పాయింట్లు సమకూర్చుకున్న సరయు ఏకకాలంలో మహిళా అంతర్జాతీయ మాస్టర్ (డబ్ల్యూఐఎం), మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం), అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) హోదాలకు సంబంధించి తొలి నార్మ్‌ను సొంతం చేసుకోవడం విశేషం.

ఆఖరి మజిలీలో ఇంగ్లండ్‌దే విక్టరీ

- యాషెస్ సిరీస్ 2–2తో సమం
- విజయంతో బ్రాడ్ వీడ్కోలు

లండన్: సంప్రదాయ క్రికెట్‌లో యాషెస్ సిరీస్‌కున్న ప్రత్యేకత, విశిష్టత ఇంకే సిరీస్‌కు ఎందుకు ఉండదో తాజా సిరీస్‌లో ఏ ఒక్క మ్యాచ్ చూసిన ఇట్టే అర్థమవుతుంది. టెస్టు సమరం ఐదు రోజులు ఆసక్తికరంగానే మొదలైంది. ఐదు టెస్టులూ రసవత్తరంగానే జరిగాయి. గెలిచినా... ఓడినా... ఫలితంతో సంబంధంలేకుండా ఇంగ్లండ్ ఈ సిరీస్ ఆసాంతం వన్డేను తలపించే దూకుడునే కొనసాగించింది. ఇక ఈ ఐదో టెస్టు చివరి మజిలీలో వర్షం కూడా 'యాషెస్' విశిష్టత ముందు తోకముడిచింది. ఆఖరి రోజు ఆటలో క్లైమాక్స్‌కు సరిపడా మలుపులిచ్చి... ఇరు జట్లను ఊరించి మరీ సిరీస్‌ను పంచింది.

ఆసీస్‌ను నడిపించి... ఇంగ్లండ్‌ను గెలిపించి...

ఆఖరి రోజు 384 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 135/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 94.4 ఓవర్లలో 334 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్లు వార్నర్ (60; 9 ఫోర్లు), ఖ్వాజా (72; 8 ఫోర్లు) స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. కానీ స్మిత్ (54; 9 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (43; 6 ఫోర్లు) కలిసి నాలుగో వికెట్‌కు 95 పరుగుల జోడించడంతో ఆసీస్ ఆశలు పెంచుకుంది. టీ సెషన్‌లో 238/3 స్కోరుతో ఇంగ్లండ్‌ను కంగారు పెట్టిన ఆసీస్‌కు... హెడ్, స్మిత్, మార్ష్ (6), స్టార్క్ (0), కెప్టెన్ కమిన్స్ (9) వికెట్లను 300 పరుగుల్లోపే కోల్పోవడంతో ఓటమి ఖాయమైంది. బ్రాడ్ కెరీర్ ఆఖరి టెస్టులో ఆఖరి వికెట్‌గా క్యారీ (28; 1 ఫోర్, 1 సిక్స్)ని అవుట్ చేయడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌కు 334 స్కోరువద్ద తెర పడింది. ఐదో టెస్టులో 49 పరుగులతో గెలిచిన ఇంగ్లండ్ సిరీస్‌ను 2–2తో సమం చేసుకుంది. అయితే గత సిరీస్‌ను గెలిచిన ఆసీస్ వద్దే 'యాషెస్' ఉండిపోనుంది. 2 వికెట్లతో బ్రాడ్ తన కెరీర్‌కు చిరస్మరణీయ ముగింపు ఇచ్చుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వోక్స్ 4, మొయిన్ అలీ 3 వికెట్లు తీశారు. వోక్స్, స్టార్క్‌లకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి. తదుపరి యాషెస్ సిరీస్ ఆస్ట్రేలియాలో 2025–2026లో జరుగుతుంది.



విజయానందంలో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్, బ్రాడ్

బ్రాడ్ కెరీర్ గణాంకాలు

ఫార్మాట్	ఆడినవి	వికెట్లు	బెస్ట్ బౌలింగ్	చేసిన పరుగులు	అత్యధిక స్కోరు
టెస్టులు	167	604	8/15	3662	169
వన్డేలు	121	178	5/23	529	45
టి20లు	56	65	4/24	118	18

రెండో రౌండ్‌కు కార్తీక్



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. గ్రెగరీ కై దనోవ్ (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్‌లో కార్తీక్ 1.5–0.5తో గెలుపొందాడు. వీరిద్దరి మధ్య ఆదివారం తొలి గేమ్ 'డ్రా'కాగా...సోమవారం రెండో గేమ్‌లో కార్తీక్ 40 ఎత్తుల్లో గెలిచాడు. మరోవైపు లెవాన్ పాంట్‌సులయ (జార్జియా)తో రెండో గేమ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి 31 ఎత్తుల్లో ఓడిపోయాడు. దాంతో వీరిద్దరు 1–1తో సమంగా ఉన్నారు. నేడు టైబ్రేక్ గేమ్‌ల ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. మహిళల విభాగంలో మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక 68 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోవడంతో ఇద్దరూ 1–1తో సమంగా నిలిచారు.

సినిమా

ముందుంది మూడో భాగం

ఫస్ట్ పార్ట్ హిట్... సెకండ్ పార్ట్ కూడా హిట్.. మరి ఆ హిట్ కంటిన్యూ అవ్వాలి కదా. అవ్వాలంటే కథ ఉండాలి. కొన్ని చిత్రాల కథలకు ఆ స్కోప్ ఉంది. ఎన్ని భాగాలైనా తీసేంత కథ ఉంటుంది. అలా తెలుగులో కొన్ని చిత్రాల కథలు ఉన్నాయి. ఆ కథల తొలి, మలి భాగాలు వచ్చాయి. ఇప్పుడు మూడో భాగానికి కథ రెడీ అవుతోంది. 'ముందుంది మూడో భాగం' అంటూ రానున్న సీక్వెల్ చిత్రాల గురించి తెలుసుకుందాం.





వరుణ్, వెంకటేశ్



నాని



ఆర్య, పుష్పల్లో అల్లు అర్జున్



యశ్

ఒకే కాంబినేషన్.. రెండు చిత్రాల సీక్వెల్

సీక్వెల్ చిత్రాలు రావడం ఇప్పుడు కామన్ అయింది. అయితే ఒకే కాంబినేషన్‌లో రెండు చిత్రాల సీక్వెల్స్ రావడం అరుదు. అల్లు అర్జున్–సుకుమార్‌ల కాంబినేషన్ ఈ కోవలోకే వస్తుంది. 'ఆర్య' (2004)తో ఈ ఇద్దరి కాంబినేషన్ మొదలైంది. ఆ చిత్రం హిట్‌తో హిట్ కాంబినేషన్ అనే పేరొచ్చింది. ఆ తర్వాత అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ 'ఆర్య 2' (2009) తెరకెక్కించారు. ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో 'ఆర్య 3' కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఇక అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప' (2021) పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్టయిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'పుష్ప 2' నిర్మాణంలో ఉంది. 'పుష్ప 3' కూడా ఉంటుంది. 'ఆర్య', 'పుష్ప'... ఇలా సొత్‌లో రెండు చిత్రాల సీక్వెల్స్ తెచ్చిన కాంబినేషన్ బన్నీ–సుకుమార్‌లదే అవుతుంది.

ఎఫ్ 4

వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా తెరకెక్కిన తొలి మల్టీస్టారర్ చిత్రం 'ఎఫ్ 2: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తమన్నా, మెహరీన్ కథానాయికలుగా నటించారు. ఈ సినిమా 2019 జనవరి 12న విడుదలై నవ్వులు పూయించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఆ మూవీకి సీక్వెల్‌గా 'ఎఫ్ 3: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' తెరకెక్కించారు అనిల్. ఈ మూవీలోనూ వెంకటేశ్–తమన్నా, వరుణ్ తేజ్–మెహరీన్ హీరో హీరోయిన్లు. 2022 మే 27న విడుదలైన 'ఎఫ్ 3' కూడా మంచి వసూళ్లు రాబట్టింది. 'ఎఫ్ 4' కూడా ఉంటుందని హింట్ ఇచ్చింది చిత్ర యూనిట్.

హిట్ 3

'హిట్' సినిమా ఫ్రాంచైజీలో ఇప్పటికే రెండు భాగాలు విడుదల కాగా మూడో భాగం కోసం డైరెక్టర్ శైలేష్ కొలను సన్నాహాలు చేస్తున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'హిట్: ది ఫస్ట్ కేస్' సినిమా 2020 ఫిబ్రవరి 28న విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'హిట్ 2: ది సెకండ్ కేస్' తీశారు శైలేష్ కొలను. అయితే ఈ మూవీలో హీరో మారారు.. అడివి శేష్ హీరోగా నటించారు. 2022 డిసెంబరు 2న రిలీజైన ఈ మూవీ ఘన విజయం సాధించింది. హిట్ ఫ్రాంచైజీలో మొత్తం 7 భాగాలు ఉంటాయని శైలేష్ స్పష్టం చేశారు. 'హిట్ 2' లానే 'హిట్ 3'లోనూ హీరో మారారు. 'హిట్ 1', 'హిట్ 2' సినిమాలు నిర్మించిన హీరో నాని 'హిట్ 3'లో లీడ్ రోల్ చేయనున్నారు. ఇందులో అర్జున్ సర్కార్ అనే పోలీస్ ఆఫీసర్‌గా నాని కనిపించనున్నారు. 'హిట్ 2' క్లయిమాక్స్‌లోనే నాని కనిపించి, ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. అటు నాని, ఇటు శైలేష్ కొలను తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. మరి 'హిట్ 3'కి కొబ్బరికాయ కొట్టేదెప్పుడో తెలియాలంటే వెయిట్ అండ్ సీ.

కేజీఎఫ్ 3

కన్నడ చిత్ర పరిశ్రమను, యశ్‌ను పాన్ ఇండియా స్థాయిలో నిలబెట్టిన చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 1'. యశ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించారు. 2018 డిసెంబరు 21న ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత యశ్‌తోనే 'కేజీఎఫ్: చాప్టర్ 2'ని తెరకెక్కించారు ప్రశాంత్ నీల్. 2022 ఏప్రిల్ 14న రిలీజైన ఈ సినిమా కూడా హిట్‌గా నిలిచింది. 'కేజీఎఫ్: చాప్టర్ 3' కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు మేకర్స్.



రామ్, శ్రీలీల

నీ చుట్టు...

రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్కంద'. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. ఈ చిత్రంలోని 'నీ చుట్టు చుట్టు...' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోను ఈ నెల 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ని విడుదల చేశారు. ''ఈ చిత్రంలో రామ్ ఇంతకుముందు కనిపించనంత మాస్‌గా కనిపించనున్నారు. 'నీ చుట్టు..' సాంగ్ చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: పవన్ కుమార్, జీ స్టూడియోస్.

డబుల్.. తొలి షెడ్యూల్ పూర్తి: రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ''మా యాక్షన్ ప్యాక్ ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. మరో షెడ్యూల్ కోసం విదేశాలు వెళ్లనున్నాం. 2024 మార్చి 8న థియేటర్లలో 'డబుల్ ఇస్మార్ట్'' అని ఛార్మి పేర్కొన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సీఈవో: విషు రెడ్డి.

నీ జతై...



వరుణ్, సాక్షి

'నీ జతై...' అంటూ వరుణ్ తేజ్, సాక్షీ వైద్య పాడుకున్నారు. ఈ ఇద్దరూ జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున'లోని రొమాంటిక్ సాంగ్ ఇది. చిత్ర సంగీతదర్శకుడు మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటను ఎల్విా, నకుల్ అభయంకర్ పాడారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. ''సరికొత్త యాక్షన్ సీక్వెన్స్‌లతో, ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. ఇందులో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య స్పెషల్ ఏజెంట్స్‌గా కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


వినాయక చవితికి...



లారెన్స్

రజనీకాంత్ హీరోగా పి. వాసు దర్శకత్వం వహించిన 'చంద్రముఖి' (2005)కి సీక్వెల్‌గా పి. వాసు తెరకెక్కించిన సినిమా 'చంద్రముఖి 2'. రాఘవ లారెన్స్ హీరోగా నటించిన ఈ చిత్రంలో కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమాని వినాయక చవితికి (సెప్టెంబరు) విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రాఘవ లారెన్స్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్‌కుమార్ నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమెరా: ఆర్‌డీ రాజశేఖర్.

తేడాలొస్తే...



విశ్వక్ సేన్

'మేము గోదారోళ్ళం.. మాట ఒకటే సాగదీస్తాం.. తేడాలొస్తే నవ్వుతూ నరాలు లాగేస్తాం' అంటున్నారు విశ్వక్ సేన్. కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ హీరోగా సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రంలోని డైలాగ్ ఇది. ఈ చిత్రానికి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' టైటిల్‌ని ఖరారు చేసినట్లు ప్రకటించి, యూనిట్ రిలీజ్ చేసిన వీడియో గ్లింప్స్‌లో పైన పేర్కొన్న డైలాగ్స్ ఉన్నాయి. ''క్రూరమైన ప్రపంచంలో సామాన్యుడి నుంచి సంపన్నుడిగా ఎదిగిన వ్యక్తిగా విశ్వక్ సేన్ గ్రే క్యారెక్టర్ చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. నేహా శెట్టి కథానాయికగా, అంజలి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది.

ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేశాం



రాజేష్

''కృష్ణగాడు అంటే ఒక రేంజ్' గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. హీరో పేరు కృష్ణ'' అని దర్శకుడు రాజేష్ దొండపాటి అన్నారు. రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎస్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రాజేష్ దొండపాటి మాట్లాడుతూ–''దర్శకుడిగా నాకిది తొలి సినిమా. అనుకున్న బడ్జెట్‌లో సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేశాం. సాబు వర్గీస్ సంగీతం, నేపథ్య సంగీతం హైలైట్'' అన్నారు.

తుప్పు వదిలించావ్ అన్నారు



మహతి స్వరసాగర్

''నాన్నగారి (మణిశర్మ) బర్త్‌డేకి మెహర్ రమేష్‌గారు వచ్చారు. 'చిరంజీవిగారి 'భోళా శంకర్'కి నువ్వు సంగీతం అందిస్తున్నావ్' అంటే జోక్ చేస్తున్నారేమో అనుకున్నా. ఆ తర్వాతి రోజు కథ చెప్పడంతో షాకయ్యా'' అన్నారు సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటించారు. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మహతి స్వరసాగర్ మాట్లాడుతూ–''ఈ సినిమా కోసం తొలిసారి నాన్నగారి సలహాలు తీసుకున్నా. ట్యూన్ చేశాక నాన్నగారికి వినిపించాను. చిరంజీవిగారికి తొలిసారి ట్యూన్ వినిపించినప్పుడు 'చెవిలో తుప్పు వదిలించావ్' అని అభినందించడంతో మరింత ధైర్యంతో ముందుకు సాగాను. ఈ సినిమాలోని 'జామ్ జామ్..., మిల్కీ బ్యూటీ..' పాటలంటే చిరంజీవిగారికి ఇష్టం. నేపథ్య సంగీతంపైనా ప్రత్యేక దృష్టి సారించి, బాగా ఇచ్చాను. నాన్నగారి పాటల్లో 'ఇంద్ర'లోని 'రాధే గోవిందా..' పాటని రీమిక్స్ చేయాలని ఉంది. అది రామ్‌చరణ్‌గారికే సరిపోతుంది'' అన్నారు.


అత్త.. అమ్మాయి.. ఓ పెళ్లి



ఇవానా, హరీష్, నదియా

భారత క్రికెటర్ ఎంఎస్ ధోని 'ఎల్‌జీఎమ్'తో నిర్మాణంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. హరీష్ కల్యాణ్, ఇవానా, నదియా, యోగిబాబు కీలక పాత్రల్లో రమేష్ తమిళ్‌మణి దర్శకత్వం వహించారు. సాక్షి ధోని, వికాస్ హస్జా నిర్మించిన ఈ చిత్ర తెలుగు, తమిళంలో ఈ నెల 4న విడుదల కానుంది. తెలుగులో జేపీఆర్ ఫిల్మ్స్, త్రిపుర ప్రొడక్షన్స్ రిలీజ్ చేస్తున్నాయి. ''ప్రేమించిన అబ్బాయిని పెళ్లాడాలనుకున్న అమ్మాయి కాబోయే అత్తగారి గురించి తెలుసుకునేందుకు ఆమెతో కొద్ది రోజులు జర్నీ చేయాలనుకుంటుంది. ఈ పాయింట్‌తో సినిమా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

రాయలసీమ నేపథ్యంలో...



విషికా, రవి

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరులో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి మాట్లాడుతూ – ''రాయలసీమ నేపథ్యంలో సాగే చిత్రం 'సగిలేటి కథ'' అన్నారు. ''సగిలేటి కథ' అనే నవల నా సినిమాకి ప్రేరణ మాత్రమే.. కథ పూర్తిగా ఒరిజినల్‌గా ఉంటుంది'' అన్నారు రాజశేఖర్ సుద్మూన్. ''కేరాఫ్ కంచరపాలెం, బలగం' వంటి చిత్రాల కోవలోనే 'సగిలేటి కథ' కూడా ఉంటుంది'' అన్నారు సమర్పకుడు నవదీప్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	367	66,528
నిఫ్టీ ▲	108	19,754

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,432	▲	6
డోజోన్స్	35,490	▲	30
ఎఫ్‌టీఎస్ఈ 100	7,699	▲	5
డాక్స్	16,447	▽	23
షాంఘై	3,291	▲	15
నికాయ్	33,172	▲	413

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,567
బంగారం (99.5 స్వచ్ఛత)	59,328
వెండి (కిలో)	73,860

ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ వాటా అప్

- టైగర్ గ్లోబల్ నుంచి కొనుగోలు
- డీల్ విలువ రూ. 11,500 కోట్లు



న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ వాటాను యూఎస్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ కొనుగోలు చేసింది. ఇందుకు 1.4 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 11,500 కోట్లు) వెచ్చించినట్లు తెలుస్తోంది. 35 బిలియన్ డాలర్ల విలువలో 4 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంతక్రితం 2021లో 37.6 బిలియన్ డాలర్ల విలువలో ఫ్లిప్‌కార్ట్ నిధుల సమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే టైగర్ గ్లోబల్ వాటాను కొనుగోలు చేసినట్లు వాల్‌మార్ట్ ప్రతినిధి ధ్రువీకరించినప్పటికీ డీల్ విలువను వెల్లడించకపోవడం గమనార్హం! ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ తొలి దశ(2009)లో 9 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. తదుపరి 2017కల్లా 1.2 బిలియన్ డాలర్లకు పెట్టుబడులను పెంచుకోవడం ద్వారా అతిపెద్ద వాటాదారు సంస్థలలో ఒకటిగా ఆవిర్భవించింది. 2018లో వాల్‌మార్ట్‌కు అత్యధిక వాటాను విక్రయించినప్పటికీ తిరిగి 2021లో ఇన్వెస్ట్ చేసింది. కాగా.. యాక్సెల్ పార్టనర్స్ సైతం 35 కోట్ల డాలర్లకు 1 శాతం వాటాను వాల్‌మార్ట్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది.

జూన్‌లో మౌలిక రంగం పురోగతి

ఎనిమిది పరిశ్రమల వృద్ధి 8.2 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం వృద్ధి జూన్‌లో 5 నెలల గరిష్టాన్ని చూసింది. వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ దాదాపు 40%. కాగా, ఆర్థిక సంవత్సరంలో గడచిన మూడు నెలల్లో (ఏప్రిల్–జూన్) గ్రూప్ 5.8% పురోగమించింది.

పరిశ్రమల వారీగా (శాతాల్లో)

రంగం	వృద్ధి
స్టీల్	21.9
సహజ వాయువు	3.6
బొగ్గు	9.8
రిఫైనరీ ప్రొడక్టులు	4.6
ఎరువులు	3.4
సిమెంట్	9.4
విద్యుత్	3.3
క్రూడ్ ఆయిల్(-)	0.6

మారుతీ లాభం హైస్పీడ్

క్యూ1లో రూ. 2,525 కోట్లు



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్ఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 2,525 కోట్లను తాకింది. పెద్ద కార్ల అమ్మకాలు ఊపందుకోవడం, మెరుగైన ధరలు, వ్యయ నియంత్రణలు, అధిక నిర్వహణేతర ఆదాయం ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,036 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 26,512 కోట్ల నుంచి రూ. 32,338 కోట్లకు జంప్‌చేసింది. కాగా.. మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్ఎంసీ) నుంచి గుజరాత్‌లోని తయారీ ప్లాంటును సొంతం చేసుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. తద్వారా క్లిష్టతను తగ్గిస్తూ ఒకే గొడుగుకిందకు తయారీ కార్యకలాపాలను తీసుకురానున్నట్లు తెలిపింది.

కాంట్రాక్ట్ తయారీకి టాటా

సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్ఎంజీ)తో కాంట్రాక్ట్ తయారీ ఒప్పందం రద్దుకు బోర్డు అనుమతించినట్లు మారుతీ వెల్లడించింది. అంతేకాకుండా ఎస్ఎంసీ నుంచి ఎస్ఎంజీ షేర్లను సొంతం చేసుకోనున్నట్లు తెలిపింది. ఎస్ఎంసీకి పూర్తి అనుబంధ సంస్థ అయిన ఎస్ఎంజీ వార్షికంగా 7.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉత్పత్తులను పూర్తిగా ఎంఎస్ఐకు సరఫరా చేస్తోంది. 2024 మార్చి31కల్లా లావాదేవీ పూర్తికాగలదని అంచనా వేస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. 2030–31కల్లా 40 లక్షల వాహన తయారీ సామర్థ్యంవైపు కంపెనీ సాగుతున్నట్లు ఎంఎస్ఐ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. వచ్చే ఏడాది తొలి బ్యాటరీ వాహనాన్ని విడుదల చేయడంతో సహా.. వివిధ ప్రత్యామ్నాయ టెక్నాలజీలవైపు చూస్తున్నట్లు చెప్పారు.

6 శాతం అప్

క్యూ1లో మారుతీ అమ్మకాలు 6%పైగా పుంజుకుని 4,98,030 వాహనాలకు చేరాయి. వీటిలో దేశీయంగా 9 శాతం వృద్ధితో 4,34,812 యూనిట్లను తాకగా.. ఎగుమతులు మాత్రం 69,437 యూనిట్ల నుంచి తగ్గి 63,218 వాహనాలకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు బీఎస్ఈలో 1.6 శాతం బలపడి రూ. 9,820 వద్ద ముగిసింది.

6.50 కోట్ల ఐటీఆర్‌లు దాఖలు

ఒకే రోజు 36.91 లక్షల రిటర్నులు

న్యూఢిల్లీ: ఆదాయపన్ను రిటర్నుల దాఖలుకు చివరి రోజు అయిన సోమవారం పెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు ముందుకు వచ్చారు. సోమవారం ఒక్కరోజే 36.91 లక్షల రిటర్నులు నమోదయ్యాయి. దీంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి దాఖలైన మొత్తం రిటర్నుల సంఖ్య 6.50 కోట్లకు చేరింది. వేతన జీవులు, ఆడిటింగ్ అవసరం లేని వారు రిటర్నులు దాఖలు చేసేందుకు జూలై 31 చివరి తేదీ కావడం గమనార్హం. గతేడాది జూలై 31 నాటికి దాఖలైన 5.83 కోట్ల ఐటీఆర్‌లతో పోలిస్తే 15 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ''ఇప్పటి వరకు 6.50 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. ఇందులో 36.91 లక్షల ఐటీఆర్‌లు 31వ తేదీన సాయంత్రం 6 గంటల వరకు నమోదయ్యాయి''అంటూ ఆదాయపన్ను శాఖ ట్వీట్ చేసింది. పన్ను ఎగవేతకు రెవెన్యూ యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు, నిబంధనలను అనుసరించే వారు పెరగడంతో పన్ను చెల్లింపుదారుల బేస్ విస్తృతం అవుతున్నట్టు పన్ను నిపుణులు అభిప్రా యపడుతున్నారు. డేటా అనలైటిక్స్, ఇతర సమాచారం ఆధారంగా అధిక రిస్క్ కేసులను ఆదాయపన్ను శాఖ గుర్తించి, వారికి వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపడుతుండడాన్ని ప్రస్తావిస్తున్నారు. నగదు డిపాజిట్లు, క్రెడిట్ కార్డు చెల్లింపులు, ప్రాపర్టీల కొనుగోలు, విక్రయాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో లావాదేవీల సమాచారాన్ని ఆదాయపన్ను శాఖ సమీకరించి, విశ్లేషిస్తున్నట్టు చెప్పారు.



నష్టాల నుంచి.. లాభాల్లోకి

- సానుకూల అంతర్జాతీయ ప్రభావం
- ఐటీ, ఆయిల్, విద్యుత్ షేర్లకు గిరాకీ
- అరశాతం పెరిగిన సూచీలు
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఆరంభ నష్టాలను భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు సోమవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, టీసీఎస్ షేర్లు రెండు శాతం రాణించాయి. ఉదయం సెన్సెక్స్ నాలుగు పాయింట్ల స్వల్ప నష్టంతో 66,156 వద్ద, నిఫ్టీ 20 పాయింట్లు పెరిగి 19,666 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో స్వల్ప అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 161 పాయింట్లు నష్టపోయి 65,999 వద్ద, నిఫ్టీ 48 పాయింట్లు పతనమై 19,598 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. తదుపరి ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో దేశీయ మార్కెట్లో తిరిగి కొనుగోళ్లు పుంజుకున్నాయి. దీంతో సూచీలు నష్టాలను భర్తీ చేసుకొని లాభాలను ఆర్జించగలిగాయి. చివరికి సెన్సెక్స్ 367 పాయింట్లు పెరిగి 66,528 వద్ద ముగిసింది. నిఫ్టీ 108 పాయింట్లు బలపడి 19,754 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, ఐటీ, మెటల్, ఆయిల్, విద్యుత్ షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు భారీ డిమాండ్ లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.31%, ఒకశాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.701 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,488 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 82.29 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సోమవారం బీఎస్ఈలో రూ.2.50 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.306.66 లక్షల కోట్లకు చేరింది.
- దేశీయ అత్యంత విలువైన రెండో సంస్థగా టీసీఎస్ తిరిగి తన స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ షేర్ల ర్యాలీలో భాగంగా టీసీఎస్ షేరు 2% లాభపడి రూ.3,421 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ విలువ రూ.12.51 లక్షల కోట్లకు చేరింది. దీంతో ఈ జూలై 20న రెండో స్థానానికి చేరుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(0.38%) రూ.12.45 లక్షల కోట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. కాగా ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ రూ.17.23 లక్షల కోట్లతో తొలి స్థానంలో కొనసాగుతుంది.
- జెట్ ఎయిర్‌వేస్ షేరు బీఎస్ఈలో 5% పెరిగి రూ.50.80 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్ పునరుద్ధరించినట్లు జలాన్ – కల్రాక్ కన్సార్షియం తెలపడంతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది.

ఎల్‌అండ్‌టీ రూ. 6 ప్రత్యేక డివిడెండ్

ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తమ షేర్‌హోల్డర్లకు రూ. 6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. చైర్మన్ ఏఎం నాయక్.. ఆరు దశాబ్దాలుగా గ్రూప్‌నకు నిరంతరాయంగా సేవలు అందిస్తుండటాన్ని పురస్కరించుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీనికి ఆగస్టు 2 రికార్డు తేదీ కాగా ఆగస్టు 14లోగా డివిడెండ్ చెల్లిస్తారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తిగా భారత కార్పొరేట్ చరిత్రలో నాయక్ పేరు చిరస్థాయిగా నిల్చిపోతుందని ఉద్యోగులకు రాసిన లేఖలో ఎల్‌అండ్‌టీ సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. దశాబ్దాలుగా ఆయన అందించిన సేవలకు గాను గౌరవ సూచకంగా షేర్‌హోల్డర్లకు ప్రత్యేక డివిడెండ్ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆగస్టు 9న జరిగే సిల్వర్ జూబ్లీ ఏజీఎంలో నాయక్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

రూ.16,499కే జియో ల్యాప్‌టాప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ తాజాగా దేశీయ మార్కెట్లో 4జీ సిమ్ ఆధారిత ల్యాప్‌టాప్ 'జియోబుక్' పరిచయం చేసింది. ధర రూ.16,499. బరువు 990 గ్రాములు. జియో ఓఎస్, డ్యూయల్ బ్యాండ్ వైఫై, 2 గిగా హెర్ట్జ్ ఆక్టా కోర్ చిప్‌సెట్, 4 జీబీ ఎల్‌పీడీడీఆర్4 ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమరీ, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ మెమరీ, 11.6 అంగుళాల యాంటీ–గ్లేర్ హెచ్‌డీ డిస్‌ప్లే, ఇన్ఫినిటీ కీబోర్డ్, లార్జ్ మల్టీ గెస్చర్ ట్రాక్‌ప్యాడ్‌తో తయారైంది. హెచ్‌డీ వెబ్ క్యామ్, స్టీరియో స్పీకర్స్, వైర్‌లెస్ ప్రింటింగ్, ఇంటిగ్రేటెడ్ చాట్‌బాట్, స్క్రీన్ ఎక్స్‌టెన్షన్, ఇన్‌బిల్ట్ యూఎస్‌బీ, హెచ్‌డీఎంఐ పోర్ట్స్ వంటి హంగులు ఉన్నాయి. 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ ఉందని కంపెనీ తెలిపింది. ఆగస్ట్ 5 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. రిలయన్స్ డిజిటల్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లతోపాటు అమెజాన్‌లో లభిస్తుంది.



జోస్ ఆలుక్కాస్ శుభ మాంగళ్యం బ్రైడల్ కలెక్షన్స్-2023



చెన్నై: పెళ్లిళ్ల సీజన్‌కు మరింత శోభను చేకూర్చేందుకు జోస్ ఆలుక్కాస్ ''శుభ మాంగళ్యం బ్రైడల్ కలెక్షన్ – 2023 ఫెస్టివ్ ఎడిషన్'' ను ఆవిష్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆభరణాల కలెక్షన్‌ను సినీ నటులు కీర్తి సురేశ్, అనార్కలి మారికర్‌లు ప్రారంభించారు. ఇందులోని ప్రతి ఆభరణాన్ని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపొందించామని సంస్థ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు. స్వచ్ఛమైన బంగారు ఆభరణాలపై 4.99% తరుగు చార్జీలు ఆఫర్ చేస్తుంది. వజ్రాభరణాలపై 20%, ప్లాటినం వస్తువులపై 7% డిస్కౌంట్ అందిస్తుంది. ఎస్‌బీఐ కార్డు, పెళ్లి కోసం బంగారం కొనుగోలుపై 5% ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ఆఫర్ లభిస్తుంది. ఇప్పటికే ఆభరణాల బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కలెక్షన్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాలు పాల్గొన్నారు

ఆర్మీలో స్పెషల్ ఎంట్రీ

జాబ్స్ ఇన్ఫో

» ఎన్‌సీసీ పట్టభద్రులకు అవకాశం
» ఇంటర్వ్యూ ద్వారా నియామకాలు

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం ఇండియన్ ఆర్మీ ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా 55 పోస్టులను భర్తీ చేయనుంది. మహిళలు సహా అవివాహిత పట్టభద్రులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు మంచి హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలు పొందవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 55(వీటిలో 50 పురుషులకు, 5 మహిళలకు). ఈ రెండు విభాగాల్లోనూ 6 పోస్టులు(పురుషులకు 5, మహిళలకు1) యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు.

ఎన్‌సీసీ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఏడాదికి రెండుసార్లు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తోంది.

అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సి సర్టిఫికెట్‌లో కనీసం బి గ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ అవసరం లేదు.

» **వయసు:** 01.01.2024 నాటికి 19–25 ఏళ్ల మధ్య ఉండాలి. జనవరి 02,1999–జనవరి 1 2005 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులు.

ఎంపిక ఇలా

వచ్చిన దరఖాస్తులను వారి అకడమిక్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా వడపోతలో నిలిచినవారికి సెలక్షన్ కేంద్రాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు బెంగళూరులో ఇంటర్వ్యూలు ఉంటాయి. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఇవి జరుగుతాయి. రెండు దశల్లో అయిదు రోజులపాటు ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. మొదటి రోజు స్టేజ్–1లో అర్హత సాధించిన వారిని మాత్రమే ఆ తర్వాత 4 రోజులపాటు నిర్వహించే స్టేజ్–2 ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. స్టేజ్–2లో విజయం సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణలోకి తీసుకుంటారు.

శిక్షణ-వేతనాలు

ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడెమీ, చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ట్రెనింగ్ సమయంలో ప్రతి నెల రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రధానం చేస్తుంది.వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా పదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అనంతరం ఆర్మీ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల మేరకు కొందరిని పర్మనెంట్ కమిషన్‌లోకి(శాశ్వత ఉద్యోగం) తీసుకుంటారు. మిగిలిన వారికి మరో నాలుగేళ్ల పాటు సర్వీస్ పొడిగిస్తారు. అనంతరం వైదొలగాల్సి ఉంటుంది.

పదోన్నతులు ఇలా

లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల అనుభవంతో మేజర్, 13 ఏళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలకు చేరుకోవచ్చు. విధుల్లో చేరిన వారికి ప్రతి నెల రూ.56,100 మూలవేతనంతోపాటు మిలిటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్‌ఆర్ఏ, ఇతర అలవెన్సులు లభిస్తాయి. మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా వేతనంగా అందుకోవచ్చు. ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 03.08.2023
» **వెబ్‌సైట్:**www.joinindianarmy.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం

నిమ్స్, హైదరాబాద్‌లో ఎమ్మెస్సీలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2023 సంవత్సరానికి సంబంధించి జెనెటిక్ ఎంఎస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 02; **కోర్సు వ్యవధి:** రెండేళ్లు
» **అర్హత:** బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/బీఈ,బీటెక్(బయోటెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్/బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోలాజికల్ సైన్సెస్) లేదా ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీలకు చివరితేది:**09.08.2023
» **వెబ్‌సైట్:** nims.edu.in

» విడుదలైన క్యాట్ 2023 నోటిఫికేషన్
» రేపటి నుంచే దరఖాస్తు ప్రక్రియ
» నవంబర్ 26న క్యాట్
» మూడు విభాగాల్లో పరీక్ష

మేటి ఐఐఎంలకు.. 'క్యాట్' దారి!

మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో.. ఐఐఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఈ క్యాంపస్‌ల్లో అడుగు పెట్టేందుకు మార్గం.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)! దేశవ్యాప్తంగా లక్షల మంది ఎంబీఏ అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూసే క్యాట్ 2023 నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 26న ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్)లో పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ 2023 వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఐఐఎంల ఎంపిక విధానంపై ప్రత్యేక కథనం..

ఐఐఎంలు మేనేజ్‌మెంట్ విద్యలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ.. భవిష్యత్ మేనేజర్లను తీర్చిదిద్దుతున్న మేటి ఇన్‌స్టిట్యూట్స్. వీటిలో ప్రవేశానికి ఏటా నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). 2024 ప్రవేశాలకు సంబంధించి క్యాట్–2023ను నవంబర్ 26న నిర్వహించనున్నారు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచి కృషి చేస్తే.. క్యాట్‌లో బెస్ట్ పర్సంటైల్ సొంతం చేసుకొని ఐఐఎంల నుంచి ఇంటర్వ్యూ కాల్స్‌ను అందుకునే అవకాశం దక్కించుకోవచ్చు. ఐఐఎంల్లో ప్రవేశాలకు పోటీ తీవ్రంగా ఉంటుంది. క్యాట్–2020కు 1,90,143 మంది, క్యాట్–2021కు 1,91,660 మంది, క్యాట్–2022కు 2,22,184 మంది అభ్యర్థులు హాజరు కావడమే ఇందుకు నిదర్శనం.

అర్హత

- క్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి(ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి).
- బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

20 క్యాంపస్‌లు.. 4 వేల సీట్లు

కామన్ అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ఆధారంగా దేశంలోని 20 ఐఐఎం క్యాంపస్‌ల్లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ల్లో దాదాపు 4 వేల సీట్లను భర్తీ చేస్తారు. ఐఐఎంలతోపాటు మరెన్నో ఇతర బీ స్కూల్స్ సైతం క్యాట్ స్కోర్ ఆధారంగా ఎంబీఏలో ప్రవేశం కల్పిస్తున్నాయి.

మూడు విభాగాల్లో పరీక్ష

ప్రతి ఏటా క్యాట్‌లో ఏదో ఒక మార్పు కనిపిస్తోంది. ఈ మార్పు ప్రశ్నల సంఖ్యలోనే ఉంటుందని.. విభాగాల్లో పెద్దగా మార్పు ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా క్యాట్ పరీక్షను మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. ఆ వివరాలు..:

- **విభాగం–1:** వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్.
- **విభాగం–2:** డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్.
- **విభాగం–3:** క్వాంటిటేటివ్ ఎబిలిటీ.

ప్రశ్నల సంఖ్య

గత ఏడాది వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలతో.. 198 మార్కులకు పరీక్ష నిర్వహించారు. ఈసారి కూడా ఇదే తీరులో ఆయా విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించాలంటే.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నాలెడ్జ్‌లను పెంచుకోవడానికి కృషి చేయాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పేరాగ్రాఫ్‌లను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో.. బెస్ట్ స్కోర్ కోసం అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్

ఇందులో విశ్లేషణాత్మక నైపుణ్యం, లాజికల్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో మెరుగైన స్కోర్ సాధించాలంటే.. టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలంటే.. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్ అండ్ టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీ టాపిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

కటాఫ్ పర్సంటైల్

క్యాట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందేలా కృషి చేయాలి. ఎందుకంటే.. ఐఐఎంలు మలి దశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు క్యాట్‌లో నిర్దిష్టంగా సెక్షనల్ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఓవరాల్ కటాఫ్ కనిష్టంగా 85 పర్సంటైల్, గరిష్టంగా 90 పర్సంటైల్ పొందాలి. అదే విధంగా సెక్షనల్ కటాఫ్ 75 నుంచి 80 పర్సంటైల్ వరకూ ఉంటోంది.



క్యాట్-2023

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

క్యాట్‌లో మెరుగైన స్కోర్, పర్సంటైల్ సాధించేందుకు ప్రతి సెక్షన్ కీలకంగా నిలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. తొలుత సిలబస్‌ను పరిశీలించి..అందులోని అంశాలు, వాటికి సంబంధించి కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక మెటీరియల్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. దీంతో పాటు ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయాలి.

మాక్, మోడల్ టెస్ట్‌లు

అభ్యర్థులు గత ఏడాది క్యాట్‌లో ఎక్కువ వెయిటేజీ లభించిన అంశాలను గుర్తించి వాటిపై అధికంగా దృష్టి పెట్టాలి. ఆయా టాపిక్స్‌కు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించి.. ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ప్రతి యూనిట్ చివర్లో ఉండే మోడల్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి. అదేవిధంగా మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ఎంతో మేలు చేస్తుంది. వీటి ఫలితాలను విశ్లేషించుకుని ఇంకా పట్టు సాధించాల్సిన టాపిక్స్‌ను గుర్తించి వాటిపై మరింత ఎక్కువ దృష్టి సారించాలి. ఇలా ఒకవైపు సబ్జెక్ట్ ప్రిపరేషన్ సాగిస్తూనే.. మరోవైపు నిరంతరం ప్రాక్టీస్‌కు, నమూనా పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్కోర్ పెంచుకోవచ్చు.

మలిదశలో.. మరో ప్రక్రియ

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు మలి దశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. వీటికి నిర్దిష్ట వెయిటేజీ కేటాయించే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఆయా ఐఐఎంల గత ప్రవేశ విధానాలను పరిశీలిస్తే.. క్యాట్ స్కోర్‌కు 50 నుంచి 70 శాతం, జీడీ/పీఐలకు 30 నుంచి 50 శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్ స్కోర్‌తోనే ప్రవేశం ఖరారవుతుందని భావించకుండా.. అభ్యర్థులు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లలోనూ రాణించేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలి.

జీడీ, పీఐలు ఇలా

గ్రూప్ డిస్కషన్స్(జీడీ)లో అభ్యర్థులను నిర్దిష్ట సంఖ్యలో బృందాలుగా విభజించి.. ప్రతి బృందానికి ఏదైనా టాపిక్ ఇచ్చి దానిపై మాట్లాడమంటారు. ఒక్కో బృందంలో ఎనిమిది నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. జీడీ సమయంలోనే కొన్ని ఐఐఎంలు రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తున్నాయి. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశంపై తమ అభిప్రాయాలను పద పరిమితితో రాయాలని సూచిస్తున్నాయి. ఈ రెండు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు మేనేజ్‌మెంట్ విద్యనే అభ్యసించాలనుకోవడానికి కారణం ఏంటి.. భవిష్యత్తు లక్ష్యాలు, ఆసక్తులు, అభిరుచులు తదితర కోణాల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. వీటన్నింటినీ విజయవంతంగా పూర్తి చేసుకుని తుది జాబితాలో నిలిస్తే ఐఐఎంలో సీటు ఖరారైనట్లే!

ఐఐఎంలు - పీజీ సీట్లు

అహ్మదాబాద్–445 సీట్లు; బెంగళూరు–412; కోల్‌కత–480; లక్నో–436; ఇండోర్–451; నాగ్‌పూర్–225; ఉదయ్‌పూర్–325; త్రిచీ–260; కాశీపూర్–90; కోజికోడ్–375; బోధ్‌గయ–120; రోహతక్–264; రాంచీ–185; సిర్మౌర్–120; అమృత్‌సర్–160; షిల్లాంగ్–92, రాయ్‌పూర్ –90; జమ్ము–90; సంబల్‌పూర్–90; విశాఖపట్నం–120 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 02.08.2023
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 13.09.2023
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్:** అక్టోబర్ 25– నవంబర్ 26, 2023 వరకూ
- **క్యాట్ పరీక్ష తేదీ:** 26.11.2023
- **ఫలితాల వెల్లడి:** 2024, జనవరి రెండో వారంలో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://iimcat.ac.in



లైన్ 1, 2లో 120 స్పీడ్

- ఓఆర్ఆర్‌పై లైన్ 3, 4లో 80 కి.మీ.
- వేగ పరిమితిపై నోటిఫికేషన్ జారీ చేసిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్‌పై (ఓఆర్ఆర్) వేగ పరిమితి పెంచుతూ సైబరాబాద్ పోలీసులు నోటిఫికేషన్ జారీ చేశారు. శుక్రవారం నాటి ఈ ఉత్తర్వులు సోమవారం వెలుగులోకి వచ్చాయి. వీటి ప్రకారం ఇక ఔటర్‌పై ప్రయాణించే వాహనాల గరిష్ట వేగం గంటకు 100 నుంచి 120 కి.మీ.కు పెరిగింది. డివైడర్ పక్కన ఉన్న లైన్-1, దానికి ఎడమ వైపు ఉండే లైన్-2లో ప్రయాణించే వాహనాలకు ఇది వర్తిస్తుంది. ఈ లైన్లలో వాటి కనిష్ట వేగాన్ని గంటకు 80 కి.మీ.గా నిర్ధారించారు. అలాగే లైన్-3, లైన్-4లో గరిష్ట వేగం 80 కి.మీ., కనిష్ట వేగం 40 కి.మీ.గా పేర్కొన్నారు. ఓఆర్ఆర్‌పై కనిష్ట వేగం గంటకు 40 కి.మీ. అని, అంతకంటే తక్కువ వేగంతో ప్రయాణించే వాహనాలను దీనిపైకి అనుమతించబోమని అధికారులు స్పష్టంచేశారు. వేగంగా ప్రయాణించే వాహనాలు లైన్ 1, 2ల్లో, తక్కువ వేగంతో వెళ్లేవి లైన్-3, 4ల్లో ప్రయాణించాలని, భారీ వాహనాలు కచ్చితంగా 3, 4 లైన్లలోనే వెళ్లాలని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. వేగాన్ని తగ్గించుకునే వాహనాలు నిర్దిష్ట విధానంలో లైన్ మారాలని, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌కు తావు లేదని చెప్పారు. లైన్ మారే వాహనాలు ఇండికేటర్ల వినియోగంతోపాటు ఇతర నిబంధనల్ని పాటించడం తప్పనిసరి చేశారు. ఓఆర్ఆర్‌పై ఏ ఒక్క లైన్‌లోనూ వాహనాలు ఆపకూడదు. అనివార్య కారణాలు, మరమ్మతులకు గురై ఆగే వాహనాలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. ఔటర్‌పై వాహనాలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడంతోపాటు పాదచారుల ప్రవేశం నిషిద్ధం. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతోపాటు సెవెన్ సీటర్ ఆటోలకు ఔటర్‌పైకి ప్రవేశం లేదు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఎంట్రీ-ఎగ్జిట్‌లకు వ్యతిరేకంగా వాహనాలు రావడం కూడా నిషిద్ధం.

డిజిటల్ లైఫ్‌లో యాంటీ వైరస్!

- ముప్పేట పెరుగుతున్న వైరస్ ఎటాక్‌లు
- సమాచార భద్రత కోసం యాంటీ వైరస్‌ల వాడకం పెరగాలంటున్న నిపుణులు

ఇప్పుడంతా టెక్నాలజీ జమానా.. రోజూ కొన్ని గంటలు కంప్యూటర్ స్క్రీన్ల ముందో.. ల్యాప్‌టాప్‌పైనో... స్మార్ట్‌ఫోన్ వాడటంలోనో గడిచిపోతున్నాయి. డిజిటల్ లైఫ్ స్టైల్‌తో ఎన్ని సదుయాపాలు వచ్చాయో.. అంతేస్థాయిలో సమస్యలూ పెరుగుతున్నాయి. సంస్థలైనా, వ్యక్తులైనా సమాచార చోరీకి అతీతులేం కాదు. ఆన్‌లైన్‌లో మన ఖాతాలు కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు 'వైరస్'లతో పొంచి ఉంటున్నారు.. సైబర్ దాడులను ఎలా తిప్పికొట్టాలి? అనే విషయాలేంటో చూద్దాం..!

సాక్షి, హైదరాబాద్: మన డివైజ్‌లను కాపాడుకోవాలంటే యాంటీ వైరస్ తప్పని సరి. ప్రస్తుతం డిజిటల్ వినియోగం పెరుగుతున్న రీతిలో యాంటీ వైరస్‌ల వాడకం పెరగడం లేదు. ఓ సంస్థ అధ్యయనంలో తేలిందేమంటే.. 89 శాతం డెస్క్‌టాప్ యూజర్లు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు వాడుతుండగా... ల్యాప్‌టాప్ యూజర్లు మాత్రం 70 శాతం మందే వాడుతున్నారు. అలాగే, స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారిలో సగానికిపైగా యూజర్లకు మొబైల్ ఫోన్లలోనూ యాంటీ వైరస్ వాడితే మేలన్న విషయం తెలియదని స్టాటిస్టా సంస్థ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. మొబైల్ ఫోన్లను టార్గెట్ చేసేలా వైరస్ కోడ్‌లు రాసే వారూ పెరిగారని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో సమాచారం చోరీ అనేది చాలా పెద్ద అంశమని అంటున్నారు.



దాడులు ఇలా..

మనం ఒక ఫైల్ లేదా లింక్ డౌన్‌లోడ్ చేయడం ద్వారా అది ఒక పదాన్ని, కంటెంట్‌ను రిపీటెడ్‌గా రాయడం అన్నది ఒకప్పటి వైరస్.. కానీ ఇప్పుడు అది రూపాంతరం చెందింది. అవి ఎలా అంటే..

వైరస్: మన సిస్టంలోకి వచ్చాక స్టోరేజీని పాడు చేసేవి. సంబంధిత అప్లికేషన్ డౌన్‌లోడ్ చేస్తేనే ఇవి మన సిస్టంలోకి వస్తాయి.

వార్మ్: మనం ఎలాంటి ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకున్నా అవి మన హోస్ట్ ప్రోగ్రాంల ద్వారా మన సిస్టంలోకి వచ్చే వైరస్ రకాలు. అవి నెట్‌వర్క్ ద్వారా మనకు కనెక్టయ్యే సిస్టంలోకీ చొరబడతాయి.

ట్రోజన్స్: ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే కొన్ని ఫ్రీ సాఫ్ట్‌వేర్‌లను మనం డౌన్‌లోడ్ చేస్తుంటాం. వాటిలో మనకు తెలియకుండానే ట్రోజెన్ వైరస్‌లను పంపుతారు. ఇవి మన సిస్టంలోకి వచ్చాక మన ఫైల్స్‌ను డిస్టర్బ్ చేయదు కానీ, మన ఫైల్స్‌ను మనకు తెలియకుండానే అవతలి వ్యక్తికి (ఎవరైతే ట్రోజెన్ పంపారో వాళ్లకు) చేరవేస్తాయి. ఇది చాలా ప్రమాదకరమైంది.

డార్క్‌వెబ్‌లో బ్రోకర్లు: ర్యాన్సమ్‌వేర్ ఎటాక్‌లో లాక్ చేసిన తర్వాత ఆ సమాచారం కావాలంటే బిట్‌కాయిన్స్‌లో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నవారు ఒక బ్యాచ్ అయితే.. డార్క్‌నెట్‌లో ఇలాంటి బేరాలు కుదిర్చే బ్రోకర్లు మరో బ్యాచ్. ఒక పెద్ద కంపెనీ డాటా హ్యాక్ చేసి హ్యాకర్ డార్క్‌వెబ్‌లోని బ్రోకర్‌కు సమాచారం ఇస్తాడు. ఆ బ్రోకర్ హ్యాకర్ తరఫున సదరు కంపెనీతో బేరసారాలు చేసి చివరకు ఎంత చెల్లిస్తే డేటా తిరిగి ఇస్తామన్నదానిపై బేరం కుదుర్చుతాడు.

- ప్రపంచవ్యాప్తంగా రోజూ **5,60,000** మాల్‌వేర్ ఎటాక్‌లను యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌లు కనిపెడుతున్నాయి.
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా సైబర్ ఎటాక్‌ల ముప్పు **38** శాతం పెరిగింది.
- సైబర్ సెక్యూరిటీ నిపుణుల కొరత పెరుగుతోంది. 2025 నాటికి ఇది ప్రపంచవ్యాప్తంగా **35** లక్షలకు చేరుతుంది.
- సైబర్ సెక్యూరిటీ మార్కెట్ 2026 నాటికి **51.6** బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా.
- భారత్‌లో సైబర్ సెక్యూరిటీపై పెట్టే ఖర్చు 2025 నాటికి రూ.**226** కోట్లకు చేరుతుందని అంచనా
- భారత్‌లో యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2024 వరకు రూ.**14,782** కోట్లకు చేరవచ్చని అంచనా.
- యాంటీవైరస్ వాడుతున్న వారిలో **62** శాతం మంది 34 ఏళ్ల లోపు వారే. 35-54 ఏళ్ల మధ్య ఉన్న వారు **23** శాతం, 55 ఏళ్లు ఆపైన వయస్సు వారు **15** శాతం మంది యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు వాడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉచిత సాఫ్ట్‌వేర్‌లు

మొబైల్ ఫోన్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా యాంటీ వైరస్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చిందన్న విషయం చాలామందికి తెలియదు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో సైబర్ స్వచ్ఛ కేంద్ర అనే వెబ్‌సైట్‌లోకి https://www.csk.gov.in/-security& tools.html ఈ లింక్ ద్వారా వెళితే.. ఆండ్రాయిడ్ మొబైల్స్ కోసం సెక్యూరిటీ అప్లికేషన్, ఈస్కాన్ యాంటీ వైరస్, కే7 సెక్యూరిటీ, క్విక్‌హీల్ వంటి వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఈ జాగ్రత్తలు అలవాటు చేసుకోండి..

- మనం ఏదైనా బ్రౌజర్ వాడిన తర్వాత అందులో కుకీస్‌ను, హిస్టరీని డిలీట్ చేయడం అలవాటు చేసుకోవాలి.
- గూగుల్ ప్లే స్టోర్‌లోనూ ప్లే ప్రొటెక్ట్ ఆప్షన్స్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.
- సేఫ్ బ్రౌజర్ ఆప్షన్స్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.
- మనకు తెలియని అపరిచిత యాప్‌లను ఎట్టిపరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయొద్దు.
- అడ్వాన్స్‌డ్ సెట్టింగ్స్‌లో డివైజ్ కంట్రోలర్‌లో మనకు తెలియకుండా వచ్చి చేరిన యాప్స్‌ను గుర్తించి డిలీట్ చేయాలి.
- చాలా సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ యాంటీ వైరస్‌ను మల్టీపర్పస్‌గా కూడా విక్రయిస్తుంటాయి. డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ కలిపి ఒక యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌కు ఏడాదికి రూ. వెయ్యితో ఇస్తుంటాయి. నెలకు రూ.200 వరకు ఖర్చు చేయగలిగినా మనం మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను వాడుకోవచ్చు.

నిర్లక్ష్యం వద్దు



వైరస్ ఎటాక్‌లు పెరుగుతున్నందున యాంటీవైరస్‌ల వాడకంలో నిర్లక్ష్యం వద్దు. డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్ ఏదైనా ఉత్తమ యాంటీ వైరస్‌లను వాడితే మంచిది. కొద్దిపాటి జాగ్రత్తలతో వైరస్ ముప్పును తప్పించుకోవచ్చు. డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లతో సమానంగా ఫోన్లకు సైతం వైరస్ ఎటాక్‌లు ఇటీవల పెరిగాయన్నది గుర్తించాలి. అందువల్ల యాంటీ వైరస్‌ల వాడకం పెరగాల్సిన అవసరం ఉంది.

–డా.ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఢిల్లీ

వైరస్‌ను ఇలా గుర్తించవచ్చు


- మన డివైజ్‌లో వైరస్ ఎటాక్ అయినట్లయితే మనకు తెలియకుండానే ఫైల్ స్టోరేజీ మేనేజర్‌లో కొత్త ఫైల్స్ క్రియేట్ అవుతాయి.
- మన మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌లో ఇంటర్నల్ స్టోరేజ వాడకానికి మించి నిండిపోతుంది.. కానీ ఫైల్స్ మాత్రం మనకు కనిపించవు.



- బ్యాటరీ త్వరగా డిశ్చార్జ్ అవుతున్నా కూడా వైరస్ ఉందని అనుమానించవచ్చు.



టుడేస్ గ్రాఫిక్



10 ఏళ్లకే కంపెనీ సీఈవో.. 12 ఏళ్లకే రిటైర్‌మెంట్!!



అసలు ఎవరైనా ఎన్నేళ్ల వయసులో రిటైర్ అవుతారు.. 58, 60, 65, 70.. మరి ఓ కంపెనీ సీఈవో 12 ఏళ్ల వయసులో రిటైర్ అయితేనో! అదీ తన బర్త్‌డే రోజునే ఆ పదవి నుంచి దిగిపోవాలని నిర్ణయించుకుంటేనో!! అస్సలు నమ్మబుద్ధి కావడం లేదు కదూ..

హోంవర్క్ చేయా ల్సిన వయసులో ఆఫీసు వర్క్ చేయడం ఏమిటి? అనేదేగా మీ డౌటు. విషయం తెలియా లంటే.. పదండి మరి ఆస్ట్రేలియాకు.. ఎందుకంటే.. పిక్సీ ఉండేది అక్కడే మరి..

పిక్సీ కర్టిస్.. చిన్నప్పటి నుంచే చురుకైన పిల్ల.. బుర్రలో బోలెడన్ని ప్లాన్లు. దీనికి ఆమె తల్లి రాక్సీ జెసెన్కో ప్రోత్సాహం తోడైంది. రాక్సీ సిడ్నీలోని ఓ పీఆర్ కంపెనీ డైరెక్టర్. పిక్సీ చిన్న వయసులోనే పలు కంపెనీల ఉత్పత్తులకు మోడల్‌గా పనిచేసింది. పిక్సీస్ బౌ పేరిట హెయిర్ బౌస్‌ను అమ్మింది కూడా. అయితే, కరోనా సమయంలో తన దశ తిరిగింది. 2021లో తల్లితో కలిసి పిక్సీస్ ఫిడ్జెట్స్ పేరిట ఆట బొమ్మల ఆన్‌లైన్ స్టోర్‌ను ప్రారంభించింది. అది సక్సెస్ కావడంతో ఆస్ట్రేలియాలో పిక్సీ యంగెస్ట్ అంట్రప్రెన్యూర్‌గా మారిపోయింది. ఆమె నెల సంపాదన రూ. కోటికి పైనే. తనకు సొంత బెంజ్ కారు కూడా ఉంది. ఇన్నాళ్లూ ఆఫీసు వర్కుతో బిజీబిజీగా గడిపిన పిక్సీ ఇప్పుడు స్కూల్ హోంవర్క్ మీద దృష్టి పెట్టాలని నిర్ణయించుకుంది. తల్లి కూడా అదే చెప్పడంతో తన 12వ బర్త్‌డే రోజున రిటైర్ కానుంది. దీనికితోడు పిక్సీ కుటుంబం ఆమె తండ్రి కర్టిస్ పనిచేస్తున్న సింగపూర్‌కు షిఫ్ట్ అవ్వాలని నిర్ణయించుకోవడంతో గత శనివారం ప్రీ బర్త్‌డే కం రిటైర్‌మెంట్ పార్టీని కూడా ఇచ్చారు. సింగపూర్ థీమ్‌తో సాగిన ఈ పార్టీకి వచ్చినవాళ్లందరికీ రూ.4,112 విలువ చేసే స్కిన్‌కేర్ ఉత్పత్తులతో కూడిన బహుమతిని కూడా ఇచ్చారు. ఈ గిఫ్ట్‌ను ఆస్ట్రేలియా లగ్జరీ బ్యూటీ బ్రాండ్ ఎంకోబ్యూటీ స్పాన్సర్ చేసింది. అదండీ.. 12 ఏళ్లకే తన బర్త్‌డే రోజున రిటైర్ అవుతున్న ఓ సీఈవో సంగతి.. ఇంతకీ పిక్సీ బర్త్‌డే కం రిటైర్‌మెంట్ డేట్ చెప్పలేదు కదూ.. **ఆగస్టు 16.**


ప్రీ బర్త్‌డే పార్టీలో పిక్సీ



నేడు సీఎం చేతుల మీదుగా 108 వాహనాల ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నెక్లెస్‌రోడ్‌లో 108, అమ్మఒడి, హెర్సె వాహనాలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అందించే అత్యవసర సేవల నిమిత్తం కొత్తగా 466 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. కొనుగోలు చేసిన వాహనాలపై 108, 102 అనే హెల్ప్‌లైన్ సేవల నంబర్లు స్పష్టంగా కనిపించేలా బ్రాండింగ్ చేశారు. వాటిపై సీఎం కేసీఆర్ ఫొటో, ప్రభుత్వ లోగో ముద్రించారు. పార్థివ వాహనాల సేవలు ఉచితంగా అందిస్తామనే విషయాన్ని తెలిపేవిధంగా హెర్సె వాహనాలపై ఉచితసేవ అని ముద్రించారు.

కాకుల కొట్లాట.. తెగిన కేవీ లైన్



కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ తీగలపైనే కాకులు పెద్ద ఎత్తున కొట్లాటకు దిగడంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో కరెంటు షాక్‌కు గురై రెండు కాకులు చనిపోయాయి. ఈ ఘటన కరీంనగర్‌లోని రాంనగర్ ఫీడర్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. రాంనగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం 11 కేవీ విద్యుత్ తీగలపై కాకులు కొట్లాటకు దిగాయి. ఈ క్రమంలో విద్యుత్ వైరు తెగిపడింది. అదేవిధంగా కండక్టర్ కాలిపోవడంతో స్థానికంగా కరెంటు సరఫరా స్తంభించింది. వెంటనే అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది మరమ్మతు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బంది ఘటనాస్థలంలో పరిశీలించగా రెండు కాకులు కరెంటు షాక్‌కు గురై కిందపడి మృతి చెంది ఉన్నాయి.



ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ధర్నా

కామారెడ్డి క్రైం : విద్యార్థుల సంఖ్యను బట్టి తమ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం భవానీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భవానీపేట ప్రాథమిక పాఠశాలలో 75 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వీరందరికీ ఒకే ఉపాధ్యాయురాలే పనిచేస్తున్నారని వెల్లడించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో ఇద్దరు ముగ్గురు టీచర్లను కేటాయించాలని కోరారు.


అంబానీ.. అదానీ ఓకే.. మరి మనం...

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఓసారి మస్క్ అని మరోసారి మరొకరని.. ఒకదాంట్లో అంబానీ టాప్ అని.. మరొకదాంట్లో అదానీ అని.. ఇలా అత్యంత కుబేరుల జాబితాలు ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి..

ఇంతకీ దేశంలో టాప్ 1 శాతం రిచెస్ట్ జాబితాలో చేరాలంటే.. ఎంత సంపద ఉండాలో మీకు తెలుసా?



తెలియదు కదా.. అందుకే ఆ పనిని గ్లోబల్ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ చేసిపెట్టింది. వివిధ దేశాల్లో టాప్ 1 శాతం ధనవంతుల జాబితాలో చేరాలంటే.. వ్యక్తిగత నికర సంపద కనీసం ఎంత ఉండాలి(కటాఫ్ మార్క్) అన్న వివరాలను విడుదల చేసింది. దీని ప్రకారం వ్యక్తిగత నికర సంపద(అప్పులన్నీ తీసేయగా మిగిలినది) కనీసం రూ.1.4 కోట్లు ఉంటే చాలు.. మీరు మన దేశంలోని 1 శాతం ధనవంతుల జాబితాలోకి ఎంట్రీ ఇచ్చినట్లే. ప్రపంచంలో ధనికులు ఎక్కువగా ఉండే మొనాకోలో ఇది రూ.102 కోట్లుగా ఉంది. ఈ జాబితాలో మొనాకోదే ఫస్ట్ ప్లేస్.



– సాక్షి సెంట్రల్‌డెస్క్

ముగ్గురు తెలంగాణ పోలీసులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణ పోలీసు సర్వీసుకు చెందిన ముగ్గురు పోలీసు అధికారులను ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ సోమవారం కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2021 బ్యాచ్‌లో ఆర్.వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీనివాస్, డి.మురళీధర్‌లను తెలంగాణకు కేటాయించారు. ఒక ఏడాది పాటు ఈ ముగ్గురు ప్రొబేషన్ పీరియడ్‌లో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రన్‌వే విస్తరణకు హైవే అడ్డంకి

- రోడ్డు మార్గం మార్చాలని ప్రభుత్వాన్ని కోరాం
- ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఎయిర్ కమాండింగ్ ఆఫీసర్ పంకజ్‌జైన్



సాక్షి, హైదరాబాద్: హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ రన్‌వే విస్తరణకు సరిహద్దు వెంటే వెళుతున్న సిద్దిపేట-కరీంనగర్ రహదారి అడ్డంకిగా మారిందని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఎయిర్ కమాండింగ్ ఆఫీసర్ పంకజ్ జైన్ పేర్కొన్నారు. సాధారణంగా శిక్షణ కేంద్రాల్లో రన్‌వేలు తొమ్మిది వేల ఫీట్లకు పైగా పొడవు ఉంటాయనీ కానీ, ఈ స్టేషన్‌లో కేవలం ఏడు వేల ఫీట్లు మాత్రమే ఉండడంతో శిక్షణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని తాము రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూల స్పందన వచ్చిందని వెల్లడించారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సోమవారం మీడియా ఓరియెంటేషన్ కాప్సుల్ కార్యక్రమం అనంతరం పంకజ్ జైన్ విలేకరులతో మాట్లాడారు. రన్‌వే విస్తరణ కోసం సిద్దిపేట-కరీంనగర్ స్టేట్ హైవేను ప్రస్తుతం ఉన్నట్టుగా కాకుండా దానిని కొంత మార్పు చేయాలని, లేదంటే అండర్ పాస్ నిర్మించాలని తాము సూచించినట్లు తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ప్రహరీ నుంచి వంద మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనీ కానీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. భారత వాయుసేనలో ప్రస్తుతం 17 శాతం మంది మహిళా అధికారులు విధుల్లో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ గ్రూప్ కెప్టెన్ జశ్వంత్ పటేల్, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ గ్రూప్ కెప్టెన్ పి రవికుమార్, బేగంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ గ్రూప్ కెప్టెన్ శివం పీకే వాసన్, బీదర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ గ్రూప్ కెప్టెన్ సత్యేంద్ర సింగ్ రానా పాల్గొన్నారు.

నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీ స్థాపించండి

హిటాచీ గ్రూపు గ్లోబల్ లాజిక్‌కు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించాలని ప్రముఖ హిటాచీ గ్రూపు సబ్సిడరీ సంస్థ గ్లోబల్ లాజిక్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ గురు కమకొలను, కంటెంట్ ఇంజనీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ మోహన్ వీరవల్లి తదితరులు కవితతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్ కూడా పాల్గొన్నారు.

రన్@50 కేఎం

- 25 దేశాలు.. రన్నర్లు 300పైనే
- నెక్లెస్ రోడ్డులో నవంబర్ 5న ప్రారంభించనున్న సచిన్ టెండూల్కర్

సాక్షి, హైదరాబాద్: రెండు మెగాస్పోర్ట్స్ ఈవెంట్లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అల్ట్రారన్నర్స్ (ఐఏయూ), అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ)లకు అనుబంధంగా ఎన్ఈబీ స్పోర్ట్స్ ''ఐఏయూ 50 కిలోమీటర్ల ప్రపంచ చాంపియన్‌షిప్-2023, ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ హాఫ్ మారథాన్-2023''లను నవంబర్ 5వ తేదీన నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్నారు. ఏజెస్ ఫెడరల్ బ్రాండ్ అంబాసిడర్ సచిన్‌టెండూల్కర్, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ ఈ రేసులను జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ చాంపియన్‌కు సంబంధించిన విలేకరుల సమావేశం సోమవారం హోటల్ మేరీగోల్డ్ వేదికగా జరిగింది. ఐఏయూ అధ్యక్షుడు నదీమ్‌ఖాన్ మాట్లాడుతూ జూలైలో బెంగళూరులో ఐఏయూ 100 కిలోమీటర్ల ఆసియా ఓషియానియా చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించిన తర్వాత, మొట్టమొదటి అల్ట్రా వరల్డ్ చాంపియన్‌షిప్‌ను భారత్‌కు తీసుకురావడం మంచి పరిణామమని తెలిపారు. అల్ట్రా రన్నింగ్ చాలా సవాళ్లతో కూడిన క్రీడ, ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ స్థాయి టాప్ అల్ట్రా రన్నర్లు పాల్గొంటారన్నారు. అంతర్జాతీయ రన్నర్లతో పోటీపడటానికి భారతీయులకు ఇదొక అద్భుతమైన అవకాశమన్నారు. మూడవ ఐఏయూ చాంపియన్‌షిప్ పోటీలను స్వదేశంలో నిర్వహించడం ఎన్ఈబీ స్పోర్ట్స్‌కు గర్వకారణమని రేస్ డైరెక్టర్ నాగరాజ్ అన్నారు. వివిధ దేశాల నుంచి దాదాపు మూడు వందల మంది క్రీడాకారులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ చాంపియన్‌షిప్‌కు హైదరాబాద్ రన్నర్స్ మద్దతు అందిస్తుండగా, ఈ ఎడిషన్‌కు రోటరీక్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్-మొయినాబాద్ ఇతర సహకారం అందిస్తున్నది. కార్యక్రమంలో మాజీ డీజీపీ అనురాగ్‌శర్మ, అచలకుమార్, పలువురు మారథాన్ రన్నర్లు పాల్గొన్నారు.

- ఐఏయూ 50కిలోమీటర్ల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌తోపాటు అమెరికా, జర్మనీ, జపాన్, చైనీస్ తైపీ, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్ తదితర 25 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు.
- ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ హాఫ్ మారథాన్‌లో 21.1కే (హాఫ్ మారథాన్), 10కే, 5కే కేటగిరీలు ఉన్నాయి.



కాచిగూడ-బెంగళూరు మధ్య వందే భారత్

- చెన్నై ఐసీఎఫ్ నుంచి నగరానికి చేరుకున్న రైలు
- 6న లేదా 15న సర్వీసు ప్రారంభమయ్యే అవకాశం


చెన్నై ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వందేభారత్ రైలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ఐటీ దిగ్గజ నగరాలుగా పేరొందిన హైదరాబాద్-బెంగళూరు మధ్య వందేభారత్ రైలు సేవలు ప్రారంభం కాబోతున్నాయి. కాచిగూడ-యశ్వంతపూర్ (బెంగళూరు) స్టేషన్ల మధ్య ఈ సెమీ బుల్లెట్ రైలు పరుగుపెట్టనుంది. దక్షిణ మధ్య రైల్వేకు మూడో వందేభారత్ సర్వీసుగా అందుబాటులోకి రానున్న ఈ రైలు సేవలు ఆగస్టు 6న లేదా 15వ తేదీన లేదంటే ఆ తేదీల మధ్యలో గానీ ప్రారంభం కానున్నాయి. ఇంకా తేదీని అధికారికంగా రైల్వే బోర్డు ప్రకటించలేదు. ఆదివారం రాత్రి చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి వందేభారత్ రైలు బయలు దేరి సోమవారం ఉదయం 11గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంది.

ఎనిమిదిన్నర గంటల్లో..

ప్రస్తుతం నగరం నుంచి బెంగళూరుకు రైలు ప్రయాణ సమయం దాదాపు 11 గంటలు పడుతోంది. వందేభారత్ రైలు మాత్రం కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే బెంగుళూరు చేరుకోనుంది. కాచిగూడలో ఉదయం ఆరుగంటల సమయంలో బయలుదేరి మధ్యాహ్నం రెండున్నర వరకు బెంగుళూరు చేరుకుని, తిరిగి అక్కడ 3 గంటలకు బయలు దేరి రాత్రి పదకొండున్నర వరకు కాచిగూడకు చేరుకునే అవకాశం ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.